

పేటియం పేమెంట్స్ బ్యాంక్‌పై నిషేధం

- డిపాజిట్ల సేకరణపై ఆర్‌బిఐ

3

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 177 | విజయవాడ, గురువారం 1 ఫిబ్రవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 1 February 2024 | Rs

ఆ నాలుగు స్తంభాలపైనే దేశాభివృద్ధి

- పేదరికాన్ని నిర్మూలించాం
- ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం
- నేడు మధ్యంతర బడ్జెట్

7

కేబినెట్ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి, మంత్రులు

6,100 పోస్టులతోనే డిఎస్‌సి

- ప్రతి గ్రామ పంచాయతీకి సెక్రటరీ నియామకం
- వర్సిటీ'ల్లో బోధనేతర సిబ్బంది ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు
- పులిచింతల నిర్వాసితుల ఇళ్లకు స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు మినహాయింపు
- ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రివర్గం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిరుద్యోగుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు కుమ్మరించింది. 25 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉండగా కేవలం 6100 పోస్టులే భర్తీ చేయాలని నిర్ణయించింది. డిఎస్‌సి-2024 ద్వారా పాఠశాల విద్యాశాఖ, గిరిజన సంక్షేమం, సాంఘిక, బిసి సంక్షేమశాఖల పరిధిలోని పాఠశాలల్లో ఈ పోస్టుల భర్తీకి మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌరసం బంధాలశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మీడియాకు వెల్లడించారు. డిఎస్‌సిలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు 42 ఏళ్ల వయోపరిమితి, ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు 5 ఏళ్ల వయోపరిమితిని ప్రభుత్వం సడలించింది. రాష్ట్ర వ్యాప్తంగా 185 సెంటర్లలో 15 రోజులపాటు పరీక్షల నిర్వహణ, 8 రోజులపాటు టెట్ నిర్వహణ చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. 2019 నుంచి ఒక్క విద్యారంగంలోనే 14,219 టీచర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసిందని, సబ్జెక్ట్ టీచర్ల కాన్సెప్ట్ దృష్ట్యా ఏర్పాటైన 7,761 పోస్టులను మిగతా 2లో

అన్యాయం : సిపిఎం

రాష్ట్రంలో ప్రస్తుతం 20 వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీ ఉంటే ప్రభుత్వం కేవలం 6,100 పోస్టులను మాత్రమే డిఎస్సీ ప్రకటించ డం అన్యాయమని సిపిఎం విమర్శించింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం నాడు ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేశారు. గత అయిదేళ్లుగా డిఎస్సీ లేనందున మెగా డిఎస్సీ కోసం అయిదు లక్షల మంది ఆశావహులు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తుండగా, బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో కేవలం 6,100 పోస్టుల భర్తీకి మాత్రమే డిఎస్సీ ఇవ్వాలని నిర్ణయించడం వారిని తీవ్ర నిరాశపరుస్తుందని అన్నారు. మొత్తం ఖాళీలన్నిటిని భర్తీ చేసేలా డిఎస్సీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

జార్ఖండ్ సిఎం అరెస్ట్

• మోడీ డైరెక్షన్.. ఇడి యాక్షన్ • హేమంత్ సోరెన్ రాజీనామా • కొత్త సిఎంగా చంపాయ్

- గవర్నరు అనుమతి కోసం నిరీక్షణ

రాంచీ : 2024 లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలకు జార్ఖండ్‌లో హేమంత్‌సోరెన్ ప్రభుత్వం బలైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి)ని ప్రయోగించి ఏకంగా ముఖ్యమంత్రినే అరెస్టు చేయించింది. జార్ఖండ్‌ను తీవ్ర అస్థిరతలోకి నెట్టింది. మోడీ ప్రభుత్వం స్క్రిప్టునే ఇడి ఆచరణలో పెట్టింది. ఊహించినట్టుగానే బుధవారం ఇడి ఆరు గంటల పాటు సోరెన్‌ను విచారించిన అనంతరం అరెస్టు చేసింది. హేమంత్ సోరెన్‌ను తన నివాసంలోనే గృహ నిర్బంధంలో ఉంచినట్లు ఇడి వర్గాలు తెలిపాయి. నాటకీయంగా జరిగిన ఈ పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవికి హేమంత్ సోరెన్ రాజీనామా చేశారు. రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ సి.పి రాధాకృష్ణన్‌ను కలిసి రాజీనామా లేఖను సమర్పించారు. ఆ సమయంలో ఇడి అధికారులు కూడా ఆయన వెంటే ఉన్నారు. గవర్నర్ ఆయన రాజీనామాను ఆమోదించారు.

హేమంత్ సోరెన్ వారసునిగా జెఎంఎంకు చెందిన మంత్రి చంపాయ్ సోరెన్‌ను లెజిస్లేచర్ పార్టీ ఎన్నుకుంది. ఆ వెంటనే చంపాయ్ సోరెన్ రాష్ట్ర గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాలని కోరారు. హేమంత్ సోరెన్ ప్రభుత్వంలో రవాణా, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ మంత్రిగా ఆయన పనిచేశారు.. హేమంత్ సోరెన్‌కు విధేయుడిగా ఈయనకు పేరున్నది.

మొత్తం 81 మంది ఎమ్మెల్యేలున్న జార్ఖండ్ అసెంబ్లీలో.. ప్రభుత్వ ఏర్పాటుకు 41 మంది ఎమ్మెల్యేల అవసరం ఉన్నది. " మేము చంపాయ్ సోరెన్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నాం. ప్రమాణస్వీకార వేడుకకు గవర్నర్‌ను అభ్యర్థించటానికి మేము రాజ్‌భవన్‌కు వచ్చాం" అని జార్ఖండ్ మంత్రి బన్నా గుప్తా తెలిపారు. హేమంత్ అరెస్టుతో పరిణామాలను రాజ్‌భవన్ నిశితంగా పరిశీలిస్తున్నది. ప్రస్తుత పరిస్థితిపై రాజ్‌భవన్ సస్పెన్స్ కొనసాగిస్తోంది. మంగళవారం అధికారిక నివాసంలో నిర్వహించిన మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్‌ను తదుపరి సీఎంగా నియమించవచ్చనే వార్తలు వెలువడినప్పటికీ.. అనూహ్యంగా చంపాయ్ సోరెన్ పేరు తెర పైకి వచ్చింది.

హేమంత్‌ను విచారించటం కోసం బుధవారం మధ్యాహ్నం రాంచీలోని హేమంత్ సోరెన్ అధికారిక నివాసానికి ఏడుగురు సభ్యుల ఈడీ బృందం చేరుకున్నది. అనంతరం ఈడీ అధికారులు ఆయనను విచారించటం ప్రారంభించారు. ఆరు గంటల సుదీర్ఘ విచారణానంతరం ఈడీ ఆయనను అదుపులోకి తీసుకున్నది.

హేమంత్ సోరెన్

ఇడిపై హేమంత్ కేసు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను రాంచీలోని ఆయన ఇంటిలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఇడి అధికారులు విచారిస్తున్న నేపథ్యంలో అనూహ్య పరిణామం చోటు చేసుకున్నది. ఇడి అధికారులపై హేమంత్ కేసు వేశారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలంటూ ధుర్వా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది.

'ఇడి చర్య బహిరంగంగా తనను అవమానపర్చటమే'

తన ఫిర్యాదులో ఈడీ అధికారుల పేర్లను హేమంత్ లేవనెత్తారు. ఎలాంటి నోటీలు లేకుండానే, తాను లేని సమయంలో ఈడీ అధికారులు గత నెల 29న న్యూఢిల్లీలోని తన నివాసంలో ఉద్దేశపూర్వక సోదాలు నిర్వహించారని ఆరోపించారు. నాకు చెందిన నీలి రంగు కలర్ బీఎండబ్ల్యూ కార్‌ను సీజ్ చేశామనీ, పెద్ద మొత్తంలో అక్రమ నగదును స్వాధీనపర్చుకున్నామని అధికారులు తప్పుడు సమాచారాన్ని లీక్ చేశారని హేమంత్ వివరించారు. అయితే, వాటితో తనకు ఎలాంటి సంబంధమూ లేదని పేర్కొన్నారు. ఈడీ చర్య తనను బహిరంగ అవమానపర్చటమేనని ఆయన ఆరోపించారు. ఈడీ అధికారుల చర్యల కారణంగా తాను, తన కుటుంబం బాధపడ్డామనీ, తీవ్రమైన మనో వేధనను ఎదుర్కొన్నామనీ, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను మేమంత్ పిర్యాదులో కోరారు

హేమంత్‌ను ఇంటికి ఇడి

ముందుగా జారీ చేసిన సమన్ల ప్రకారం బుధవారం మధ్యాహ్నం హేమంత్ ఇంటికి ఈడీ అధికారులు చేరుకున్నారు. అనంతరం ఆయనను విచారించారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ ఆయన విచారణ కొనసాగింది. ఈ భూకుంభకోణానికి సంబంధించి విచారించటం కోసం హేమంత్‌కు ఈడీ గతంలో అనేక సార్లు సమన్లు పంపింది. దాదాపు తొమ్మిది సార్లు హేమంత్ ఈడీ సమన్లను విస్మరించారు. ఈ క్రమంలో గతనెల (జనవరి 20న) జార్ఖండ్ సీఎంను ఈడీ విచారించింది. మళ్లీ పది రోజుల వ్యవధిలోనే బుధవారం (జనవరి 31న) నాడు కేంద్ర దర్యాప్తు సంస్థ ఆయనను ప్రశ్నించటం గమనార్హం.

భద్రత కట్టుదిట్టం..రాంచీలో ఆంక్షలు

హేమంత్ సోరెన్‌ను ఈడీ విచారిస్తున్న సమయంలో ఆయన ఇంటి వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. 144 సెక్షన్‌ను విధించారు. రాష్ట్ర రాజధాని రాంచీలోని పలు కీలక ప్రాంతాల్లో అధికారులు నిషేదాజ్ఞలు విధించారు. శాంతి భద్రతలను పర్యవేక్షించటానికి ముగ్గురు సభ్యుల బృందాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. విచారణ కొనసాగుతున్న సమయంలో మిగతా 7లో

రోడ్డెక్కిన ఉద్యోగ, ఉపాధ్యాయులు

- ఆర్థిక బకాయిల కోసం నినదింపు
- మొదలైన రిలే నిరాహార దీక్షలు
- నాలుగు రోజులు కొనసాగింపు

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - యంత్రాంగం

న్యాయబద్ధంగా రావాల్సిన ఆర్థిక బకాయిల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు రోడ్డెక్కారు. పిఆర్‌సి, ఎరియర్స్, డిఎ, ఎపిజిఎల్‌ఐ, పార్ట్‌పేమెంట్లు కలుపుకొని రూ.18 వేల కోట్ల బకాయిల కోసం నినదించారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నాలుగురోజుల రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. అందులో భాగంగా తొలిరోజు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్లు, ఆర్‌డిఒ కార్యాలయాల ఎదుట దీక్షలను ప్రారంభించారు.

నెల్లూరు కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... డబ్బులకు, బడ్జెట్‌కు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్న ఆలోచన ప్రభుత్వం చేయడం లేదని విమర్శించారు. యుటిఎఫ్ ప్రారంభించిన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోని మిగతా ప్రభుత్వ రంగాల ఉద్యోగులను కూడగట్టుకుని రాజకీయ నిర్ణయం తీసుకుని రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు మాట్లాడుతూ.. నాలుగు రోజుల నిరాహార దీక్షల్లో భాగంగా మొదటి రోజు దీక్షలు ప్రారంభించామన్నారు. దీక్షా శిబిరానికి మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరై మద్దతు ప్రకటించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. వైఎస్ఆర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ ప్రారంభించి, మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిల కోసం పోరు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఉద్యోగుల వేతనాల్లో కోత విధించడం సరికాదన్నారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షలను యుటిఎఫ్ మిగతా 2లో

వైసిపి ఐదో జాబితా విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి ఐదో జాబితాను వైసిపి విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం ఏడు స్థానాలకు సంబంధించి అభ్యర్థుల పేర్లను విడుదల చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి అరకు నుంచి రేగం మత్స్యలింగం, అవనిగడ్డకు సింహాద్రి చంద్రశేఖర్‌రావు, సత్యవేడుకు నూకతోటి రాజేష్ పేర్లను విడుదల చేసింది. అలాగే పార్లమెంటుకు సంబంధించి కాకినాడకు చలమశెట్టి సునీల్, మచిలీపట్నంకు సింహాద్రి రమేష్‌బాబు, నర్సారావుపేటకు పి అనిల్‌కుమార్ యాదవ్‌ను, తిరుపతికి మద్దిల గురుమూర్తిని ప్రకటించింది.

గీతకార్మికుల బతుకులు దుర్భరం

ముగిసిన రాష్ట్ర మహాసభ 3

సిపిఎంకు విరాళాలిచ్చి తోడ్పడండి!

- ప్రజా ఉద్యమాలను బలపర్చండి
- 'ప్రజా నిధి' కోసం ప్రజలకు వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కష్టాల్లో పాలుపంచుకుంటూ, అండగా నిలుస్తున్న సిపిఎంకు విరివిగా విరాళాలిచ్చి తోడ్పడాలని రాష్ట్ర ప్రజానీకానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ప్రజా ఉద్యమాల నిర్వహణ కోసం నేటి (గురువారం) నుండి పదవ తేది వరకు రాష్ట్ర వ్యాప్తంగా 'ప్రజానిధి' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సుందరయ్య నగర్‌లో గురువారం ఉదయం వి. శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ప్రతిశాఖ, ప్రతి పార్టీ సభ్యుడు ఈ కార్యక్రమంలో భాగస్వాములై నిధుల సేకరణ కోసం ఇంటింటికి వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజానిధికి విరాళాలివ్వడం ద్వారా ప్రజా ఉద్యమాలను బలపర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రకటన పూర్తి పాఠం..

'ఎన్నికల సమయం లో అన్ని పార్టీలు పోటీపడి ఓటర్లకు డబ్బు ఎరవేస్తున్న సమయంలో సిపిఎం ప్రజల నుండే నిధి వసూళ్లకు పూనుకోవడం ఆశ్చర్యం కలిగించవచ్చు. ఇదే సిపిఎంకు ఇతర పార్టీలకు ఉన్న తేడా. సిపిఎంకు స్వార్థపూరిత అజెండా లేదు. ప్రజల అభ్యుదయమే పార్టీ ఎజెండా. ప్రజల కోసం పనిచేస్తున్న సిపిఎం కార్పొరేట్ నిధులు, ఎన్నికల బాండ్లు తీసుకోదు. ప్రజల నుండి నిధి వసూలు చేసే పార్టీ ప్రజల కోసమే పనిచేస్తుంది. అదే సిపిఎం ప్రత్యేకత. ఇది ప్రజల పార్టీ. ఈ పార్టీని నడిపించాల్సింది, ఆదరించాల్సింది సామాన్య ప్రజలే. అందుకే సిపిఎం విరాళాల కోసం మీ ముందుకు వస్తోంది. మన కష్టాల్లో పాలు పంచుకునే పార్టీకి మన కష్టార్జితంలో ఒక చిన్న మొత్తాన్ని విరాళంగా ఇస్తే అదే కొండంత శక్తిగా మారుతుంది. సామాజిక మార్పుకు బాటలు వేస్తుంది.

నిత్యం సామాన్య ప్రజల బాగు కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం నిజాయతీగా, నిస్వార్థంగా పాటుపడుతున్న పార్టీ భారత మిగతా2లో

ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న విద్యాశాఖ, ఐబి అధికారులు

ప్రభుత్వ బడుల్లో ఐబి విద్య

- ఒప్పందం కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబి) సిలబస్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎపి రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎపిఎస్‌సిఇఆర్‌టి), ఐబి మధ్య ఒప్పందం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఐబితో భాగస్వామ్యం అత్యంత ముఖ్యమైనదిగా భావిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విద్యారంగంలో భాగస్వామ్యం చేయడం తనకు గొప్ప సంతృప్తినిస్తోందని అన్నారు. నాణ్యమైన విద్యను భవిష్యత్తు తరాలకు అందించడం చాలా ముఖ్యమని చెప్పారు. ఇప్పుడున్న విద్యా విధానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఐబి డైరెక్టర్ జనరల్ ఒల్లి పెక్కా హీనోనెన్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందంపై తాము చాలా నిబద్ధతతో ఉన్నామని చెప్పారు. విద్య ద్వారా ఉత్తమ ప్రపంచాన్ని, శాంతియుత ప్రపంచాన్ని నిర్మించాలన్నది తమ లక్ష్యమని తెలిపారు. ఎపిలో కొత్త తరహా విద్యా విధానంతో తాము భాగస్వాములం అవుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు 'చేయూత' కట్

- కొత్త వారికి హ్యాండిచ్చిన సర్కారు
- లక్షల మంది అక్కచెల్లెమ్మలు ఘొల్లు
- ఒంటరి మహిళలు, వితంతువులే సమిధలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఈ తడవ 'వైఎస్ఆర్ చేయూత' పథకానికి ప్రభుత్వం భారీగా కత్తెర పెట్టింది. ఇప్పటి వరకు ఈ స్కీంలో సామాజిక పింఛన్లు పొందుతున్న వారికి కూడా లబ్ధి చేకూర్చగా, కొత్తగా పెట్టుకున్న చేయూత దరఖాస్తుల్లో పెన్షన్‌దారులను తొలగించారు. పెన్షన్ పొందుతున్న మహిళలను అనర్హులుగా పేర్కొన్నారు. చేయూత సహాయం కోసం ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అర్జీలు పెట్టుకొని కొన్ని నెలలుగా కళ్లల్లో ఒత్తులేసుకొని ఎదురు చూస్తున్న లక్షల మంది 'అక్కచెల్లెమ్మల' ఆశలపై సర్కారు నీళ్లు చల్లింది. ఫిబ్రవరి మొదటి వారంలో చేయూత లబ్ధిదారులకు సొమ్ము విడుదల చేస్తూ ముఖ్యమంత్రి బటన్ నొక్కాక వారం రోజులపాటు పండగలా చేయాలని యంత్రాంగానికి ప్రభుత్వం ఆదేశాలిచ్చిన తరుణంలో ఈ సంవత్సరం కొత్తగా దరఖాస్తు చేసుకున్న మహిళలు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఒక్కడా ఏ ఒక్కరూ సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ఫ్రెషర్స్‌కే తిరస్కరణ

45 నుంచి 60 ఏళ్ల లోపు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, పేద మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగేళ్లల్లో రూ.75 వేల ఆర్థిక సాయం చేసే పథకం చేయూత. తొలుత 2020లో ఈ స్కీం అమలుకు సర్కారు జారీ చేసిన జీవో, ఆపరేషనల్ గైడ్‌లైన్స్‌లో 'వైఎస్ఆర్ పెన్షన్ కానుక' లబ్ధిదారులను మినహాయించినట్లు పేర్కొన్నారు. అనంతరం నిబంధనలను సడలించి వారికొక్కాడా అమలు చేశారు. కాగా 2023 జులై, ఆగస్టు నుంచే వలంటీర్లు తమ పరిధిలోకొచ్చే, కొత్తగా 45 సంవత్సరాలు నిండిన మహిళలతో దరఖాస్తులు పెట్టించారు. తీరా కొత్తగా చేయూతకు దరఖాస్తు చేసుకున్న వారిలో పింఛన్‌దారులకు లేదని, పథకానికి అనర్హులని వెల్లడించడంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది ఘొల్లుమంటున్నారు. చేయూత కోసం ఎదురు చూస్తున్నవారందరూ ఒంటరి మహిళ, వితంతు పింఛన్‌దారులే.

'జగనన్నకు చెప్పుకున్నా' అంతే!

అర్హులై ఉండి, సంక్షేమ పథకాలు రాని వారి కోసం 'జగనన్నకు చెప్పుకుందాం' పేరిట '1902' నెంబర్‌తో కాల్ సెంటర్‌ను సర్కారు నడుపుతోంది. ఈ నెంబర్‌కు కాల్ చేస్తే కొత్త లబ్ధిదారుల్లో పింఛన్ పొందుతున్నట్లయితే అనర్హులని సమాధానమిసు న్నారు. ఇదే సమయంలో గతంలో చేయూత అందుకున్న వారిలో పింఛన్‌దారులు ఈసారి కూడా అర్హులేనంటున్నారు. వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, వెలుగు, ఎండిఒ, ఇతర అధికారులందరిదీ ఇదే మాట. కాగా సెర్ప్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు మాత్రం అటువంటిదేమీ లేదని చెపుతున్నారు. దీంతో చేయూత ఆశావహ మహిళలు గందరగోళంలో పడ్డారు. లక్షల మంది లబ్ధిదారులను తగ్గించి, ఆ మేరకు నిధులు మిగుల్చుకోవాలని ప్రభుత్వం యోచిస్తోందన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.

జ్ఞాన్‌వాపి మసీదు ప్రాంగణంలో హిందువుల పూజకు అనుమతి

వారణాసి కోర్టు తీర్పు

లక్నో : వారణాసిలోని జ్ఞాన్‌వాపి మసీదు ప్రాంగణంలో హిందువులు పూజలు చేసుకునేందుకు జిల్లా కోర్టు బుధవారం అనుమతించింది. మసీదు బేస్‌మెంట్‌లోని 'వ్యాస్ కా తేఖనా' ప్రాంతంలో హిందువులు పూజలు చేసుకోవచ్చునని తెలిపింది. ఈ ప్రాంగణాన్ని స్వాధీనం చేసుకుని, రానున్న 7 రోజుల్లో పూజలు ప్రారంభమయ్యేలా చూడాలని వారణాసి జిల్లా కలెక్టర్‌ను జిల్లా కోర్టు జడ్జి అజయ్ కృష్ణ విశ్వేషా ఆదేశించారు. ఈ విషయాన్ని హిందువుల తరుపు న్యాయవాది విష్ణు శంకర్ జైన్ విలేకరులకు తెలిపారు. పూజలకు ఏడు రోజుల్లోగా అధికారులు ఏర్పాట్లు చేయాలని, పూజలు చేసేందుకు అందరికీ హక్కు ఉంటుందని చెప్పారు. అక్కడ పూజలు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని శైలేంద్ర కుమార్ పాఠక్ వేసిన పిటిషన్‌పై కోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది. ఈ తీర్పును అలహాబాద్ హైకోర్టులో సవాల్ చేయనున్నట్లు మసీదు కమిటీ తెలిపింది.

వైసిపిలో చేరిన రావెల కిశోర్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు, ఆయన సతీమణి శాంతిజ్యోతి వైసిపిలో చేరారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వారు బుధవారం వైసిపిలో చేరారు. గుంటూరు జిల్లాకు చెందిన రావెల కిశోర్‌బాబు మాజీ ఐఆర్‌ఎస్ అధికారి. 2014లో టిడిపి తరపున ప్రత్తిపాడు నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. రావెల కిశోర్‌బాబుపై ఆరోపణలు రావడంతో చంద్రబాబు కేబినెట్ నుండి వైదొలిగారు. ఆ తర్వాత 2018లో జనసేనలో చేరారు. జనసేన నుండి బిజెపిలో చేరిన రావెల కిశోర్‌బాబు 2023లో బిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఇప్పుడు ఆయన వైసిపిలో చేరారు. ఆయనకు వైసిపి నుండి బాపట్ల పార్లమెంటు టికెట్ ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైసిపి ప్రత్తిపాడు ఇన్‌చార్జి బాలసాని కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే గుంటూరు జిల్లాకు చెందిన మాజీ ఐఆర్‌ఎస్ అధికారి యక్కా విల్సన్‌బాబు కూడా జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు.

సవరణ

తేదీ : 31 జనవరి 2024 (బుధవారం) సంచిక మొదటి పేజీలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్(విఒఎ)లకుసంబంధించిన వార్తలో శీర్షిక సహా పలు చోట్ల విఒఎగా తప్పుగా ప్రచురితమైంది. దానిని విఓఏగా చదువుకోగలరు. పొరపాటుకు చింతిస్తున్నాము.

- సంపాదకులు

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబరుకు ఆదివారం మినహా ప్రతి రోజు మధ్యాహ్నం 12 నుండి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపవలసిన చిరునామా:

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

కోనసీమ అల్లర్ల కేసుల ఉపసంహరణపై పిల్ విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

కోనసీమ జిల్లాను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా మార్పు చేసినప్పుడు జరిగిన అల్లర్ల సమయంలో నమోదైన కేసుల ఉపసంహరణకు సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ అమలు చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను హైకోర్టు ఆదేశించింది. స్వతంత్రంగా వ్యవహరించాలని, సిఆర్‌పిసి నిబంధనలను కూడా అమలు చేయాలంది. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 14కు వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ డిఎస్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ప్రకటించింది. అల్లర్ల సమయంలో నమోదు చేసిన కేసులను ఉపసంహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2023 డిసెంబరు 20న జిఒ 1566 జారీ చేయడాన్ని బిఆర్ అంబేద్కర్ జిల్లా సాధన సమితి కన్వీనర్ జె బాబూరావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. సంబంధిత కోర్టులకు పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వతంత్రంగా కేసు ఉపసంహరణపై నిర్ణయం తీసుకోవాలని, అయితే, ప్రభుత్వం కేసులను ఉపసంహరించుకోవాలని వాళ్లను ఆదేశించిందని పిటిషనర్ తరపున న్యాయవాది జె శ్రావణ్ కుమార్ వాదించారు. అంతిమంగా పిపినే నిర్ణయం తీసుకుంటారని, అయితే ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుందని ప్రభుత్వ ప్రత్యేక ప్లీడర్ వి మహేశ్వర్‌రెడ్డి ప్రతివాదన చేశారు. సంబంధిత కోర్టు నిర్ణయం తీసుకునే వరకు పిటిషనరు వేచి ఉండకుండా హైకోర్టుకు రావడం సబబుకాదన్నారు.

కడియంలో గ్రీన్ వరల్డ్ ఆవిష్కృతం

నర్సరీని సందర్శించిన సుధా నారాయణమూర్తి

ప్రజాశక్తి-కడియం (తూర్పుగోదావరి జిల్లా)

కడియంలో ఒక గ్రీన్ వరల్డ్ ఆవిష్కృతమైందని, అందుకు స్థానిక నర్సరీ రైతుల కృషి ఎంతో ప్రశంసనీయమని ఇన్ఫోసిస్ అధినేత సుధా నారాయణమూర్తి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కడియంలోని పల్ల వెంకన్న నర్సరీని ఆమె బుధవారం సందర్శించారు. నర్సరీ డైరెక్టర్ పల్ల వినయ్.. సుధా నారాయణమూర్తికి పూల స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె నర్సరీని తిలకించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తాను బెంగళూరు, ఢిల్లీ, కలకత్తా వంటి మహా నగరాల్లో తిరిగినా ఇటువంటి గ్రీన్ లొకేషన్ తాను ఎప్పుడూ చూడలేదన్నారు. ఈ పూల ప్రపంచంలో తాను ఒక మధుర అనుభూతిని పొందినట్టు ఆమె పేర్కొన్నారు. పల్ల వెంకన్న నర్సరీలో అడుగడుగునా అద్భుతంగా ఉందన్నారు. ఒక రైతు ఇంత గొప్ప నర్సరీని స్థాపించడం తనకు మరింత ఆశ్చర్యం కలిగించిందని తెలిపారు.

వాహన ఫిట్‌నెస్ కేంద్రాలను

ప్రభుత్వమే నిర్వహించాలి

- ప్రైవేటీకరిస్తే రవాణా యంత్రాంగం నిర్వీర్యం, యజమానులపై పెనుభారం
- ఇసుక, మద్యానికి తోడు రవాణా
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెద్దలకు కాంట్రాక్టు
- గల్లా జయదేవ్ విమర్శలకు బిజెపి నాయకులు సమాధానం చెప్పాలి
- విఒఎల ఆందోళనకు సంపూర్ణ మద్దతు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

నోట్‌ను విడుదల చేస్తున్న విఎస్ఆర్, సిహెచ్ బాబురావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పెద్దలు, వారి కుటుంబ సభ్యులు పెద్దయెత్తున దోపిడీకి సిద్ధమయ్యారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు విమర్శించారు. బుధవారం విజయవాడలోని బాలోత్సవ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల పేరుతో పెద్ద, చిన్న వాహనాల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేసి సర్టిఫికెట్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం బిడ్డింగ్‌కు ఆహ్వానించిందని, బిడ్డింగుల్లో ఎక్కువ చెల్లించే వారికి కేటాయిస్తామని నిబంధన పెట్టారని, అంటే ఆ భారాన్ని వాహన యజమానుల నుండి వసూలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పలుకుబడి కలిగిన కొంతమంది పెద్దలు వారి కుటుంబ సభ్యులు, బినామీల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఈ ఏడాది అక్టోబరు నాటికి బిడ్డింగ్ పూర్తి చేయాలని కేంద్రం గడువు విధించగా రాష్ట్ర ప్రభుత్వం ఒకడుగు ముందుకేసి ఇప్పడే టెస్టింగ్ సెంటర్లకు జాతీయ రహదారుల పక్కన స్థలాలు కేటాయించే పనిచేస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందే వాహన యజమానుల నుండి పెద్దయెత్తున దండుకునేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. యాక్సిడెంట్లు జరుగుతున్నాయని కేంద్రం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంటున్నారని, వాస్తవానికి రోడ్లు సరిగ్గా లేవని, డివైడర్లు నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయడం లేదని, అత్యంత వేగవంతమైన వాహనాలు నడిపేందుకు వీలుగా రోడ్లు లేవని, డ్రైవర్లకు తగిన శిక్షణ కూడా లేదని అందువల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ విషయాలు పక్కనబెట్టి క్లచ్చులు, బ్రేకులు, ఇంజిన్ల తనిఖీ పేరుతో దోపిడీ చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రవాణాశాఖ అధికారుల వేధింపులకు గురవుతున్న వాహన యజమానులకు ఇదొక భారంగా మారనుందని వివరించారు. ముఖ్యంగా ఇంటర్‌సిటీ నగరాల మధ్య తిరిగే వాహనాలకు అధిక భారం పడటంతోపాటు వేధింపులూ పెరుగుతాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిడ్డింగు రద్దుచేసి అన్ని రకాల రవాణా యాజమాన్య సంఘాలతో సంప్రదింపులు జరిపిన తరువాతే నిర్ణయం తీసుకోవాలని కోరారు. అప్పటిదాకా దాన్ని అమలు చేయరాదని కోరారు. ఇవేమీ చేయకుండా నేరుగా అమల్లోకి తేవడం అంటే దోచుకోవడం తప్ప మరొకటి కాదని వివరించారు. అవినీతిని అరికట్టాల్సిన ప్రభుత్వమే ఇసుక, మద్యం బాటలో దాన్ని వ్యవస్థీకృతం చేస్తోందని అన్నారు. ప్రజలపై వేలకోట్ల అదనపు భారం వేస్తోందని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ రవాణాశాఖను నిర్వీర్యం చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేటు వ్యక్తులు ఇస్తారని తెలిపారు. 25 జిల్లాలకు సంబంధించి టెండర్లు పిలిచారని, ఇప్పటి వరకూ టూవీలర్లకు ఫిట్‌నెస్ అవసరం లేదని, ఇక నుండి ఏడాదికి ఒకసారి వారు కూడా తనిఖీ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. దీనికోసం ప్రైవేటు సంస్థకు రూ.600, ప్రభుత్వానికి రూ.200 చెల్లించాలని, 15 ఏళ్లు దాటితే రూ.1900 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇది నిర్దిష్ట ఫీజు మాత్రమేనని, ప్రైవేటు వ్యక్తులు ఎంత వసూలు చేస్తారో అర్థమవుతుందని పేర్కొన్నారు. భారీ వాహనాలకు రూ.920 ఏడాదికి చెల్లించాలని, 15 ఏళ్లలోపు ఉంటే రూ.1800, 15 ఏళ్లు దాటితే రూ.15 వేలు కట్టాల్సి ఉంటుందని అంటే 1400 శాతం ధరలు పెంచారని వివరించారు. టూవీలర్లు కాకుండా 13.25 లక్షల వాహనాలు ఉన్నాయని, ఇవి కాకుండా లక్షల సంఖ్యలో టూవీలర్లు ఉన్నాయని వివరించారు. రిజిస్ట్రేషన్లను కూడా రూ.400 నుండి రూ.3000, రూ.5000కు పెంచారని విమర్శించారు. ఇదే పద్ధతి కొనసాగితే వాహన యజమానులపై పెనుభారం పడుతుందని అన్నారు. దీన్ని అడ్డుకోవాలని వారు కోరారు. ఇప్పటికే మద్యం, ఇసుక పేరుతో దోచుకుంటున్న పెద్దలకు రవాణా వాహనాలు కూడా తోడయ్యాయని అన్నారు.

విఒఎలకు మద్దతు

ఆందోళన చేస్తున్న విఒఎలు, ఆర్‌పిల సమస్యలు పరిష్కరించాలని శ్రీనివాసరావు కోరారు. మూడేళ్లు దాటిన వారిని తీసేయాలని రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ ఇవ్వడం దుర్మార్గమని పేర్కొన్నారు. అధికార పార్టీ తమ మనుషులను పెట్టుకునేందుకే ఈ సర్క్యులర్ ఇచ్చిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆందోళన చేస్తున్న విఒఎలకు పూర్తి మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

జయదేవ్‌కు బిజెపి సమాధానం చెప్పాలి

ప్రత్యేక హోదాపై అడిగినందుకే తనపై వేధింపులకు దిగారని బహిరంగంగా చెప్పిన టిడిపి ఎంపి గల్లా జయదేవ్ వ్యాఖ్యలకు బిజెపి నాయకులు సమాధానం చెప్పాలని, హోదా ఇస్తారా, లేక అడ్డుకుంటున్నారా స్పష్టం చేయాలని అన్నారు. హోదా ఇప్పటి వరకూ ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని ప్రశ్నించారు. జయదేవ్‌లాగా బిజెపి వేధింపులకు ఎందరో రాజకీయంగా బలయ్యారని అన్నారు.

గిరిజన ప్రాంతాల్లో సౌకర్యాలపై నివేదిక ఇవ్వండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలపై పూర్తి వివరాలు నివేదించాలని రాష్ట్రాన్ని హైకోర్టు ఆదేశించింది. గిరిజన ప్రాంతాల్లో రోడ్ల సౌకర్యాలపై మరో నివేదిక ఇవ్వాలంది. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథక అమలు వివరాలు కూడా అందజేయాలంది. గిరిజన ప్రాంతాల్లో వైద్య సౌకర్యాల లేమిపై న్యాయవాది ఎ సోమరాజు వేసిన పిల్‌పై తదుపరి విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ డిఎస్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ప్రకటించింది. రోగుల్ని డోలీలో తీసుకువెళుతున్నారని, అంబులెన్స్‌లు వెళ్లే దారులు కూడా లేవని పిటిషనరు న్యాయవాది ఎస్ ప్రణతి చెప్పారు. ప్రభుత్వ న్యాయవాది అప్పాధర రెడ్డి ప్రతివాదన చేస్తూ, గిరిజనులు కొండ ప్రాంతాల్లో నివాసం ఉండటం వల్ల అక్కడికి అంబులెన్స్‌లు వెళ్లలేవని చెప్పారు. కొండ దిగొచ్చాక అంబులెన్స్ సదుపాయం ఉందన్నారు. వాదనల తర్వాత హైకోర్టు.. పిఎం గ్రామీణ సడక్ యోజన పథకం కింద రోడ్లు వేయవచ్చు కదా అని అడిగింది.

పాలనా వ్యవస్థలు నిర్వీర్యం

- డిజిపి వాలంటీర్ రిటైర్మెంట్ తీసుకోవాలి
- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పాలనా వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని, ఊరూరా జగన్ గూండా రాజ్ మాత్రమే ఉందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. మార్టూరులో మారణాయుధాలతో మైనింగ్ తనిఖీలు, క్రోసూరులో రౌడీ మూకల విధ్వంసానికి పోలీసుల సహకారం అనేది పూర్తిగా గాడి తప్పిన పాలనకు నిదర్శనమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్టూరులో గూండాలతో, మారణాయుధాలతో గ్రానైట్ పరిశ్రమల్లో తనిఖీల పేరుతో చేసిన అరాచకం వ్యవస్థల విధ్వంసానికి నిదర్శనమని అన్నారు. మైనింగ్ శాఖలో ఎడి స్థాయి అధికారి రౌడీలతో తనిఖీలకు వచ్చిన ఘటన రాష్ట్రంలో గూండా రాజ్‌కు ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. దీనిని ప్రశ్నించిన వారిపైనే కేసులుపెట్టి అరెస్టు చేసినందుకు పోలీసులు, అధికారులు సిగ్గుపడాల్సిన అవసరం ఉందని అన్నారు. క్రోసూరులో ఎమ్మెల్యే కొడుకు వందల మందితో ప్రజల ఆస్తులపై దాడికి దిగితే చర్యలు తీసుకోకపోగా పోలీసులు సహకరించడాన్ని తప్పుపట్టారు. రాష్ట్ర పోలీస్‌శాఖ గౌరవాన్ని దిగజార్చిన ఇలాంటి ఘటనలపై స్పందించని డిజిపి ఎందుకని ప్రశ్నించారు. డిజిపి ఆ స్థాయి పోస్టులో కూర్చోవడానికి అనర్హులని అన్నారు. తక్షణమే ఆయన వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవాలని సూచించారు. కింది స్థాయి అధికారులు తప్పు చేస్తే సరిదిద్దాల్సిన జిల్లా ఎస్‌పిలు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా అరాచకాలకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. రెండు నెలల్లో రౌడీ మూకలను ప్రజాకోర్టు శిక్షిస్తుందని, తప్పు చేసిన అధికారులకు న్యాయస్థానాలు తప్పక శిక్షిస్తాయని తెలిపారు. వైసిపి ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలు ప్రశ్నిస్తే దాడులకు తెగబడతారా? అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు మరో ప్రకటనలో ప్రశ్నించారు. పెదకూరపాడు ఎమ్మెల్యే శంకర్రావు ఇసుక దందాను బయటపెట్టినందుకే కంచేటి సాయిపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు.

భారీగా డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు బదిలీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం భారీగా డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లను బదిలీ చేసింది. 23 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్థాన చలనం కలిగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన డిప్యూటీ కలెక్టర్లకు ఆయా ప్రభుత్వ శాఖలు తక్షణం పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాల్సిందిగా ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇసి ఉత్తర్వుల ప్రకారం తక్షణమే ఆయా అధికారులు బదిలీ చేసిన చోట రిపోర్టు చేయాల్సిందిగా ఉత్వర్వుల్లో స్పష్టం చేశారు. తహశీల్దార్లు జోన్-1లో 137 మంది, జోన్-2లో 170 మంది, జోన్-3లో 154 మంది, జోన్-4లో 239 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మూడేళ్ల సర్వీసు దాటని, అదే విధంగా జూన్ 30వ తేదీ కంటే ముందు ఉద్యోగ విరమణ చేస్తున్న వారి వివరాలను కూడా పొందుపరుస్తూ ఇసికి నివేదిక పంపారు.

6,100 పోస్టులతోనే డిఎస్‌సి

(మొదటిపేజీ తరువాయి)

ఇందులో భాగంగా ప్రభుత్వం భర్తీ చేసినట్లు తెలిపారు. నాలుగో విడత వైఎస్ఆర్ చేయూత కార్యక్రమం ఫిబ్రవరి నెల 16 నుంచి రెండు వారాల పాటు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. నాలుగో విడతలో 26,98,931 మందికి రూ.5,060.4 కోట్లు పంపిణీ జరగనుండగా, మొత్తమ్మీద ఈ పథకం ద్వారా 14 లక్షల మంది మహిళలు స్వయం ఉపాధి ద్వారా లబ్ధిపొందినట్లు మంత్రి పేర్కొన్నారు. నాలుగు విడతల ద్వారా మొత్తం లబ్ధిదారులకు రూ.19,188 కోట్లు లబ్ధి చేకూరింది.

ప్రతి గ్రామ పంచాయతీకి తప్పనిసరిగా పంచాయతీ కార్యదర్శి ఉండాలనే నిర్ణయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. 500 లోపు జనాభా ఉన్న పంచాయతీలకు కూడా సెక్రటరీల నియామకానికి నిర్ణయించింది. ఒక గ్రామ పంచాయతీలో ఒకరికన్నా ఎక్కువ ఉన్నవారిని ఈ పంచాయతీల్లో ప్రభుత్వం సర్దుబాటు చేయనుంది. అటవీశాఖలో 689 పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదించింది. ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్లు సహా వివిధ పోస్టులను ఎపిపిఎస్‌సి ద్వారా భర్తీ, ఎస్ఇఆర్‌డిలోకి ఐబి భాగస్వామ్యం చేస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. 2024-25లో ఉపాధ్యాయులకు, విద్యాశాఖ అధికారులతో పాటు సంబంధిత ఇతర అధికారులకు శిక్షణ ఇచ్చి వారి సామర్థ్యాన్ని, నైపుణ్యాలను 2025 జూన్ నుంచి ఒకటో తరగతిలో ఐబిని ప్రవేశపెట్టి 2035 నాటికి టెన్త్ క్లాస్, 2037 నాటికి ఇంటర్మీడియట్ (12వ తరగతి) విద్యార్థులు ఐబిలో పరీక్షలు రాయనున్నారని మంత్రి చెల్లుబోయిన పేర్కొన్నారు.

పులిచింతల ప్రాజెక్టు నిర్వాసితులకు స్టాంప్, రిజిస్ట్రేషన్ ఛార్జీలు మినహాయింపు

పల్నాడు జిల్లా పులిచింతల ప్రాజెక్టు పరిధిలో 5,376 నిర్వాసితుల కుటుంబాలకుఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా ఇస్తున్న ఇళ్ల పట్టాలు, ఇళ్లకు సంబంధించి రూ.52 కోట్ల స్టాంప్‌డ్యూటీ రూ.8 కోట్ల రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ ఛార్జీలు మినహాయింపునకు మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది.

నేచురల్ గ్యాస్‌పై వ్యాట్ తగ్గింపు

నేచురల్ గ్యాస్‌మీద ప్రస్తుతమున్న వ్యాట్ ట్యాక్స్‌ను 24.5 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. బియ్యం ఆధారిత యూనిట్లను పట్టాభి ఆగ్రో ఫుడ్స్ లిమిటెడ్, రెండు విడతల్లో రూ.1,153 కోట్ల పెట్టుబడి, 2,500 మందికి ఉద్యోగాల కల్పన, పల్నాడుజిల్లా నరసరావుపేటలో జామియా మసీదు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన ఆస్తి పన్ను మినహాయింపు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది ఉద్యోగ విరమణ వయోపరిమితిని 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పొడిగిస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది.

గిరిజన ప్రాంతాల్లోని ఇళ్లకు విద్యుత్ సౌకర్యం

మారుమూల గిరిజన ప్రాంతాల్లో పర్టిక్యులర్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూపు (పివిజిటి) ఇళ్ళకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు రూ.89.98 కోట్లతో ఎఇ డిస్కమ్స్ రూపొందించిన డిటైయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డిపిఆర్)కు కేబినెట్ ఆమోదం తెలిపింది.

నూతన ఎమ్మెల్యేల శిక్షణ కోసం ట్రైనింగ్ సంస్థ

చట్టసభలకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, అధికారులు, చట్టసభల సిబ్బందికి, ఇతర ప్రభుత్వ అధికారులకు శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు అసెంబ్లీ ప్రాంగణంలో ఎపి లెజిస్లేచర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెజిస్లేటివ్ స్టడీస్ అండ్‌ట్రైనింగ్ సంస్థ ఏర్పాటుతోపాటు డైరెక్టర్ (నాన్ కేడర్) పోస్టు ఏర్పాటుకు ఆమోదం. ఎపి లెజిస్లేచర్ సెక్రటేరియట్‌లో 27 పోస్టుల భర్తీకి ఆమోదం. ఎపి అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ యాక్ట్-1987కు సవరణలు, ఎపి అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ యాక్ట్-1992 సవరణలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

పలు ప్రాజెక్టులకు భూములు కేటాయింపు

ఎపి డిస్కమ్స్‌కు రూ.1500 కోట్ల రుణాలపై ప్రభుత్వ గ్యారెంటీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. 1500 మెగా వాట్ల సామర్థ్యంతో గ్రీన్‌కో ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి కేబినెట్ ఆమోదం. నంద్యాల జిల్లా గడివేముల మండలం చిన్నక్కపల్లెలో 1272.07 ఎకరాలు, మిడ్తూరు మండలం మూసాపేట, నాగలూటి గ్రామాల్లో 1011.44 ఎకరాలు, ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడలో అవసరమైన భూములు గుర్తింపు.

3,350 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను జెఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.12,065 కోట్ల పెట్టుబడి ఆ కంపెనీ పెట్టనుంది. ప్లాంట్ల ఏర్పాటు ద్వారా 3,300 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. వైఎస్ఆర్ జిల్లా చక్రాయపేట వద్ద 400 మెగా వాట్లు, సత్యసాయి జిల్లా ముదిగుబ్బవద్ద 1050 మెగావాట్లు, అనంతపురం జిల్లా కనగానపల్లె, రాప్తాడుల్లో 1050 మెగావాట్లు, అనంతపురం జిల్లాలో డి.హీరేహాల్, బొమ్మనహాళ్‌లో 850 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటు.

నంద్యాల జిల్లా అవుకు మండలం కునుకుంట్ల, కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం జలదుర్గం వద్ద రెండు విండ్ పవర్ ప్రాజెక్టులను జెఎస్ డబ్ల్యు నియో ఎనర్జీ లిమిటెడ్ ఏర్పాటు చేయనుంది. 171.60 మెగావాట్ల విండ్ పవన్ ప్రాజెక్టులు ఏర్పాటు. రూ.1,287 కోట్ల పెట్టుబడి. ప్రత్యక్షంగా, 200 మందికి ఉద్యోగాలు. సత్యసాయి జిల్లా తలుపుల మండలం పులిగుండ్లపల్లిలో 1000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును ఆగ్వాగ్రీన్ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.4 వేలకోట్లతో ఏర్పాటు చేయనుంది. వెయ్యిమందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు. కర్నూలు జిల్లా ఆస్పరి వద్ద 200 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్ట్‌ను ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, రూ.1,350 కోట్లు ఖర్చు. 200 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు. సోలార్ విండ్‌తో సహా పంప్డ్ హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఇండోసోల్ సోలార్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు అవసరమైన భూములు కేటాయింపు, ఇందుకోసం ఎస్‌పివి ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం.

సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో 600 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులను రెన్యూ విక్రం శక్తి ప్రైవేట్ లిమిటెడ్ రూ.3,600 కోట్ల పెట్టుబడి. 600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు. అప్పర్ సీలేరు పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ఎలక్ట్రిక్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులో భాగంగా 150 మెగావాట్లు చొప్పున 9 యూనిట్లు ఏర్పాటుకు అవసరమైన పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు చేయాలన్న ఎపిజెన్‌కో ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం. ఈ ప్రాజెక్టు రూ.12,264.36 కోట్లతో ఏర్పాటు కానుంది.

రెండు విడతల్లో ఎసిసి సిమెంట్స్ ఏర్పాటు చేయనున్న యూనిట్‌కు ఆమోదం. ఏడాదికి 8 మిలియన్ టన్నుల క్లింకర్, 4 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి. రెండు విడతల్లో ఈ ప్రాజెక్ట్‌కు రూ.5,400 కోట్లు పెట్టుబడి పెట్టనున్న ఎసిసి. 800 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు, 36 నెలల్లో మొత్తం ప్రాజెక్టు పూర్తి. ఇప్పటికే ఎస్ఐపిబి ఆమోదం. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం మల్లవారిపాలెంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ట్రిపుల్ ఐటి) శ్రీసిటీ ఏర్పాటుకు అవసరమైన 42.33 ఎకరాల భూమి కేటాయింపు. చెస్ క్రీడాకారిణి కోలగట్ల మీనాక్షికి విశాఖ పట్నం జిల్లా పెందుర్తి మండలం చినముషిడివాడలో 500 గజాల నివాస స్థలం కేటాయింపు. అంతర్జాతీయ టెన్నీస్ క్రీడాకారుడు సాకేత్ మైనేనికి విశాఖ జిల్లా పెందుర్తి మండలం చినముషిడివాడలో 1000 చదరపు గజాల నివాస స్థలం కేటాయింపును రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ తగదు

- దళిత హక్కుల పోరాట సమితి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయొద్దని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షులు జెవి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి 1035వ రోజుకు చేరాయి. దీక్షల్లో డిహెచ్‌పిఎస్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం వల్లే విశాఖ ఇంతలా అభివృద్ధి చెందిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థగా ఉండడం వల్ల ప్లాంట్‌లో దళిత, గిరిజనులకు, వికలాంగులకు, మహిళలకు రిజర్వేషన్లు అమలయ్యాయని తెలిపారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని చూడడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి గుడాల రాంబాబు, నాయకులు కె.రవి, చిరంజీవి, బి.రాము, సరస్వతి, దేవుడమ్మ పాల్గొన్నారు.

ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించకపోవడం అన్యాయం

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటన చేయకపోవడం అన్యాయమని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. ప్రభుత్వ తీరును తమ సంఘం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలోని ఆదివాసీ గిరిజన భవనంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. తాను అధికారంలోకి వస్తే గిరిజనులకు ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేస్తామని నాడు జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చి ఇప్పటి వరకూ ఆ విషయాన్నే పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని 6100 పోస్టుల డిఎస్‌సి భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే వాటన్నింటినీ భర్తీ చేయకుండా తూతూ మంత్రంగా పోస్టులు ప్రకటించడంపై మండిపడ్డారు. స్పెషల్ డిఎస్‌సి వస్తుందని ఎంతో ఆశగా ఎదురుచూసిన ఆదివాసీ నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిరాశ మిగిల్చిందన్నారు. గిరిజనులకు ఉద్యోగాల్లో వంద శాతం ఉద్యోగావవకాశాలు కల్పించే జిఒ నెంబర్ 3 రద్దు తర్వాత స్పెషల్ డిఎస్‌సి ఊసే లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని ఆదివాసీలకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, మండల అధ్యక్షులు జి బుజ్జిబాబు, నాయకులు బి దశరథ్ పాల్గొన్నారు.

డిఎస్‌సి పోస్టుల సంఖ్య పెంచాలి: డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్‌సి పోస్టుల సంఖ్యను పెంచాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే 6,100 పోస్టులనే భర్తీ చేస్తామనడం నిరుద్యోగులను మోసం చేయడమేనని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇది మెగా డిఎస్‌సి కాదని, దగా డిఎస్‌సి అని విమర్శించారు. నాలుగేళ్ల నుంచి 10 లక్షల మంది అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. మెగా డిఎస్‌సి కోసం తాము అనేక రూపాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించామని వివరించారు. తమపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తే తప్ప మెగా డిఎస్‌సి ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యర్థుల ఆవేదనను దృష్టిలో ఉంచుకుని జూన్ నాటికి ఖాళీ కానున్న ఉపాధ్యాయ పోస్టులను కూడా చేర్చి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ ఆందోళనలు కొనసాగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రెండేళ్ల అప్రెంటిస్ విధానాన్ని తీసుకురావడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

సిపిఎంకు విరాళాలిచ్చి తోడ్పడండి!

(మొదటిపేజీ తరువాయి)

కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు). ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య ఆనాడు వేసిన బాటలో ముందుకు సాగుతూ సమాజంలో పేదరికం పోయి, కష్టజీవి సుఖశాంతులతో జీవించాలని, రాష్ట్రం అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని అనునిత్యం కృషి చేస్తోంది. నిత్యం పెరుగుతున్న ధరలతో, తరుగుతున్న ఆదాయాలతో, నిరుద్యోగంతో సామాన్యులు సతమతమవుతున్నారు. జనాభాలో ఒక శాతంగా ఉన్న బడా కార్పొరేట్ బాబులు తప్ప తక్కిన 99 శాతం ప్రజలు రకరకాల ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. కరెంట్‌షాక్‌తో వ్యాపారాలు, పరిశ్రమలూ మూతపడుతున్నాయి. రాష్ట్రం కరువు కోరల్లో చిక్కుకుపోయి వుంది. వైద్యం, విద్య ఖరీదైన సరుకులయ్యాయి. విద్యుత్తు ఛార్జీలు తడిసి మోపెడయ్యాయి. దళితులు, గిరిజనులు, మహిళలు మైనారిటీలు, ఇతర బలహీన వర్గాలు నిర్లక్ష్యానికి, అవమానాలకు, అత్యాచారాలకు, దాడులకు గురవుతూనే వున్నారు. రాష్ట్రాన్ని విభజించిన తరువాత మనకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసినా, కేంద్రాన్ని ఆ విషయంలో నిలదీయడానికి రాష్ట్రంలో పెద్ద పార్టీలు ముందుకు రాని సమయంలో ప్రత్యేకహోదా కోసం సిపిఎం ఇతర శక్తులతో కలిసి పోరాడుతోంది.

అసమానతలు లేని అభివృద్ధి, ప్రజల సంక్షేమం, సామాజిక మార్పు కోసం ఈ ఏడాదిలోనే ఎన్నో ఉద్యమాలను నడిపింది. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోలవరం నిర్వాసితుల పునరావాసం, అమరావతి రాజధాని నిర్మాణం, నిరుద్యోగం, కరువు సమస్య, ప్రజల నడ్డి విరుస్తున్న విద్యుత్ ఛార్జీలు, పన్నుల భారాలకు వ్యతిరేకంగా పోరాడుతోంది. శ్రామిక ప్రజల ఆందోళనలకు చురుగ్గా మద్దతునిస్తోంది. రైతుల గిట్టుబాటు ధరలు, కూలీల ఉపాధి, అసైన్డ్ భూముల రక్షణ కోసం సమరశీలంగా పోరాడుతున్న ప్రజలకు అండగా ఉంది. కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై గళమెత్తుతోంది. మధ్యతరగతి ప్రజలకు బాసటగా నిలబడుతోంది. ప్రపంచ దిగ్గజ వ్యాపార సంస్థలు, ఆన్‌లైన్ వ్యాపారాల పోటీకి తట్టుకోలేని రిటైల్ వ్యాపారులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తోంది. వాటి పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ముందుకు తెచ్చింది సిపిఎం. మతవిద్వేష రాజకీయాలతో సమాజంలో వాతావరణాన్ని విషపూరితంగా మార్చడానికి జరుగుతున్న కుట్రలను నిలువరించి ప్రజల మధ్య మతసామరస్యాన్ని, ఐక్యతను కాపాడుకోడానికి జాగరూకుల్ని చేస్తోంది.

ప్రజల కష్టాల్లో పాలు పంచుకుంటూ ఇతోధికంగా సేవ చేయడంలో సిపిఎం ఎప్పుడూ ముందే ఉంది. కరోనా కష్టకాలంలో రాష్ట్రంలో పలుచోట్ల వైద్య క్యాంపులను నడిపింది. వరదల్లో సహాయపడింది. దళితుల, ఆదివాసీల ఇతర పేదల భూములను కబ్జా చేసే బడా నేతల ఆగడాలను ప్రతిఘటిస్తూ ప్రజలకు అండగా నిలుస్తోంది. తమ పెత్తనాన్ని కాపాడుకుంటూ, కోటానుకోట్లు పోగేసుకోడానికి అండగా నిలిచే పార్టీలకు శత కోటీశ్వరులు, బడా కార్పొరేట్లు అండగా ఉంటారు. అందుకు భిన్నంగా సామాన్య ప్రజలకోసం, పేదలకోసం అనునిత్యం ఉద్యమించే సిపిఎంకు అండగా, వెన్నుదన్నుగా నిలిచి భుజం తట్టి ప్రోత్సహించవలసింది ప్రజలే. ప్రజలపై విశ్వాసంతోనే సిపిఎం నిలబడి పోరాడుతుంది. అందుకే మీ ముందుకు వస్తున్నాం. 2024 ఫిబ్రవరి 1వ తేదీ నుండి 10 వరకు రాష్ట్ర వ్యాపితంగా ప్రజల వద్దకు వెళ్లి పార్టీ ప్రజా ఉద్యమాల నిర్వహణ నిధి వసూళ్లు చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఆర్థికంగా మీ శక్తిమేరకు తోడ్పడాలని కోరుతున్నాం. ప్రజానిధి కోసం పార్టీ యావత్తు కదలాలి. ప్రతి పార్టీ సభ్యుడు, ప్రతి శాఖ ఇంటింటికీ తిరిగి విరాళాలు వసూలు చేయాలి. పార్టీ సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు సహకరించాలని కోరుతున్నాం.

ప్రజలకోసం సిపిఐ(ఎం) ! సిపిఐ(ఎం)కు అండగా ప్రజలు !.'

రోడ్డెక్కిన ఉద్యోగ, ఉపాధ్యాయులు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని ప్రారంభించారు. ఒంగోలు కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలనుద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె. శ్రీనివాసరావు మాట్లాడారు. 11 లక్షల మంది, ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల చెల్లింపు అంశంపై ప్రభుత్వం నిరంకుశ వైఖరి అవలంభిస్తోందన్నారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట దీక్షలను రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప ప్రారంభించారు. సత్యసాయి జిల్లా ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట దీక్షలు కొనసాగాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీ మూర్తి మాట్లాడుతూ.. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు అమలు చేయాలని, లేకుంటే పోరాటం మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కర్నూలులో ధర్నా చౌక్‌లో రిలే నిరాహార దీక్షలను యుటిఎఫ్ రాష్ట్ర సహధ్యక్షులు సురేష్ కుమార్ ప్రారంభించారు. ఉద్యోగుల లోన్స్ విడుదల చేయాలని, పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి, ఐఆర్ 30శాతం చెల్లించాలని కోరారు. విజయనగరం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలను ఆ సంఘం రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాసరావు ప్రారంభించారు. చిత్తూరు, తిరుపతి ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. శ్రీకాకుళం, ఉమ్మడి కలెక్టరేట్ల ఎదుట దీక్షలను కొనసాగించారు.

స్వర్ణకుమారికి చెక్కును అందజేస్తున్న భువనేశ్వరి

అండగా ఉంటాం : భువనేశ్వరి

ప్రజాశక్తి-దర్శి (ప్రకాశం జిల్లా)

టిడిపి కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. దర్శి నియోజకవర్గంలో దర్శి, ముండ్లమూరు మండలాల్లో సింగన్నపాలెం, తాళ్లూరు మండలం తూర్పు గంగవరం గ్రామాల్లో ఆమె బుధవారం పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.మూడు లక్షల చెక్కును అందించారు. దర్శిలోని ఐదో వార్డులో తురిమెళ్ల పరిశుద్ధరావు కుటుంబానికి, ముండ్లమూరు మండలం సింగన్నపాలెం గ్రామంలోని పార్టీ కార్యకర్త బత్తిన హనుమంతరావు కుటుంబానికి, తాళ్లూరు మండలం తూర్పుగంగవరం గ్రామంలో జంపాల నరసింహారావు కుటుంబానికి చెక్కును అందజేశారు. భువనేశ్వరి వెంట ఎమ్మెల్సీ అనురాధ, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఉన్నారు.

పేరుకు మాత్రమే గిరిజన మంత్రి

- టిడిపి నేత సుబ్బయ్య

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

పేరుకు మాత్రమే గిరిజన మంత్రి పదవి, ఎస్‌టి కమీషన్ ఉన్నాయంటూ టిడిపి తిరుపతి పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధ్యక్షులు ఎం సుబ్బయ్య విమర్శించారు. ఎపిలో ఎస్‌టి కమీషన్ ఉన్నా ఒక్క గిరిజనుడుకి కూడా మేలు జరగలేదన్నారు. శ్రీకాళహస్తిలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. జగనన్న పాలనలో గిరిజనులను నట్టేట ముంచారన్నారు రాజ్యాంగబద్ధమైన సంక్షేమ పథకాలను రద్దు చేయడమేగాకుండా, నాలుగేళ్లలో గిరిజనులకు ఒక్క సంక్షేమ పథకమైనా ఇవ్వలేదన్నారు. ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు, ఎస్‌టి కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. గడిచిన నాలుగేళ్లలో గిరిజనులపై దాడులు ఎక్కువయ్యాయని, దాడులు చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోగా, వారికే సపోర్టు చేస్తున్నారని మండిపడ్డారు. గిరిజనులకు జాబ్‌కేలెండర్ లేదని, బ్యాక్‌లాగ్‌పోస్టులు భర్తీ చేయలేదని, గిరిజనులకు స్పెషల్ డిఎస్‌సి లేదన్నారు. గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ ప్రభుత్వం విఫలమయ్యిందని విమర్శించారు.

గీతకార్మికుల బతుకులు దుర్భరం

- ప్రభుత్వం వారిని ఆదుకోవాలి : ఎమ్మెల్సీ ఐవి
- ముగిసిన కల్లుగీత కార్మిక సంఘం 15వ రాష్ట్ర మహాసభ



మహాసభలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - తణుకు రూరల్ (పశ్చిమగోదావరి జిల్లా)

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గీత కార్మికుల బతుకులు మరింత దుర్భరంగా మారాయని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వం స్పందించి గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎపి కల్లుగీత కార్మిక సంఘం 15వ రాష్ట్ర మహాసభ చిటకన వెంకటేశ్వరరావు నగర్‌లో రెండో రోజు బుధవారం ఉత్సాహపూరితంగా సాగింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 250 మంది గీత కార్మికులు ప్రతినిధులుగా హాజరయ్యారు. తొలుత మహాసభ ప్రారంభ సూచికగా సంఘం పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహామూర్తి ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మరణించిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, ఉద్యమ నిర్మాత ఎస్‌ఆర్ దాట్ల, చిటకన వెంకటేశ్వరరావులకు నివాళులర్పించారు. మహాసభకు అధ్యక్షవర్గంగా నేతలు జుత్తిగ నరసింహామూర్తి, కామన మునిస్వామి, గుబ్బల నాగమణి, స్టీరింగ్ కమిటీగా యర్రా దేముడు, ఎం.స్టాలిన్ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ ఐదేళ్లలో 200 మంది గీతన్నలు చనిపోయారని, మృతుల కుటుంబాలకు రూ.రెండు లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని విమర్శించారు. పాక్షిక, శాశ్వత అంగవైకల్యానికి రూ.50 వేలు చెల్లించాల్సి ఉండగా అతీగతీ లేదన్నారు. చెట్లకు ఉన్న మార్కింగ్ తీసేసి చెట్లను నరికేస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లుగీత కార్మికులకు కేరళ ప్రభుత్వం అమలు చేస్తోన్న విధానాలను మన రాష్ట్రంలో ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. చనిపోయిన వారి కుటుంబాలకు తక్షణమే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గాయపడిన వారికి నష్టపరిహారం చెల్లించాలని, నీరా ప్రాజెక్టు అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లుగీత కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.రమణ మాట్లాడుతూ రాష్ట్రాలు వేరైనా, పాలకులు మారినా గీత కార్మికుల కష్టాలు మాత్రం తీరడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో గీతన్నల సత్తా ఏమిటో చూపిస్తామని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు అన్నారు. ఆయన కార్యదర్శి నివేదిక ప్రవేశపెడుతూ ఐక్యంగా ఉన్న వృత్తిదారులను కులాలవారీగా విడదీసిన ఘనత వైసిపిదేనన్నారు. అనంతరం ఉద్యమ సీనియర్ నాయకులు, అతిథులను ఎమ్మెల్సీ ఐవి సత్కరించారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య, ప్రొఫెసర్ జుత్తిగ చంద్రప్రసాద్, మట్టా వెంకట్, రాష్ట్ర నాయకులు సిమ్మ అప్పారావు, బత్తిన నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలి

జెఎన్‌టియు (కాకినాడ), నన్నయ్య విశ్వవిద్యాలయాల స్నాతకోత్సవాల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జెఎన్‌టియుకె స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. కాకినాడలో జెఎన్‌టియుకె, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని నన్నయ యూనివర్శిటీ స్నాతకోత్సవాల్లో ఆయన బుధవారం పాల్గొన్నారు. పిహెచ్‌డి అవార్డు గ్రహీతలు, బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను గవర్నర్ అభినందించారు. కాకినాడ జెఎన్‌టియుకె 10వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ జెఎన్‌టియుకె న్యాక్ ఎం గ్రేడ్, యుసిఇకె ఎన్‌ఐఎ గుర్తింపు సాధించినందుకు యూనివర్శిటీ అధికారులను ప్రశంసించారు.

వికసిత్ భారత్ -2047 లక్ష్యాన్ని సాధించడంలో దేశంలోని యువతకు మార్గనిర్దేశం చేసే బాధ్యత విశ్వవిద్యాలయాలపై ఉందని తెలిపారు. ఒక మనిషి వ్యక్తిత్వాన్ని రూపుదిద్దడంలో విద్యా సంస్థల బాధ్యత ఎంతో ఉందన్నారు. ప్రజల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. జెఎన్‌టియుకె విసి జివిఆర్ ప్రసాదరాజు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి పాల్గొని మాట్లాడారు.

రాజమహేంద్రవరంలోని నన్నయ యూనివర్శిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు సాధించిన జ్ఞానం ప్రపంచానికి ఉత్తమ పౌరులుగా వారిని అందిస్తుందని తెలిపారు. విసి ఆచార్య కె.పద్మరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పద్మభూషణ్ సుధా నారాయణమూర్తి, తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి పాల్గొన్నారు.

గుంటూరు లలితా ఆస్పత్రిలో ఐటి సోదాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆదాయపు పన్ను శాఖ అధికారుల సోదాలు జరిపారు. ఆస్పత్రికి భారీగా ఆదాయ వనరులు వస్తున్నా పన్నులు సక్రమంగా చెల్లించడంలేదన్న ఫిర్యాదులతో సోదాలు జరిగినట్టు తెలిసింది. ఢిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు నుంచి దాదాపు 30 మంది అధికారులు ఈ సోదాల్లో పాల్గొన్నారు. గుంటూరు కొత్తపేటలోని నాలుగు బ్రాంచిల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదాయపు పన్ను శాఖ అధికారులతోపాటు పారామిలటరీ బలగాలు కూడా ఆస్పత్రి వద్ద బందోబస్తు నిర్వహించాయి. సోదాల నేపథ్యంలో సిబ్బంది, రోగులను బయటకు వెళ్లకుండా ఆంక్షలు విధించారు. బయటి వ్యక్తులను, మీడియాను ఆస్పత్రిలోకి అనుమతించలేదు. ఈ దాడుల వెనుక రాజకీయ కోణం కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా ఆస్పత్రి యాజమాన్యం ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉండటం వల్ల ఈ దాడులు జరిగాయన్న ప్రచారం కూడా ఉంది. గురువారం కూడా ఈ సోదాలు కొనసాగే అవకాశం ఉంది. సోదాలు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

విఒఎ, ఆర్‌పిల సమస్యలు పరిష్కరించాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్‌లోను, పట్టణాల్లో మెప్మాలో, మహిళా సాధికారత సంస్థ గ్రామ, పట్టణ స్థాయిలో పనిచేస్తున్న విఒఎ, ఆర్‌పిల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బుధవారం లేఖ రాశారు. విఒఎ, ఆర్‌పిలతో రాష్ట్ర ప్రభుత్వం ఏళ్ల తరబడి పనిచేయించుకుంటోందని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని, కానీ మూడేళ్లు దాటిన వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విఒఎ, ఆర్‌పిలను రోడ్డున పడేస్తుందని తెలిపారు. వెంటనే సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరారు. కాలపరిమితిని రద్దు చేయాలని, హెచ్‌ఆర్‌పాలసీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్సు పథకం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విఒఎల మెర్జ్ ఆపాలని ఎంతో కాలంగా ఆందోళన చేస్తున్నారని, వెంటనే వారి సంఘాల నాయకులను పిలిచి చర్చించి వారి కోర్కెలు పరిష్కరించాలని కోరారు. లక్షలాది మంది పేద మహిళలను కూడగట్టి, పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి వాటి బాధ్యతలను నిరంతరం శ్రద్ధతో నిర్వహిస్తున్నారని, 18 రకాల మొబైల్ యాప్స్ ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వర్క్‌తో పనిభారం తీవ్రమైందని పేర్కొన్నారు. మొబైల్స్, నెట్ బ్యాలెన్సు ఇవ్వకపోవడంతో సొంత డబ్బులే ఖర్చు చేస్తున్నారని, డ్వాక్రా సభ్యులతో మహిళా మార్టుల్లో సరుకుల కొనుగోళ్లకు టార్గెట్స్ పెట్టి విఒఎలతో బలవంతపు అమ్మకాలు చేయిస్తున్నారని అన్నారు. ఆర్‌పిలకు వేతన గ్యారెంటీ కూడా లేదని, పెర్ఫార్మెన్స్ పేరుతో కొద్ది అమౌంట్ చేతిలో పెడుతున్నారని వివరించారు. ఇన్ని బాధ్యతలు నెరవేర్చుతున్నా విఒఎ, ఆర్‌పిల సంఘాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకుని వారి సమస్యలు పరిష్కరించడం లేదని పేర్కొన్నారు. మరోవైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయని, విద్యుత్ ఛార్జీలు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగి కుటుంబ జీవనం భారంగా మారిందని వివరించారు. వెంటనే కాలపరిమితి సర్క్యులర్ రద్దుచేసి, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. 10 లక్షల గ్రూపు ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని, మెర్జ్ ఆపాలని, 15 సంఘాలలోపు ఉన్న విఒఎలకు ప్రభుత్వమే వేతనం చెల్లించాలని కోరారు. ఉపాధి కోల్పోయిన విఒఎలకు నష్టపరిహారం ఇవ్వాలని, కొత్తగా ఏర్పాటుచేసిన గ్రామ సమాఖ్యల విఒఎలకు వేతనాలు ఇవ్వాలని కోరారు. బ్యాంకు అకౌంట్ సరిగ్గా లేవన్న పేరుతో రెండున్నరవేల మందికి చాలా కాలంగా వేతనాలు వేయలేదని, ఆ బకాయిలు చెల్లించాలని, పొదుపు సంఘాలకు రూ.5 లక్షలకు వడ్డీ రాయితీ ఇవ్వాలని, రూ.20 లక్షల వరకు సున్నా వడ్డీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. డ్వాక్రా సభ్యులతో బలవంతపు కొనుగోళ్లు చేయించొద్దని, ఈ సమస్యలన్నిటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కరించాలని కోరారు.

అంగన్‌వాడీల సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలి

- ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా తమ న్యాయమైన 11 డిమాండ్లను పరిష్కరించాలని డిసెంబరు 12 నుంచి జనవరి 22 వరకు అంగన్‌వాడీలు చేపట్టిన కాలానికి సంబంధించి ఒప్పందం మేరకు సమ్మె కాలానికి వేతనాలను తక్షణం చెల్లించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి బేబిరాణి, ఉపాధ్యక్షులు ఎన్‌సిహెచ్ సుప్రజ, ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ బుధవారం స్త్రీ, శిశు సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సమ్మె విరమణ సందర్భంగా గ్రూప్ ఆఫ్ మంత్రులు, అధికారులతో జరిగిన సమావేశంలో సమ్మెకాలానికి వేతనాలు చెల్లిస్తామని, కేసులను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఒప్పందాలకు సంబంధించిన మినిట్స్ కాపీ ఇవ్వాలని కోరారు. అలాగే సమ్మె కాలంలో అంగన్‌వాడీలపై పోలీసులు బనాయించిన అన్ని రకాల కేసులను రద్దు చేయాలన్నారు.

ముద్దనూరులో హైటెన్షన్

- వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య ఘర్షణ
- రాళ్లు విసురుకున్న ఇరు గ్రూపుల నాయకులు
- కారు అద్దాలు ధ్వంసం
- రోడ్డుపై బైఠాయించి భూపేష్ రెడ్డి నిరసన

రోడ్డుపై బైఠాయించిన భూపేష్ రెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు (వైఎస్‌ఆర్ జిల్లా)

వైఎస్‌ఆర్ కడప జిల్లా ముద్దనూరులో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. ఇరు గ్రూపులకు చెందిన వారు పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. కుర్చీలు గాలిలో విసిరి వేశారు. ఈ సంఘటనలో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. వివరాలు.. నియోజకవర్గ వైసిపి నేత మునిరాజా రెడ్డి సోదరుడు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి మేనమామ వరుస అయిన శశిధర్‌రెడ్డి దాదాపు మూడేళ్లగా ఎమ్మెల్యేతో విభేదించి పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఇటీవల కమలాపురంలో నిర్వహించిన 'రా కదలిరా' కార్యక్రమంలో చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ నేపథ్యంలో శశిధర్‌రెడ్డి తన అనుచరులను జమ్మలమడుగు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేర్చేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయమై చర్చించేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు శశిధర్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మునిరాజా రెడ్డి తన అనుచరులతో కలిసి అక్కడకు చేరుకుని ఆగ్రహంతో టిడిపి నాయకులపై దాడి చేశారు. ఆగ్రహించిన టిడిపి కార్యకర్తలు ఎమ్మెల్యేపై తిరగబడడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. శశిధర్‌రెడ్డి ఇంట్లో ఉన్న టిడిపి నాయకులను బలవంతంగా బయటకు లాగేశారు. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకోవడంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో ఇరు గ్రూపులకు చెందిన వారు పరస్పరం కుర్చీలు, రాళ్లు విసురుకున్నారు. రాళ్ళ దాడిలో ఒక కారు, శశిధర్ రెడ్డి ఇంటి అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఇరు గ్రూపులకు చెందిన వారిని చెదరగొట్టారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని భూపేష్‌రెడ్డి తన కార్యకర్తలతో రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు ఆయనను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పోలీసులను అడ్డు పెట్టుకొని దాడులకు పాల్పడుతున్నారని భూపేష్‌రెడ్డి ఆరోపించారు. దేవగుడి నాయకులు జమ్మలమడుగు నియోజకవర్గంలో వైఎస్‌ఆర్ నాయకులను, కార్యకర్తలను ప్రలోభపెట్టి కుటుంబంలో చిచ్చు పెడుతున్నారని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆరోపించారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ముద్దనూరులో భారీగా పోలీసులు మోహరించారు.

ప్రత్యేక హోదా కోసం ఉద్యమించాలి

- ప్రత్యేక హోదా సాధన సమితి డిమాండ్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాధన సమితి నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం ఎన్నికల ముందే ఉద్యమించి సాధించుకోవాల్సిన అవసరం ఉందని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వివి లక్ష్మీనారాయణ అన్నారు. ప్రత్యేక హోదాపై ప్రజల్లో చైతన్యం నింపేందుకు జిల్లాల పర్యటనలో భాగంగా శ్రీకాకుళంలోని ఒక హోటల్‌లో బుధవారం విలేకరుల సమావేశం, అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చివరి పార్లమెంటు సమావేశాల్లో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సందర్భంగా రాష్ట్రానికి చెందిన ఎంపిలు ప్రత్యేక హోదా డిమాండ్‌ను లేవనెత్తి, బడ్జెట్ ఓటింగ్‌లో పాల్గొనాలని సూచించారు. తమిళనాడు జల్లికట్టు ఉద్యమం తరహాలో చిత్తశుద్ధితో ఉద్యమిస్తే ప్రత్యేక హోదా సాధించడం కష్టమేం కాదన్నారు. రాష్ట్ర విభజన సమయంలో చట్టబద్ధంగా ఇచ్చిన విభజన హామీలను అమలు చేయని కేంద్ర ప్రభుత్వం వద్ద రాష్ట్రంలోని టిడిపి, వైసిపి ప్రభుత్వాలు మోకరిల్లి తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టాయని విమర్శించారు. విశాఖ రైల్వేజోన్, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధుల ఊసే లేకుండా పోయిందని తెలిపారు. కేంద్రం మెడలు వంచి హోదా సాధిస్తానన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్ల కాలంలో నోరు మెదపలేదని దుయ్యబట్టారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న బిజెపిని రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ఈ నెల 7, 8, 9 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేపడతామని తెలిపారు. హోదా సాధనకు రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ కలిసి రావాలని కోరారు. సమావేశంలో సాధన సమితి జిల్లా అధ్యక్షులు జి.నర్సునాయుడు, సిపిఎం, సిపిఐ నాయకులు, బార్ అసోసియేషన్ సభ్యులు, బిసి న్యాయవాదుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి చెందిన సంఘటన శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జీరుపాలెంకు చెందిన మత్స్యకారుడు సీకోటి నాగరాజు, ఆయన భార్య సంధ్య, కుమార్తె భవానీ(7), కుమారుడు రాజు, అత్త లక్ష్మి మంగళవారం రాత్రి భోజనం చేసి పడుకున్నారు. బుధవారం వేకువజామున నాలుగు గంటల సమయంలో నాగరాజు చేపల వేటకు వెళ్లారు. ఉదయం ఎనిమిది గంటలైనా తలుపులు తీయకపోవడంతో పక్క ఇంటి వాళ్లు తలుపులు తట్టారు. దీంతో కుమారుడు రాజు నిద్రలేచినా సంధ్య, లక్ష్మి, భవానీ అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. వెంటనే స్థానికులు వారిని పాతర్లపల్లి పిహెచ్‌సికి తరలించారు. అప్పటికే భవానీ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంధ్య, లక్ష్మిని మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సిఐ జి.రామచంద్రరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సంధ్య, లక్ష్మి స్పృహలోకి రావడంతో పోలీసులు వారి స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. ఆలౌట్ పెట్టి పడుకున్నామని, ఆ తర్వాత ఏం జరిగిందో తనకు తెలీదని సంధ్య తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వస్తేనే వాస్తవం తెలుస్తుందని పోలీసులు చెప్తున్నారు. ఎస్‌ఐ జి.రాజేష్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

వేలాది ఉద్యోగులపై పేపాల్ వేటు

- అదే బాటలో ఐరోబాట్

వాషింగ్టన్ : ఆర్థిక మందగమనం, వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా పలు టెక్ కంపెనీలు ఉద్యోగులను ఇంటికి పంపించడానికి వరుస కడుతున్నాయి. తాజాగా ఫైనాన్సియల్ టెక్నాలజీ దిగ్గజం పేపాల్ ప్రపంచ వ్యాప్తంగా 9 శాతం ఉద్యోగులపై వేటు వేయాలని నిర్ణయించింది. దీంతో సుమారు 2,500 మంది ఉద్యోగాలు రోడ్డున పడనున్నారు. తొలగింపులకు సంబంధించి ఉద్యోగులకు కంపెనీ సిఇఒ అలెక్స్ క్రిస్ ఇ-మెయిల్‌లో సమాచారం ఇచ్చారు. ఉద్యోగాలు కోల్పోతున్న వారికి ఈ వారాంతంలో సమాచారం అందజేస్తామని స్పష్టం చేశారు. కంపెనీలో డూప్లికేషన్ తగ్గించడం, వనరులను సమర్థంగా వినియోగించడం, ఆటోమేషన్ వినియోగంతో సంక్లిష్టతలు తొలగించేందుకు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. అభివృద్ధికి అవకాశం ఉన్న విభాగాల్లో తమ పెట్టుబడులు కొనసాగిస్తామన్నారు.

ఐరోబోట్‌లో 31% మంది ఇంటికి..

రోబోటిక్ వ్యాక్యుమ్ క్లీనింగ్ సొల్యూషన్స్ అందించే ఐరోబోట్ తన సిబ్బందిలో 31శాతం మందికి ఉద్వాసన పలకనుంది. వృద్ధి, లాభదాయకతను కొనసాగించేందుకు పునర్వ్యవస్థీకరణ ప్రణాళికల్లో భాగంగా కంపెనీలోని దాదాపు 350 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నట్లు ప్రకటించింది. ఆయా సిబ్బందికి పరిహార ప్యాకేజ్ వర్తింప చేస్తున్నట్లు పేర్కొంది. ఇటీవల కాలంలో గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, లింక్డిన్, మెటా తదితర దిగ్గజాలు ఒక్కొక్కటిగా ఉద్యోగుల తొలగింపునపై బాంబులు పేల్చుతున్న విషయం తెలిసిందే. అదే బాటలో మరిన్ని సంస్థలు నడుస్తున్నాయి. బడా కంపెనీల బాటలోనే చిన్న, మధ్యస్థాయి సంస్థలు సైతం ఉద్యోగులను వదిలించుకుంటున్నాయి. గతేడాదిగా కొనసాగుతున్న ఉద్వాసనలతో ఈ రంగంలో పని చేస్తున్న టెకీలు తీవ్ర ఆందోళనకు గురైతున్నారు. కాగా.. ఆయా కంపెనీలు భారీ ఆదాయాలు, లాభాలు సాగిస్తున్నప్పటికీ.. మరింత పొదుపు చర్యల్లో భాగంగా సిబ్బందిపై వేటు వేయడం గమనార్హం.

పేటియం పేమెంట్స్ బ్యాంక్‌పై నిషేధం

- డిపాజిట్ల సేకరణపై ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : పేటియం పేమెంట్ బ్యాంక్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఊహించని షాక్ ఇచ్చింది. ఆ సంస్థ సమీకరించే డిపాజిట్లు, రుణ లావాదేవీలపై నిషేధం ప్రకటించింది. రెగ్యూలేటరీ నిబంధనలను పాటించకపోవడం, పర్యవేక్షణలో లోపాల నేపథ్యంలో పేటియం పేమెంట్ బ్యాంక్‌పై ఆర్‌బిఐ చర్యలకు ఉపక్రమించింది. ఫిబ్రవరి 29 తర్వాత పేటియం పేమెంట్స్ బ్యాంక్ ఖాతాదారుల ఖాతాల్లో ఎలాంటి డిపాజిట్లు తీసుకోవడానికి అనుమతించబోమని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. వాలెట్లతో సహా ఎలాంటి రుణ లావాదేవీలు అనుమతించబడవని తెలిపింది. కాగా.. ఖాతాదారులు మాత్రం ఎలాంటి పరిమితులు లేకుండా తమ డిపాజిట్లను ఉపసంహరించుకోవడానికి, వినియోగించుకోవడానికి వీలు కల్పిస్తున్నట్లు ఆర్‌బిఐ పేర్కొంది.

ఎంజి మోటార్ మరోమారు స్టార్టప్‌లకు మద్దతు

గూర్‌గావ్ : ఎంజి మోటార్ ఇండియా మరోమారు స్టార్టప్‌లకు మద్దతును ఇవ్వడానికి ఎంజి డెవలపర్ ప్రోగ్రాం అండ్ గ్రాంట్ (ఎంజిడిపి) సీజన్ 5.0ను ప్రకటించింది. ఇందుకోసం స్టార్టప్ ఇండియా, మంతన్‌తో కలిసి విద్యుత్ మొబిలిటీలో ఎఐ వినూత్న ఐడియాలు కలిగిన స్టార్టప్‌లకు ఆర్థిక మద్దతును అందించనున్నట్లు పేర్కొంది.

బిఒబికి రూ.4,579 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 19 శాతం వృద్ధితో రూ.4,579 కోట్ల నికర లాభాలు సాధించింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 3.08 శాతానికి తగ్గాయి. గతేడాది ఇదే సమయం నాటికి జిఎన్‌పిఎ 4.53 శాతంగా, నికర ఎన్‌పిఎలు 0.99 శాతంగా ఉన్నాయి. కాగా.. 2023 డిసెంబర్ ముగింపు నాటికి బిఒబి నికర ఎన్‌పిఎలు 0.70 శాతానికి తగ్గాయి. నికర వడ్డీ ఆదాయం 2.6 శాతం పెరిగి రూ.11,101 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది మాసాల్లో బిఒబి నికర వడ్డీ ఆదాయం 10.4 శాతం వృద్ధితో రూ.32,929కోట్లుగా చోటు చేసుకుంది. వడ్డీయేతర ఆదాయం 57 శాతం ఎగిసి రూ.10,304 కోట్లుగా నమోదయ్యింది.

అమర రాజా ఫలితాలు ఆకర్షణీయం

ప్రముఖ బ్యాటరీ తయారీదారు అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ అంచనాలు మించి లాభాలు ప్రకటించింది. వాహన రంగంలో బ్యాటరీల డిమాండ్ మద్దతు లభించింది. దీంతో 2023-24 డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికంలో 7.6 శాతం వృద్ధితో రూ.240 కోట్ల నికర లాభాలు సాధించింది. రూ.219 లాభాలు నమోదు చేసే అవకాశాలున్నాయని జిఎస్ఇజి అంచనా వేయగా.. అంతకంటే లాభాలు ప్రకటించడం విశేషం. ఏడాదికేడాదితో పోల్చితే ఆటోమొబైల్ బ్యాటరీల డిమాండ్‌లో 21 శాతం పెరుగుదల చోటు చేసుకుందని ఆ పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అమరరాజాకు మారుతి సుజుకి, టాటా మోటార్స్, హీరో మోటో కార్ప్ తదితర ప్రధాన కంపెనీలు క్లయింట్‌గా ఉన్నాయి. గడిచిన క్యూ3లో కంపెనీ రెవెన్యూ 9 శాతం పెరిగి రూ.2881 కోట్లుగా నమోదయ్యింది.

శ్రీసిమెంట్ లాభాల్లో రెండు రెట్ల వృద్ధి

శ్రీ సిమెంట్ లిమిటెడ్ 2023 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రెండు రెట్ల వృద్ధితో రూ.701.85 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.281.83 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.4,299 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన త్రైమాసికంలో 21.5 శాతం పెరిగి రూ.5,223.18 కోట్లుగా చోటు చేసుకుంది.

ఆర్‌అండ్‌డి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం

- రియల్మీ ఇండియా ప్రొడక్ట్ మేనేజర్ వెల్లడి

హైదరాబాద్ : భారత్‌లో పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డి) సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నామని రియల్మీ ఇండియా ప్రొడక్ట్ మేనేజర్ బజుల్ కొచర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన రియల్మీ 12 ప్రో సీరిస్ 5జిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. బెంగళూరు ఐటి హబ్ ప్రాంతంలో యుఐ ఆర్‌అండ్‌డి సెంటర్ ఏర్పాటు యోచనలో ఉన్నామన్నారు. దీనికి సంబంధించిన సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. 400 మంది ఉద్యోగులను తీసుకోనున్నామని చెప్పారు. 33 మంది గ్లోబల్ భాగస్వాములతో జట్టు కట్టనున్నామన్నారు. ఆర్‌అండ్‌డిపై 470 శాతం వ్యయాలను పెంచనున్నామన్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా 20 కోట్ల స్మార్ట్‌ఫోన్లు సరఫరా చేయగా.. అందులో సగం 10 కోట్లు భారత్‌లోనే విక్రయించామన్నారు. రియల్మీ 12 ప్రో సీరిస్ 5జి ఫోన్ ప్రారంభ ధరను రూ.25,999గా నిర్ణయించామన్నారు. 8జిబి, 128జిబి ర్యామ్, 52ఎంపి సోనీ ఐఎంఎక్స్ 882 ప్రధాన కెమెరా, 32 ఎంపి సెల్ఫీ కెమెరాతో దీన్ని విడుదల చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 9 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో లభిస్తుందన్నారు.

సంపాదకీయం

బరితెగింపు

రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే లక్ష్యంగా మోడీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడానికి బరితెగిస్తోంది. ఈ విషయమై ఎన్ని విమర్శలు చేసినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో నామమాత్రపు మార్పు కూడా కనిపించడంలేదు. ప్రతిపక్షాలన్నీ కలిసి మూకుమ్మడిగా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అయినా..ఇడి, సిబిఐ వంటి సంస్థలను తమ జేబు సంస్థలుగానే మోడీ ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిపక్షనేతలను నయానో, భయానో లొంగదీసుకోవడానికి, అలా లొంగని వారిని కేసులతో వేధించడానికి ఆ సంస్థలను దుర్వినియోగపరుస్తున్న తీరు జుగుప్స కలిగిస్తోంది. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఇడి అధికారులు ఏడు గంటలకు పైగా ప్రశ్నించి, అరెస్ట్ చేయడం బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీయాదవ్‌ను లక్ష్యంగా చేసుకోవడం దర్యాప్తు సంస్థల దుర్వినియోగానికి తాజా నిదర్శనం. బిజెపి నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నందునే ఇడి వీరిని లక్ష్యంగా చేసుకుంది. బీహార్లో మహాకూటమి ప్రభుత్వం నుండి నితీష్ కుమార్ వైదొలిగి బిజెపి పంచన చేరిన మరుసటి రోజే ఇడి విచారణ ప్రక్రియ ప్రారంభం కావడం గమనార్హం. సిబిఐ నమోదు చేసిన కేసు ఆధారంగా తేజస్వీ తండ్రి, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు కూడా ఇటీవలే ఇడి నోటీసులు జారీ చేసింది. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు వ్యతిరేకంగా దశాబ్దాల తరబడి లాలూ సాగిస్తున్న పోరాటం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఇదే స్థితి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షుడు కేజ్రివాల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఇడి బాధితులుగా మారడానికి కారకులెవరో అందరికీ తెలిసిందే. ప్రత్యేకహోదా కోసం నిలదీసినందుకు ఇడి తనను వేధిస్తోందంటూ మన రాష్ట్రానికే చెందిన గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ ఏకంగా రాజకీయాలకు గుడ్‌బై చెప్పడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి దుర్నీతికి, దుర్వినియోగానికి ఉదాహరణాలెన్నో!

2014వ సంవత్సరంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి గత ఏడాది జనవరి వరకు దేశ వ్యాప్తంగా 121 మంది రాజకీయ నేతలపై ఇడి కేసులు పెట్టి విచారణ చేపట్టింది. వీరిలో 115 మంది అంటే 95 శాతం మంది ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు చెంది, బిజెపిని గట్టిగా వ్యతిరేకించేవారే కావడం గమనార్హం. ఇలా కేసులు నమోదైన వారు బిజెపిలో చేరితే వెంటనే వారిపై నమోదైన కేసులను ఎత్తివేయడం, వారిలో కొందరికి ప్రభుత్వ పదవులను సైతం కట్టబెట్టడం మోడీ సర్కారు బరితెగింపునకు మరో నిదర్శనం. మరోవైపు ఇడి కేసుల్లో నేరం రుజువై శిక్షపడినవి చాలా తక్కువ. అధికారిక లెక్కల ప్రకారం 2011 నుండి ఇడి 1600 కేసులు నమోదు చేసి, 1800 దాడులను ఇడి నిర్వహించింది. అయితే, నేరం రుజువై శిక్ష పడింది మాత్రం కేవలం 10 మందికి మాత్రమే! గడిచిన 18 ఏళ్లలో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఏ) కింద 5,422 మందిపై ఇడి కేసులు పెట్టి దర్యాప్తు చేయగా, 23మందికి మాత్రమే శిక్ష పడింది. ఇది కేవలం 0.5శాతం మాత్రమే! అయినా, భయపడుతున్నారంటే ఇతర దర్యాప్తు సంస్థలకు లేని ప్రత్యేక అధికారాలు ఇడి కి ఉండటమే కారణం. ముఖ్యంగా న్యాయస్థానాల అనుమతి లేకుండానే ఆస్తులు జప్తు చేసే అధికారం ఒక సారి కేసు నమోదైతే నేరం చేయలేదని రుజువు చేసుకునే బాధ్యత నిందితునిపైనే మోపడం వంటి అధికారాలను ఇ.డి కి అప్పగించారు.

ప్రస్తుత పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యుల్లో దాదాపు 90 శాతం మంది ఏదో ఒక కేంద్ర దర్యాప్తు సంస్థ నిఘానీడలో ఉన్నట్లు ఇటీవల విడుదలైన ఒక నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలోనే తమిళనాడు, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు ఇడి దాడులను అడ్డుకోవడంతో పాటు, ఆ సంస్థ సిబ్బందిపై కేసులు నమోదు చేశాయి. తాజాగా జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ కూడా ఇడి అధికారులు తన ప్రతిష్టను దెబ్బతీస్తున్నారంటూ కేసు దాఖలు చేశారు. తీవ్ర స్థాయిలో జరుగుతున్న ఈ అధికార దుర్వినియోగాన్ని అరికట్టి, దర్యాప్తు సంస్థల నిష్పాక్షికతపై ప్రజానీకంలో తిరిగి నమ్మకం కలిగించాలంటే అధికారం నుండి బిజెపిని సాగనంపడం ఒక్కటే మార్గం. ఈ లక్ష్య సాధనకు ఐక్యంగా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై ఉంది.

మహనీయుల మాట

చదువు మనిషిని పూర్తి మానవుడిగా తీర్చిదిద్దుతుంది. చర్చ సంసిద్ధ మానవుడిగా తీర్చిదిద్దుతుంది. రాత కచ్చితమైన మానవునిగా తీర్చిదిద్దుతుంది.

- ఫ్రాన్సిస్ బేకన్,
బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు.

కేంద్ర బడ్జెట్ ఎవరికి మేలు చేస్తుంది?

విశ్లేషణ

సజన్ ఎవ్జిన్

పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికలకు దేశం, రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చే ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను సమర్పించాలి. మోడీ ప్రభుత్వం వచ్చాక బడ్జెట్ ప్రాసంగికత బాగా తగ్గిపోయింది. ప్రభుత్వ ప్రకటనలు చాలా వరకు బడ్జెట్‌కు వెలుపలే జరిగిపోతున్నాయి. ప్రభుత్వం పార్లమెంటును చాలా వరకు విస్మరిస్తోంది. ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ తాజాగా విడుదల చేసిన 'ఇండియన్ ఎకానమీ-యాన్ ఓవర్ వ్యూ' నివేదిక దీనికి ఉదాహరణ. ఎప్పటిలాగే బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వే నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి. ఈ సంప్రదాయానికి బ్రేక్ వేస్తూ రెండు రోజుల క్రితం పార్లమెంట్ వెలుపల ఆర్థిక సర్వే తరహాలో ఓ నివేదికను ప్రధాన ఆర్థిక సలహాదారు విడుదల చేశారు.

రాబోయే సంవత్సరాల్లో భారత దేశం ఏడు శాతానికి పైగా ఆర్థిక వృద్ధిని సాధిస్తుందని, మూడేళ్లలో ఆర్థిక వ్యవస్థ పరిమాణం ఐదు ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. ప్రస్తుత సంవత్సరం మొత్తం ఆర్థిక వృద్ధి మార్కెట్ ధరల ప్రకారం (ద్రవ్యోల్బణానికి అనుగుణంగా) 10.5 శాతంగా ఉంటుందని గత బడ్జెట్‌లో, ఆర్థిక మంత్రి అంచనా వేశారు. ఇప్పటికే విడుదల చేసిన గణాంకాలను బట్టి చూస్తే ప్రస్తుత ఏడాది వృద్ధి తొమ్మిది శాతం లోపే ఉండనుంది. ఇది మోడీ ప్రభుత్వ ప్రకటనలలోని డొల్లతనాన్ని బయట పెడుతోంది. భారత ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుందని ఇటీవల బిజెపి నేతలు, మంత్రులు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసిన సంగతి కూడా గుర్తుంచుకోవాలి.

గత ఐదేళ్లలో మొత్తం దేశీయ ఆదాయంలో 18 శాతం వృద్ధిని ప్రభుత్వం ముందుకు తెస్తున్నది. దీనివల్ల ఎవరికి లబ్ధి చేకూరిందనేది పరిశీలించాలి. ఆర్థిక వ్యవస్థ చలనశీలతపై అధికారిక పరిశోధనలు చేసే ప్రైవేట్ ఏజెన్సీ 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' (సిఎమ్ఐఇ) ప్రకారం, దేశంలో ఐదు సంవత్సరాలలో ఉపాధి వృద్ధి శూన్యం. దీనికి కోవిడ్ మహమ్మారిని మాత్రమే నిందించలేం. 2019కి ముందు ఉపాధి పరిస్థితి దారుణంగా ఉండేది. యుపిఎ హయాంతో పోల్చితే మోడీ ప్రభుత్వం ఆర్థిక వృద్ధిని రెట్టింపు చేసిందని చెబుతుండగా, ఉపాధి వృద్ధి సగానికి పడిపోయింది. 100 మంది కార్మికులు చేసిన పనిని కొత్త టెక్నాలజీలను ఉపయోగించి 50 మంది చేస్తున్నారు. ప్రభుత్వం లాభాపేక్షతో పెట్టుబడిదారీ దోపిడీకి పాల్పడుతోంది. ప్రైవేటీకరించడం, కార్మిక చట్టాలను సరళీకరించడాన్ని ప్రభుత్వం లాభాలుగా చెప్పుకుంటున్నది. కానీ నిరుద్యోగం పెరుగుతున్న దేశంలో మార్కెట్ మందకొడిగా ఉంది.

> **యుపిఎ హయాంతో పోల్చితే మోడీ ప్రభుత్వం ఆర్థిక వృద్ధిని రెట్టింపు చేసిందని చెబుతుండగా, ఉపాధి వృద్ధి సగానికి పడిపోయింది. 100 మంది కార్మికులు చేసిన పనిని కొత్త టెక్నాలజీలను ఉపయోగించి 50 మంది చేస్తున్నారు. ప్రభుత్వం లాభాపేక్షతో పెట్టుబడిదారీ దోపిడీకి పాల్పడుతోంది. ప్రైవేటీకరించడం, కార్మిక చట్టాలను సరళీకరించడాన్ని ప్రభుత్వం లాభాలుగా చెప్పుకుంటున్నది. నిరుద్యోగం పెరుగుతున్న దేశంలో మార్కెట్ మందకొడిగా ఉంది. దేశంలో విలాసవంతమైన కార్ల అమ్మకాలు పెరుగుతున్నాయి. ద్విచక్ర వాహనాలు, చిన్న కార్ల విక్రయాలు పడిపోతున్నాయి. విలాసవంతమైన వస్తువులు ఎక్కువగా అమ్ముడవుతుండగా, మధ్యతరగతి, సామాన్య ప్రజలు ఉపయోగించే ఉత్పత్తులకు మార్కెట్ తగ్గిపోతోంది. వృద్ధిలో ధనవంతులు మాత్రమే లబ్ధిదారులు.**

దేశంలో విలాసవంతమైన కార్ల అమ్మకాలు పెరుగుతున్నాయి. ద్విచక్ర వాహనాలు, చిన్న కార్ల విక్రయాలు పడిపోతున్నాయి. విలాసవంతమైన వస్తువులు ఎక్కువగా అమ్ముడవుతుండగా, మధ్యతరగతి, సామాన్య ప్రజలు ఉపయోగించే ఉత్పత్తులకు మార్కెట్ తగ్గిపోతోంది. వృద్ధిలో ధనవంతులు మాత్రమే లబ్ధిదారులు. ఈ నేపథ్యంలోనే జిడిపి లో మూడు శాతం ఖర్చు చేసినా 4 కోట్ల మందికి ఉపాధి కల్పించవచ్చని ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ అభిప్రాయపడ్డారు. నిరుద్యోగిత రేటు 10 శాతంగా పరిగణిస్తే వెంటనే 4 కోట్ల మందికి ఉపాధి కల్పించాలి. ప్రస్తుత ఏడాది జిడిపి ని పరిశీలించినట్లయితే దీని కోసం 9.6 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే సరిపోతుంది. కార్పొరేట్లకు పన్ను మినహాయింపులు ఇవ్వడానికి, బ్యాంకుల్లో మొండి బకాయిలను మాఫీ చేసేందుకు ప్రభుత్వ ఖజానా నుంచి లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూడా ప్రభుత్వం నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోంది.

బడ్జెట్‌కు ముందు, ప్రధాన స్రవంతి మీడియా చర్చల నిండా కార్పొరేట్ల ఆందోళనలు, అంచనాలే. 2022-23 నాటికి దేశంలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని 2017లో కేంద్రం ప్రకటించింది. ఈ ప్రకటన ప్రభావంపై గణాంకాలు విడుదల చేయలేదు. రైతుల అనుభవంలో ఆదాయానికి గండి పడుతోందని రైతు సంఘాలు ఎత్తి చూపుతున్నాయి. విద్య, వైద్యం, సామాజిక సంక్షేమం వంటి రంగాల నుంచి ప్రభుత్వం క్రమంగా తప్పుకుంటున్నది. పెట్రోలియం ఉత్పత్తులపై ప్రత్యేక సుంకం పెంపుదల కేంద్రానికి ఆదాయం పెరగడానికి దారితీసింది, అయితే ద్రవ్యోల్బణం కట్టలు తెంచుకుంది. రాష్ట్రాల పట్ల కేంద్రం అనుసరిస్తున్న ప్రతికూల వైఖరిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ప్రత్యక్ష పన్నుల ద్వారా కేంద్రానికి ఆదాయం పెరుగుతోంది. 2022-23లో ప్రత్యక్ష పన్నుల రూపంలో రూ.19.72 లక్షల కోట్లు వచ్చాయని కేంద్రం పేర్కొంది. 7.78 కోట్ల మంది ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేశారు. వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు మినహాయింపులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందా అనే ప్రశ్న కూడా తలెత్తుతున్నది.

/ 'దేశాభిమాని' సౌజన్యంతో /

రామ రాజ్యమా...లౌకిక రాజ్యమా?

వ్యాఖ్య

జూలకంటి రంగారెడ్డి

ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఓట్ల కోసం ప్రజల మనోభావాలతో చెలగాటమాడటం కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బిజెపికి అలవాటు. మతాన్ని అడ్డం పెట్టుకుని ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని చాప కింద నీరులా దేశం మొత్తం వ్యాప్తి చేసే కార్యక్రమాన్ని యథేచ్ఛగా అమలు చేస్తున్నది. అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ట సందర్భంగా ప్రధాని చేసిన ఉపన్యాసమే అందుకు నిదర్శనం. ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్నది సాధువులు, సన్యాసులు, బడా వ్యాపారవేత్తలు, కోట్లాధిపతులు. ఎన్నికల ముందు రామ మందిరాన్ని ప్రారంభించి ప్రజల భావోద్వేగాలను తమ వైపు మరల్చుకోవాలన్నది బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్‌ల ప్రధాన ఎత్తుగడ. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, ప్రధాని మోడీ కలిసి రామమందిరాన్ని ప్రారంభించారు. దీన్నిబట్టి మనమేం అర్థం చేసుకోవాలి? మతం ముసుగులు తొలిగిపోయాయి. ఇక అంతా బహిరంగమే! ఎన్నికలయ్యేదాకా ఎక్కడ ఏం జరుగుతుందో, ఎలాంటి మత ఉద్రిక్తతలు చెలరేగుతాయో, ఘర్షణలు జరుగుతాయో తెలియని పరిస్థితి.

మతాన్ని, రాజకీయాలను వేరుచేసి చూడటం లేదు. మతానికి రాజకీయాలను అనుసంధానం చేసి అధికారం కోసం తన ఎత్తుగడలను అనుసరిస్తున్నారు మోడీ. గత 75 ఏళ్లలో ఏ ప్రభుత్వాలు చేయలేని దానిని కేంద్రం అమలు చేస్తున్నది. 1990లో ఎల్‌కె అద్వానీ రామజన్మభూమి పేరుతో రథయాత్ర ప్రారంభించి 1984లో రెండు సీట్ల నుంచి 150 సీట్లకు తీసుకొచ్చారు. అప్పటినుంచే కాషాయపు జెండా తన ఎజెండాను పూర్తిగా మార్చుకున్నది. బిజెపిగా అవతరించింది. పేరు మార్చింది. ప్రజలను ఏమార్చింది. తన విధానాలను ఆ తర్వాత అదే కార్యక్రమాన్ని రామజన్మభూమితో కొనసాగించి అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం అయోధ్యలో రాముని ప్రాణ ప్రతిష్ట అంకం పూర్తయింది. ఇక మధురలో కృష్ణ దేవాలయం, ఇతర దేవాలయాలపై దృష్టి సారించింది. నిరంతరం ప్రజలను మత ఉద్వేగాల వైపు మరల్చి ఓట్లు దండుకునే కార్యక్రమాన్నే బిజెపి పెట్టుకున్నది. మత విశ్వాసాలు వ్యక్తిగతమైనవి. పరమత సహనం పాటిస్తూ అందరినీ కలుపుకుపోయేదే రాజనీతి. రాజకీయాలు లౌకికత్వానికి సంబంధించినవి. వర్తమానంలో రాజకీయాలలో మతం ప్రధాన పాత్ర వహించే విధంగా బిజెపి తన ఎత్తుగడలను కొనసాగిస్తున్నది. ఇప్పుడు రామజన్మభూమి, రామాలయం వంటి అంశాలను తీసుకువచ్చి ప్రజలను మభ్యపెడుతున్నది. రామాలయాలు దేశమంతటా ఉన్నాయి. రాముడు ప్రజా సంక్షేమాన్ని కాంక్షించాడని చెప్తారు. అన్న మాట కోసం అధికారాన్ని వదిలి అడవులకు పోయాడంటారు. అయితే రామ నామం జపించే పాలకులు చేసిన వాగ్దానాలను ఉట్టి మీదకు ఎక్కించారు. నిత్యావసర ధరలను ఆకాశమార్గం పట్టించారు. సగటు పేద ప్రజలు ఆ ధరలను అందుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇది మోడీ రాజ్యంలో ప్రజల పరిస్థితి.

> **కోట్లాది టన్నుల ధాన్యం గోడౌన్లలో మూలుగుతున్నా పేద ప్రజలకు పంచడానికి చేతులు రావడం లేదు కానీ అదానీ, అంబానీ లాంటి వారికి లక్షల కోట్ల రూపాయలను రాయితీలిచ్చి ప్రోత్సహిస్తున్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన ఊసెక్కడ? ఉన్న ఉద్యోగాలను ఊడ పీకడమే కాకుండా పకోడీలు అమ్ముకోవడం కూడా ఉద్యోగమే అని సెలవిచ్చిన మోడీ ఈ దేశానికి 'మహా నాయకుడు', 'విశ్వగురు'!**

పదేళ్ల కిందట అధికారంలోకి రాక ముందు మోడీ మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టారు. రైల్వేస్టేషన్‌లో చాయ్ అమ్మినవాడిగా, వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన నాయకుడిగా, అందరి కష్టసుఖాలు తెలిసిన వ్యక్తిగా పరిచయం చేసుకుని ప్రచారార్భాటం ప్రారంభిస్తే ప్రజలు నమ్మారు. బిజెపి ని అధికారంలోకి తీసుకొచ్చారు. నాడు మోడీ చేసిన వాగ్దానాలేమిటి? నేడు చేస్తున్నదేమిటి? పేద ప్రజల, కార్మికవర్గ సంక్షేమం, బడుగు బలహీన వర్గాల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. రైతాంగం పట్ల దోపిడీ విధానాన్ని అనుసరించే చట్టాలను సంస్కరణల పేరుతో తీసుకొచ్చారు. కార్మిక వర్గాలను పరిశ్రమల అధిపతులకు, పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చే చేదు మందు లాంటి సంస్కరణలకు చక్కెరపూత పూశారు. యాజమాన్యాలకు కార్మిక వర్గం బానిసలుగా పనిచేసేలా తిరోగమన సంస్కరణలను ముందుకు తెచ్చారు. పెట్టుబడిదారుల లాభాలకు, వారి సంతోషం కోసం ఏదైనా చేయటానికి సిద్ధంగా ఉన్నామని మోడీ ఎప్పటికప్పుడు తన విధానాల ద్వారా తెలియజేస్తూనే ఉన్నారు. కోట్లాది టన్నుల ధాన్యం గోడౌన్లలో మూలుగుతున్నా పేద ప్రజలకు పంచడానికి చేతులు రావడం లేదు కానీ అదానీ, అంబానీ లాంటి వారికి లక్షల కోట్ల రూపాయలను రాయితీలిచ్చి ప్రోత్సహిస్తున్నారు. ఈ దేశంలో నిరుద్యోగాన్ని వేగంగా పెంచి పోషిస్తున్నది ఎవరు, మోడీ కాదా? ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన ఊసెక్కడ? ఉన్న ఉద్యోగాలను ఊడ పీకడమే కాకుండా పకోడీలు అమ్ముకోవడం కూడా ఉద్యోగమే అని సెలవిచ్చిన మోడీ ఈ దేశానికి 'మహా నాయకుడు', 'విశ్వగురు'!

ప్రభుత్వ రంగ పరిశ్రమలను టోకుగా అమ్మడం, బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టడం లాంటి చర్యలను నిస్సిగ్గుగా కొనసాగిస్తున్నారు బిజెపి పాలకులు. ఎన్ని ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మింది, బడా పెట్టుబడిదారులకు కట్టబెడితే ఎంత సంపద వచ్చింది గొప్పగా చెప్పుకుంటున్నారు. కానీ దేశాన్ని దోచుకుని సరిహద్దులు దాటించిన బడా పారిశ్రామిక వేత్తలను గురించి ఒక్క రోజు కూడా మాట్లాడరు! కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును పట్టపగలే బ్యాంకు రుణాల ద్వారా దోచుకున్న విజయ్ మాల్యా, నీరవ్ మోడీ లాంటి వాళ్ళ గురించి అసలు తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. నేడు ప్రపంచంలో మూడవ కుబేరుడిగా గౌతమ్ అదానీ ఎదిగాడు! ఇది ఎవరి చలువో అందరికీ తెలిసిందే. కేవలం మోడీ ఈ పదేళ్ల పాలనలో అదానీలు, అంబానీలు, టాటా బిర్లాలు కోట్లాది ఆస్తులను సంపాదిస్తూ వేగంగా ప్రపంచ కుబేరులను దాటిపోతున్నారు. దగా పడ్డ ప్రజల ఆదాయం, ప్రజల జీవన స్థితులు మాత్రం మారడం లేదు. కారణం, ప్రజల్ని మతం చుట్టూ భ్రమింపజేయడం ద్వారా అంతర్గత వ్యూహాల్ని అమలు చేస్తున్నారు. నూటికి ఎనభై శాతం వ్యవసాయ దేశంలో రైతుల బతుకులు చితికిపోతున్నా వారి గురించి పట్టించుకోరు. ప్రజల సంపద బడా కోట్లాధిపతుల చేతుల్లోకి వెళ్లిపోతున్నా మాట్లాడే పరిస్థితిలో లేరు. ప్రభుత్వ సంస్థలు నిర్వీర్య మైతున్నాయి, క్షీణిస్తున్నాయి. సంబంధమే లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. బిజెపి పాలన లో ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను కూడా ఏర్పాటు చేయలేదు. గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ప్రజలకు ఉపయోగమైన దేశానికి ప్రయోజన కరమైన బడా ప్రభుత్వరంగ సంస్థలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేసి అమ్మి వేయడం లేదా అంగడి దుకాణాలు ఇచ్చినట్లు కిరాయిలకు ఇస్తున్నది. ఇది దేశానికి నష్టదాయకమే కాదు, భవిష్యత్తుకు శాపం!

ప్రభుత్వ పరిశ్రమలను కొనుగోలు చేసిన పెట్టుబడిదారులు మాత్రం ఒకటికి పదింతలు కోట్లాది రూపాయలను ఆర్జిస్తున్నారు, డొల్ల కంపెనీలు సృష్టించి దోచుకుంటున్నారు. మన పాలకులు ఆనందపడుతున్నారు. ఇదే అసలైన అభివృద్ధిగా చెబుతున్నారు. మరి అదానీ అసలు స్వరూపాన్ని హిండెన్‌బర్గ్ బయటపెడితే దీనిపై స్పందించరేం? ఈ దేశంలో కోట్లాది మంది ప్రజల సొమ్మును కొంతమంది పెట్టుబడిదారులు దోచుకోవడం, దాచుకోవడం పరిపాటిగా పెట్టుకున్నారు. అందుకు మోడీ అండదండలే కారణమన్నది దేశ పౌరులకు తెలియంది కాదు. ఓవైపు పన్ను ఎగవేతలు, మరోవైపు భారీ కుంభకోణాలు విజృంభిస్తుంటే వాటి నియంత్రణలో కేంద్ర పాలకులు విఫలమయ్యారు.

మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు రూ.65 లక్షల కోట్ల అప్పు ఉన్న మన దేశం నేడు రూ.కోటి 55 లక్షల కోట్లకు ఎగబాకింది. ఇది మోడీ పాలనలో జరిగిన అప్పుల అభివృద్ధి. అప్పులు తీర్చడానికే కేంద్ర బడ్జెట్‌లో అధిక శాతం వడ్డీలకు కట్టాల్సి వస్తుంది. దేశ ప్రజలపై ఎక్కడలేని భారాలను మోపుతున్నది. దేశ ఆదాయ వనరుగా ఈ దేశంలోని కోట్లాది పేద ప్రజలను సరుకుగా మార్చుకుంటున్నది. దుడ్డుకర్ర లాంటి వివిధ పథకాలు తెచ్చి మధ్య తరగతి, పేద వర్గాల నడ్డి విరగ్గొడుతున్నది. అధికారం చేతిలో ఉందని తనకు తోచిన విధంగా వెనక ముందు చూడకుండా తిరోగమన విధానాలు అమలు చేస్తున్నది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి చర్యలు దేశాన్ని కుదేలు చేసింది అందరికీ తెలిసిందే. ఆ తర్వాత వచ్చిన కరోనా మహమ్మారిని అరికట్టలేక పోవడంతో కోట్లాదిమంది అసంఘటిత కార్మికుల ఉసురు తీసింది. రెక్కాడితే గాని డొక్కాడని కార్మికుల, పేద ప్రజలను దిక్కులేని వాళ్ళని చేసింది. పెద్ద నోట్ల రద్దు ద్వారా ఈ దేశంలో ఉన్న నల్లధనం బయటికి తీసకొస్తామని జబ్బలు చరిచింది. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకొచ్చి ఈ దేశ ప్రజల జన్‌ధన్ ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని చెప్పింది. ఒక్క రూపాయి నల్లధనం కూడా బయట పెట్టలేకపోయింది. దీనికితోడు ధరల్ని అదుపు చేయడంలో, నిరుద్యోగాన్ని రూపు మాపటంలో, వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో మోడీ పూర్తిగా విఫలమయ్యారు.

ఇది దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న మోడీ (రామ) రాజ్యం. ఈ రాజ్యంలో ప్రజా సంక్షేమం లేకపోగా పేదల బాధలు రెట్టింపయ్యాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదల తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. కార్మికుల హక్కులు కాలరాయబడ్డాయి. చదువు, వైద్యం కార్పొరేట్ల పరమైంది. మోడీ ప్రభుత్వం వైఫల్యాలను ఎప్పటికప్పుడు సిపిఐ (ఎం) లాంటి వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ప్రతిఘటి స్తున్నా, ప్రజల దృష్టిని మరల్చేందుకు బిజెపి-ఆరెస్సెస్ వేస్తున్న పాచికే రామరాజ్యం. ఇదే పదేళ్లలో మోడీ దేశానికి చేసిన నిర్వాకం. లోక్‌సభ ఎన్నికలకు సమయం ఆసన్నమైన సందర్భంగా మోడీ వేస్తున్న అడుగులను ఈ దేశంలోని యువకులు, ప్రజలు, విద్యావంతులు, మేధావులు గమనించాలి. భిన్నత్వంలో ఏకత్వానికి చిహ్నమైన భారత లౌకికత్వాన్ని ఓటు ద్వారా బలపరచాలి. అంధ విశ్వాసాల నుండి దేశాన్ని కాపాడుకోవాలి.

/ వ్యాసకర్త సెల్ : 9490098349/

జనవాక్యం

ఇంత పచ్చి అబద్ధమా!!

అప్పుడే పార్లమెంటు సభ ప్రారంభమైంది. టీవీ ఆన్ చేశాను. రాష్ట్రపతి మాట్లాడుతున్నారు. "పేదవారికి సైతం విమాన ప్రయాణం కలిగించాము" అన్న మాటలు మొదటిగా నాకు వినిపించాయి. ఒక రాష్ట్రపతి ఎంత పెద్ద అబద్ధం మాట్లాడారు? ఈ మాటలకు ప్రధాని మోడీ, హోం మంత్రి షా, మిగిలినవారు బల్లలు గుద్ది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంత పెద్ద అబద్దానికి అంత పెద్దగా చప్పట్లా! ఈ ఒక్క వాక్యం చాలు పాలకులు ఎంతగా ప్రజలను మోసం చేస్తున్నారో చెప్పటానికి. నేను ఇంతవరకు విమానాన్ని దగ్గరగా చూడలేదు. హైదరాబాద్ లోనో, మద్రాసు లోనో బస్సులో నుండి తాంబరం విమానాశ్రమం కనపడితే, అదిగో విమానం అనుకోవటం తప్ప దగ్గరగా ఇంతవరకు చూడలేదు. చిన్నపుడు ఆకాశంలో విమానం పోతుంటే అదిగో విమానం అనుకునేవాళ్ళం. ఎందుకనో ఈ మధ్య అలా విమానాలు కనపడటం లేదు. అలాంటిది పేదవాడికి విమాన ప్రయాణం కల్పిస్తున్నామని చెప్పటం పెద్ద జోక్, అబద్ధం. ఇంకొకటి రామమందిర నిర్మాణం కూడా రాష్ట్రపతి ప్రసంగంలో వచ్చింది. మసీదు పడగొట్టి రామ మందిరం కట్టడం దేశ అభివృద్ధిలో భాగమా! అయోధ్య తీర్పు ఇచ్చినవారికి రిటైర్ అయిన తరువాత వారికి ఒకరికి రాజ్యసభ సీటు, ఇంకొకరికి గవర్నరు పోస్టు ఇంక మిగిలినవారికి ఏమి ఇచ్చిందీ కూడా చెప్తే బాగుండేది!! దేశం ఇంతగా అభివృద్ధి చెందితే సీనియర్ సిటిజన్లకి రైల్వే చార్జీలో రాయితీ ఎందుకు తీసేసినట్లు? అభివృద్ధి అనేది పేరుకు మాత్రమే! పేదవాడు పేదవాడుగానే, ఇంకా పేదవాడిగా మారిపోతున్నాడు. విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి పెడుతోంది ప్రభుత్వం. టెలికం శాఖలు, రైల్వే ఇన్సూరెన్స్, బ్యాంకులు, రోడ్లు, నౌకాయానాలు, పోర్టులు ప్రతిదాన్ని ప్రవేట్ చేస్తున్నది ప్రభుత్వం. మరి అభివృద్ధి అంటే ఇదేనా! శాస్త్రీయ ఆలోచన పెంచాల్సిన సైన్సు కాంగ్రెసు సభలు నాన్ సైన్సు సభలాగా తయారు చేస్తున్నది ప్రభుత్వం. పద్మశ్రీలు వాడిపోతున్నాయి. దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, కులాల మధ్య చిచ్చుబెట్టి రాజకీయ లబ్ధి పొందాలనుకునే విధంగా పాలన ఉంటే దేశం అభివృద్ధి పథంలో పోతుందనుకోవటం, బల్లలు విరిగిపోయేలా చప్పట్లు కొట్టుకోవటం సరికాదు.

- నార్నె వెంకట సుబ్బయ్య

కొంప ముంచుతున్న మద్యపానం

ఈ మధ్య కాలంలో ఆల్కహాలు తాగే వారు ఫ్యాటీ లివర్, లివర్ సిర్రోసిస్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం. ముఖ్యంగా మద్యపానం మితిమీరి సేవించే వారికి వారి కాలేయం అత్యంత త్వరితగతిన దెబ్బతినడం ఖాయం. దీనినే లివర్ సిర్రోసిస్ అంటారు. దీని బారిన పడిన వారిని కాపాడటం కష్టం అని, కొన్ని సార్లు కాలేయ మార్పిడి సైతం చేయాల్సి వస్తుందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ నిపుణులు సెలవిస్తుండటం ఎంతైనా ఆలోచించాల్సిన విషయం. అంతేకాదు మద్యపానానికి బానిసయిన వారికి శరీరంలో కొవ్వు శాతం పెరిగి గుండె జబ్బులకు దారితీయడం, అధిక రక్తపోటుకు గురికావడం, నాడీ మండల వ్యాధుల బారినపడటం, నరాలు కండరాలు పటుత్వాన్ని కోల్పోయి చివరకు లివర్, పాంక్రియాస్ క్యాన్సర్లకు దారితీస్తుందని ఇటీవల పలు అధ్యయనాలు, సర్వేలు తెలియజేయడాన్ని బట్టి మానవాళికి ఈ మద్యపానం మూలాన ఎంతటి నష్టం వాటిల్లుతున్నదో ఇట్టే ఊహించవచ్చు. అదేపనిగా ఓ వేళా పాళా లేకుండా మద్యం సేవించడం మూలాన అది మెదడుపై, గుండెపై తీవ్ర ప్రభావం చూపడమే కాదు, దీనివల్ల మానవాళి రోడ్డు ప్రమాదాల బారిన పడటం అధికమవ్వడం, క్రమంగా ఈ సమాజం నుంచి దూరమవ్వడం వంటి దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో మత్తు అలవాటును వదులుకోకపోతే మాత్రం మద్యపాన ప్రియుల బతుకులు అధోగతిపాలే. వారు చేజేతులారా అనారోగ్యాన్ని కొనితెచ్చుకోవడంతో పాటు తమ శరీరాన్ని అత్యంత వేగవంతంగా గుల్ల చేసుకోవడమే తప్ప మరేమీ కాదు. అడ్డు అదుపు లేకుండా మద్యాన్ని మంచి నీళ్లలాగా తాగుతూ పోతే వారి ప్రోటీన్ లెవెల్స్ తక్కువయి విపరీతమైన అలసటకు గురికావడం, వారి శరీరంతో పాటు కాళ్లలో వాపు వచ్చి, పొత్తి కడుపులో ద్రవాలు పేరుకుపోవడం, కొన్ని సార్లు రక్తంతో కూడిన వాంతి అవ్వడం, మలం కూడా నల్లటి రంగులో రావడం, వారి కళ్ళు మాత్రం ముదురు పచ్చరంగులోకి మారి చివరకు అది వారి ప్రాణ నష్టానికి సైతం దారితీసే పరిస్థితులు ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకునే బదులు ముందుగానే మద్యానికి గుడ్ బై చెప్పాలి. లేకపోతే వారి ప్రమాదం. ఈ అమూల్యమైన విషయాన్ని గుర్తుపెట్టుకొని నడుచుకోవాలి. ఏది ఏమైనా మద్యపానం సేవనం మన పాలిట ఓ పెనుభూతం, శాపం అని వీలయినంత త్వరగా గ్రహించాలి. ఈ తాగుడు అనే వినాశకర అలవాటును ఆమడ దూరంలో ఉంచగలిగితే వారి ఆరోగ్యం పది కాలాల పాటు వర్ధిల్లుతుంది. లేకపోతే ఆస్పత్రి బారిన పడి అటు ఆర్థికంగా, ఇటు ఆరోగ్యపరంగా నష్టపోవాల్సి వస్తుంది. అందుకే వివేకంతో ఆలోచించి డాక్టర్ల సలహాలను పాటించి మద్యపానం అనే దురలవాటుకు స్వస్తి చెప్పాలి. అప్పుడే తమ జీవితాలను బాగుచేసుకోవటంతో పాటు, తమను నమ్ముకున్న కుటుంబ సభ్యులను సైతం రక్షించిన వారవుతారు.

- బుగ్గన మధుసూదనరెడ్డి, బేతంచెర్ల, నంద్యాల

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి
పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

24 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - పాచిపెంట (పార్వతీపురం మన్యం జిల్లా)

ఒడిశాలోని జైపూర్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు నుంచి 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ ధనుంజయరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్సై నారాయణరావు, సిబ్బంది కలిసి పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఘాట్ రోడ్డు మీదుగా బ్యాగులతో కాలినడకన వస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన జితేంద్ర కుమార్. రహేరాజ్ పుట్ బోలా నది అనే ముగ్గురు వ్యక్తులు చెక్ పోస్ట్ మీదుగా వస్తున్న వారిని తనిఖీ చేయగా 24 కేజీలు గంజాయి లభ్యమైంది. ఈ మేరకు గంజాయి స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

రెజ్లింగ్ క్రీడాకారులకు నకిలీ సర్టిఫికేట్లు..

సాక్షిమాలిక్

న్యూఢిల్లీ : నిబంధనలకు విరుద్ధంగా జాతీయ చాంపియన్ షిప్‌లు నిర్వహించడంతో పాటు నకిలీ సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు ఒలింపిక్ విజేత, ప్రముఖ రెజ్లర్ సాక్షి మాలిక్ బుధవారం ప్రక టించారు. రెజ్లర్ల ఆందోళనలతో వెనక్కి తగ్గిన కేంద్రం .. కొత్తగా ఎన్నికైన భారత రెజ్లింగ్ ఫెడరేషన్ (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడిని సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కేంద్రం నియమించిన అడ్‌హక్ కమిటీ ఫెడరేషన్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తోంది.

అయితే సస్పెండ్‌కు గురైన సంజయ్ సింగ్ నిబంధనలకు విరుద్ధంగా ఈ పోటీలు ఎలా నిర్వహిస్తారని, వారు జారీ చేసే నకిలీ సర్టిఫికెట్లు భవిష్యత్తులో క్రీడాకారులను ఇబ్బందులకు గురిచేస్తాయని హెచ్చరించారు. ఫెడరేషన్ నిధులను ఎలా దుర్వినియోగం చేస్తారని మండిపడ్డారు. ఈ విషయంలో క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ జోక్యం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

"క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో జైపూర్‌లో జాతీయ రెజ్లింగ్ చాంపియన్ షిప్ జరగనుంది. కానీ తన ఆధిపత్యాన్ని చాటుకోవడానికి సంజయ్ సింగ్ జాతీయ ఛాంపియన్‌షిప్‌లను నిర్వహిస్తున్నారు. నకిలీ సర్టిఫికెట్‌లని జారీ చేస్తున్నారు" సాక్షి మాలిక్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. " ఈ సర్టిఫికెట్‌లతో క్రీడాకారులకు ఉద్యోగాలు రావు. వారి తప్పు లేకపోయినా కేసులను ఎదుర్కోవాల్సి వస్తుంది. వారి భవిష్యత్తు నాశనం కాకుండా సంజయ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలి " అని పేర్కొన్నారు.

నేడు అసెంబ్లీకి కెసిఆర్..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం అసెంబ్లీకి రానున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆయన చేత ప్రమాణం చేయించనున్నారు. శాసనసభ ఎన్నికల అనంతరం కేసీఆర్ తొలిసారిగా అసెంబ్లీకి రానుండటం గమనార్హం. ఆ ఎలక్షన్ల అనంతరం ఆయన తుంటి విరగటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో శస్త్ర చికిత్స నిర్వహించిన సంగతి విదితమే. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు దగ్గర పడుతుండటం, ఫిబ్రవరి 27న రాజ్యసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓటేయాల్సి రావటంతో ఈలోపే ప్రమాణ స్వీకారం చేయాలని భావించిన కేసీఆర్, గురువారాన్ని మంచి రోజుగా నిర్ణయించుకున్నారు. ఆ మేరకు ప్రమాణ స్వీకారం చేయనున్న ఆయన... అనంతరం శాసనసభ లాబీల్లో ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో తనకు కేటాయించిన ఛాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

ఎసిబికి చిక్కిన జిఎస్‌టిఒ కిషోర్

- రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గలోని రాష్ట్ర పన్నుల శాఖ కార్యాలయంలో జిఎస్‌టిఒగా పనిచేస్తున్న ఎన్.కిషోర్ కుమార్ అవినీతి నిరోధక శాఖకు బుధవారం చిక్కారు. జిఎస్‌టి రిటర్న్ ఇచ్చేందుకు గానూ రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఎసిబి శ్రీకాకుళం డిఎస్‌పి బి.వి.ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... కిషోర్ కుమార్ రెండేళ్ళుగా పలాసలో జిఎస్‌టిఒగా పనిచేస్తున్నారు. పలాసకు చెందిన జీడి వ్యాపారి తన వ్యాపారానికి సంబంధించి జిఎస్‌టి పన్నులు చెల్లించారు. ఇందుకు సంబంధించి ఆయనకు రూ.14 లక్షల జిఎస్‌టి రిటర్న్ రావాల్సి ఉంది. ఆ మొత్తం కోసం కాశీబుగ్గలోని రాష్ట్ర పన్నుల శాఖ కార్యాలయంలో జిఎస్‌టిఒ కిషోర్ కుమార్‌ను సంప్రదించారు. 'మీకేం డబ్బులు రావని, తిరిగి మీరే ఇంకా చెల్లించాల్సి ఉంటుందేమో చూడాలి' అని అన్నారు. తాను చెల్లించాల్సిన పన్నులన్నీ సక్రమంగా చెల్లించానని, తనకు రిటర్న్ వస్తాయని పరిశీలించాలని వ్యాపారి కోరారు. తనకు రూ.1.50 లక్షల లంచం ఇస్తే, రిటర్న్ మొత్తం వచ్చేలా చేస్తానని కిషోర్ కుమార్ చెప్పారు. చివరకు రూ.లక్ష ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. జిఎస్‌టిఒ తీరుతో విసిగిన వ్యాపారి ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ప్రణాళిక ప్రకారం వ్యాపారి పన్నుల శాఖ కార్యాలయంలో జిఎస్‌టిఒకు రూ.లక్ష లంచం ఇస్తుండగా, అక్కడే మాటు వేసి ఉన్న ఎసిబి అధికారులు దాడి చేశారు. నగదును స్వాధీనం చేసుకున్న అనంతరం కార్యాలయంలోని ఫైళ్లను పరిశీఇంచారు. జిఎస్‌టిఒను అరెస్టు చేసి, విశాఖపట్నంలోని ఎసిబి కోర్టుకు గురువారం తరలించనున్నట్లు తెలిపారు. దాడిలో ఎసిబి సిఐ ఎన్.వి.రమణ, ఎస్ఐలు సత్యారావు, చిన్నంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వసూలు చేసి..జమచేయలేదు!

- రూ.20 లక్షల వరకు బకాయిలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించిన ఎరువులు, సబ్సిడీ విత్తనాలకు సంబంధించి డబ్బులను రైతుల నుంచి వసూలు చేశారు... ఆ డబ్బులను ఆయా సంస్థలకు చెల్లించే విషయంలో మాత్రం ఉద్యోగులు కాలయాపన చేస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో ఇలా చెల్లింపులు చేయని వారు అధికంగానే ఉన్నారు. చిన్న మొత్తాలుగానే కనిపిస్తున్నా ఈ ఘటన చిరుద్యోగుల పనితీరు ఏ విధంగా ఉందని చెప్పేందుకు నిదర్శనంగా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రైతు భరోసా కేంద్రాల నుంచి ఎరువులు, విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులు ముందుగా డబ్బులు చెల్లించి తమకు అవసరమైనవి తీసుకుంటారు. వసూలు చేసిన ఈ డబ్బులను ఆయా సంస్థలకు వసూలు చేసిన విహెచ్ఎ (విలేజ్ అనిమల్ హస్బండరీ అసిస్టెంట్లు) విఎస్ఎ(విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్లు) మరికొందరరు వారి వద్దనే ఉంచుకున్నారు. ఈ రకంగా చూస్తే 2023 సీజన్‌లో 29 రైతుభరోసా కేంద్రాల్లో కలిపి రూ.3.37 లక్షలు బకాయిలున్నాయి. ఇందులో రొళ్ల మండలంలోని గుడిగురికి రైతు భరోసా కేంద్రంలోనే రూ.1.16 లక్షల బకాయి ఉంది. తనకల్లు సదుంలో రూ.35 వేలు, కదిరి మండలం ఎగువపల్లిలో రూ.26 వేలు, నల్లచెరువు-2లో రూ.23 వేలు ఇలా బకాయిలు పెద్ద మొత్తంలోనే ఉన్నాయి. మడకశిర మండలం మన్నూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రం నుంచి కూడా రూ.1.18 లక్షలు బకాయి ఉంది.

విహెచ్ఎల నుంచి రూ.1.40 లక్షలు బకాయిలున్నాయి. రబీకి సంబంధించి మూడు రైతు భరోసా కేంద్రాల నుంచి రూ.94 వేలు బకాయిలున్నాయి. ఇవి కాకుండా ఇంకా 2022-23, 2023-24 కలిపి మొత్తం రూ.20 లక్షల వరకు విత్తనాలకు సంబంధించి బకాయిలు ఉన్నాయి. ఎరువులకు సంబంధించి కూడా పెద్దఎత్తునే బకాయిలున్నట్టు సమాచారం. అనంతపురం జిల్లా బుక్కరాసయముద్రం మండల పరిధిలో పెద్ద మొత్తంలో డబ్బులను కాజేసి అడ్రసు లేకుండాపోయి ఉన్నాయి.

ప్రాణం తీసిన విద్యుత్ తీగ

ప్రజాశక్తి- సోమల

అడవి జంతువుల కోసం అక్రమంగా వేసిన విద్యుత్ తీగ తగిలి చిత్తూరు జిల్లా సోమల మండలం ఆవుల పల్లె పంచాయతీ దేవల కుప్పం గ్రామం యానాది కుటుంబానికి చెందిన గణపతి (21) అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో మృతుడిని కాపాడేందుకు ప్రయత్నించిన వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మృతుడి భార్య నాగవేణి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకట నరసింహులు తెలిపారు. మృతుని భార్య, పోలీసుల వివరాల మేరకు.. యానాది కుటుంబానికి చెందిన గణపతి, సిద్ధయ్య, ఈశ్వరయ్య ముగ్గురు మంగళవారం సాయంత్రం కూలి పనులు ముగించుకుని ఇంటి వద్ద ఉన్నారు. అడవిలో కొన్ని గొర్రెలు తప్పిపోయాయని వెతకడానికి రావాలని గణపతి, సిద్ధయ్య, ఈశ్వరయ్యను చందు పిలిచాడు. అందరూ కలిసి సుందరనాయుడు మామిడి తోట వైపు గొర్రెలను వెతికేందుకు వెళ్లారు. అడవి పందులను చంపడానికి అక్రమంగా పొలంలో వేసిన విద్యుత్ వైర్లు గమనించకుండా గణపతి ముందుకు వెళ్లడంతో వైర్లు తగిలి కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే పడిపోయాడు. గణపతిని కాపాడేందుకు వెళ్లిన సిద్ధయ్య కూడా షాక్‌కు గురయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు హుటాహుటిన వారిని ఉప్పరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గణపతి మృతి చెందారు.

మాజీ జవాన్ అరెస్ట్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

నిజమైన పిస్టల్ కాదని స్నేహితులు ఎగతాళి చేయడంతో నిరూపించేందుకు ట్రిగర్ నొక్కారు ఓ జవాన్. దీంతో అతన్ని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన బుధవారం చిత్తూరులో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సిఐ విశ్వనాథరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక గిరింపేటకు చెందిన మాజీ జవాన్ మల్లికార్జున, అతడి స్నేహితులు మద్యం తాగేందుకు గిరింపేటకు వెళ్లారు. నీ దగ్గర ఉన్న పిస్టల్ నిజమైంది కాదంటూ స్నేహితులు ఎగతాళి చేయడంతో నిజం కాదని నిరూపించేందుకు తన వద్ద ఉన్న పిస్టల్‌ను తీసుకొని భూమిలోకి కాల్చారు. బార్ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు మల్లికార్జునను అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న పిస్టల్, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.

Paper Publication (Substituted service)
FORM NO.14 [See Regulation 33 (2)]

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(DEPARTMENT OF FINANCIAL SERVICES, MINISTRY OF FINANCE, GOVERNMENT OF INDIA)
31-31-21, Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME-TAX ACT, 1961)

RC/74/2022 02-01-2023

Bank of Baroda, Guntur Branch, Guntur District
Versus
M/s. Parameswara Cotton Traders & Others

To
(CD 1) **M/s. Parameswara Cotton Traders. Rep. by Prop. Sri Makkenna Koteswara Rao, S/o. Kotaiah,** 64/1, C/o Hima Bindu Commercial Corporation, Unit-II, Jagadamba Estate, Mahalakshmipuram, Etukuru Road, Guntur District-522003.
(CD 2) **Sri Makkenna Koteswara Rao , S/o Kotaiah,** D. No. 20-18-256, 7th Lane, D.S.Nagar, Ramalayam Back Side, Sangadigunta, Guntur-522003.
(CD 3) **Sri Yenuganti Musalaiah, S/o Venkateswarulu,** D.No. 20-18-209, 9th Lane, DS Nagar, Etukuru Road, Guntur-522 003.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam in **OA/332/2019** an amount of **Rs.31,10,809/-(Rupees Thirty One Lakhs Ten Thousand Eight Hundred Nine Only)** along with pendentellite and future interest **@ 10.90 % p.a. with monthly rests from 26/03/2019** till realization and costs has become due against you (Jointly and severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **19/02/2024 at 10:30 a.m.** for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay,-
(a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
(b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.

Given under my hand and the seal of the Tribunal, on this date : 02/01/2023
(B.N.S.V.S.K.BANGARRAJU)
Recovery Officer

FORM NO.14
{See Regulation 33(2)}

OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Sri Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

RC/515/2019 18.12.2023

Canara Bank, Hindu College High School Campus Branch, Guntur
Versus
M/s Sri Anjaneya Traders & others

To
(CD-3) **Mr. Nagam Srihari Rao, S/o N Malleswara Rao,** Koyavaripalem, Praththipadu Mandal, Guntur Distroict-522001.
(CD-4) **Mr. Nagam Malleswara Rao, S/o N Venkaiah,** D No. 8-69, Koyavaripalem, Enamadala, Guntur District-522019.
(CD-5) **Mrs. Dodda Janaki, W/o Nagam Sivasankar,** D No. 12-14-19, Opp. Sivalayam Street, Kothapeta, Guntur District-522001.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam in **OA/418/2018** an amount of **Rs. 2,66,78,209.75 Ps (Rupees two crore sixty six lakhs seventy eight thousand two hundred nine and seventy five paisa only)** along with pendentallite and future interest @ 12.15% p.a compounded with monthly rests from 16.02.2018 till realization/ date of payment and the costs of Rs. 1,85,005/- (Rupees one lakh eighty five thousand and five only) has become due against you (Jointly and severally /Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on 05.02.2024 at **10:30 a.m**. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay,
(a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
(b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.
6. Attention is invited to **Rule 16** of the Second Schedule to the Income Tax Act, 1961 which is reproduced below:
16(1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.
16 (2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment

(Given under my hand and the seal of the Tribunal, on 18th December 2023)
(Avasarala Anil), Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

ADITYA BIRLA CAPITAL
ఆర్థిక పెట్టుబడుల రక్షిత సలహా
ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీసు: ఇండియన్ రాయన్ కాంపౌండు, వేరవల్, గుజరాత్ 362266.
బ్రాంచి ఆఫీసు: ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నం.40-2-5ఎ, సి.వి.ఆర్ చాంబర్, 6వ అంతస్తు, కళానికేతన్ ప్రక్కన, ఎం.జి.రోడ్, విజయవాడ-520010.

అమ్మకపు ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1))
ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ("సార్ఫసీ యాక్ట్") క్రింద ఆదిత్యా బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు చార్జ్‌చేయబడిన స్థిరాస్తి యొక్క ప్రైవేట్ ట్రీటీ ద్వారా అమ్మకం.

ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇందు తదుపరి **"ఎబిహెచ్ఎఫ్ఎల్"**గా పేర్కొనుట జరుగుతుంది) యొక్క అధీకృత అధికారి, ది సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇందు తదుపరి **"సార్ఫసీ యాక్ట్, 2002"**గా పేర్కొనుట జరుగుతుంది) యొక్క సెక్షన్ 13(4) క్రింద **కృష్ణా జిల్లా, పటమట సబ్-రిజిస్ట్రీ, పెనమలూరు మండలం, కానూరు గ్రామం గ్రామ పంచాయతి ఏరియా వద్దగల ఆర్.ఎస్.నం.18/5, 18/5(పి), ఆర్ఎల్‌పి నం.96/2011, ప్లాట్ నం.11, 12 లోకి వచ్చు పూర్తి విస్తీర్ణం 476.66చ.గ.లకుగాను 38చ.గ.ల విడదీయవీలులేని స్థలభాగంతోపాటు శ్రీ మారుతి ప్లాజాలో 150చ.అ.ల కార్ పార్కింగ్, 150చ.అ.ల ఉమ్మడి ఏరియాతో 767చ.అ.ల విస్తీర్ణంతో గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఫ్లాట్ నం.102"**గా గల స్థిరాస్తిని భౌతికంగా స్వాధీనంచేసుకున్నారు **(ఇందు తదుపరి "సెక్యూర్డ్ అసెట్"గా పేర్కొనుట జరుగుతుంది). ఫ్లాట్ యొక్క సరిహద్దులు: ఉత్తరం:** ఉమ్మడి దారి, **దక్షిణం:** ఒపెన్ టు స్కై, **తూర్పు:** ఒపెన్ టు స్కై, **పడమర:** ఫ్లాట్ నం.జిఎఫ్-10. ఏదైతే, ఆస్తి రుణసదుపాయంనకుగాను ఎబిహెచ్ఎఫ్ఎల్ పేరున హామీచూవబడినది., దీని బకాయి మొత్తాలు **08.07.2021 నాటికి రూ.33,42,136.18పై.లు (రూపాయలు ముప్పై మూడు లక్షల నలభై రెండు వేల నూటా ముప్పై ఆరు మరియు పద్దెనిమిది పైసలు మాత్రమే)** మరియు రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు **అందుగుల మహేశ్ బాబు & అందుగుల విజయ్ కుమార్ (ఇందు తదుపరి "రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు"గా పేర్కొనబడుతుంది)**ల నుండి రియలైజేషన్ తేదీ వరకు దానిపై తదుపరి వడ్డీ& వెచ్చించిన ఇతర వ్యయాలు. సెక్యూర్డ్ అసెట్ యొక్క బహిరంగ వేలం/ఇ-వేలాలు విఫలం చెందినందున, క్రింది సంతకందారు సదరు హామీ ఆస్తి పై సార్ఫసీ యాక్ట్, 2002 యొక్క నియమాలు మరియు దాని క్రింద రూపొందించిన రూల్స్ క్రింద ప్రైవేట్ ట్రీటీ ద్వారా అమ్మకం రూపేనా సదరు సెక్యూర్డ్ అసెట్ పై దీని సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ను స్వాధీనంచేసుకున్నారు. పై పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్ కొనుగోలుకు ఆసక్తిగల కొనుగోలు దారు నుండి అధీకృత అధికారి ఆసక్తి వ్యక్తపరుచుటను స్వీకరించారు. ఇప్పుడు అధీకృత అధికారి ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8&9 యొక్క నియమాలలో ప్రైవేట్ ట్రీటీ ద్వారా చెప్పిన సదరు సెక్యూర్డ్ అసెట్‌ను విక్రయించుటకు ఇందుమూలంగా ప్రకటన ఇస్తున్నారు. అమ్మకం అనునది, **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది"** షరతుపై రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు నుండి ఎబిహెచ్ఎఫ్ఎల్‌కు బకాయిగా **08.07.2021 నాటికి రూ.33,42,136.18పై.లు (రూపాయలు ముప్పై మూడు లక్షల నలభై రెండు వేల నూటా ముప్పై ఆరు మరియు పద్దెనిమిది పైసలు మాత్రమే)** లను రికవరీచేయుట కొరకు **22.02.2024** న లేదా తరువాత విక్రయించబడుతుంది. సెక్యూర్డ్ అసెట్ యొక్క రిజర్వు ధర **రూ.20,00,000/- (రూపాయలు ఇరువై లక్షలు మాత్రమే)**గా నిర్ణయించబడినది.

రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలకు ఇందుమూలంగా తెలియజేయబడుచున్నది ఏమనగా, సార్ఫసీ యాక్ట్, 2002 మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క నియమాల క్రింద అవసరమైన వారందరికీ తెలియజేయబడుచున్నది. మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(5) యొక్క నియమాల క్రింద సిఫారసుచేసినట్లుగా ప్రైవేట్ ట్రీటీ రూపేనా ఇందు పేర్కొన్నట్లుగా సెక్యూర్డ్ అసెట్ అమ్మకంకు సంబంధించి దీని సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ను స్వాధీన ప్రక్రియ క్రింద ఎబిహెచ్ఎఫ్ఎల్ ఇప్పుడు అనుసరిస్తుంది.

తదుపరి రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలు, సదరు సెక్యూర్డ్ అసెట్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, సార్ఫసీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

తేది: 01.02.2024 **అధీకృత అధికారి,**
ప్రదేశం: విజయవాడ **ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.**

యువత, మహిళ, రైతులు, పేదలు అనే నాలుగు స్తంభాలపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. బుధవారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభ రోజున రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించడం ఆనవాయితీ. కేంద్ర మంత్రివర్గం రూపొందించిన పత్రాన్నే రాష్ట్రపతి చదివి వినిపిస్తారు. ఆ ప్రకారమే బుధవారం రాష్ట్రపతి ప్రసంగం సాగింది. దేశ సంస్కృతి, సభ్యత ఎంతో చైతన్యవంతమైనవని, 21వ శతాబ్దంలో దేశం కొత్త సంప్రదాయాలకు తెరతీస్తుందని చెప్పారు. "శాంతి నికేతన్ ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది. భగవాన్ బిర్సా ముండా జన్మదినాన్ని జన్ జాతీయ దివస్ గా జరుపుకొంటున్నాం. తెలంగాణలో సమ్మక్క సారక్క గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు కానుంది. ఆదివాసీ యోధులను స్మరించుకోవడం గర్వకారణం" అని అన్నారు.

గత ఏడాది భారత్ ఎన్నో విజయాలను సాధించిందన్నారు. "ఆసియా క్రీడల్లో తొలిసారి 107, పారా క్రీడల్లో 111 పతకాలను సాధించాం. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించేలా 'నారీశక్తి వందన్ అధినియమ్' బిల్లును ఆమోదించుకున్నాం" అని అన్నారు. అటల్ టన్నెల్‌ను కూడా పూర్తి చేశామన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందని, ఆదిత్య ఎల్-1 మిషన్ ను విజయవంతంగా ప్రయోగించిందని అన్నారు. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ లాంటి పథకాలు దేశాన్ని మరింత బలోపేతం చేశాయన్నారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశం చాలా వేగంగా ఎదిగిందన్నారు.

ఇటీవల ప్రపంచం రెండు భారీ యుద్ధాలను, కరోనా మహమ్మారిని చూసిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంక్షోభ పరిస్థితి ఉన్నా.. సంక్షోభ సమయంలో తమ ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని నియంత్రణలో ఉంచేందుకు పటిష్ఠ చర్యలు తీసుకున్నామని వివరించారు. మధ్య తరగతి, సాధారణ ప్రజలపై ప్రభావం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు ముర్ము తెలిపారు. కరోనా మహమ్మారిని ధీటుగా ఎదుర్కొన్నామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. కరోనా సమయంలో 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ అందించామని గుర్తు చేశారు.

"మన చిన్నతనం నుంచీ 'గరీబీ హఠావో' నినాదాన్ని వింటున్నాం. కానీ, జీవితంలో తొలిసారి పేదరికం తగ్గుదలను చూస్తున్నాం. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా దేశం ముందుకెళ్తోంది" అని తెలిపారు. "దేశంలో 5జీ నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తోంది. కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకొచ్చాం. రక్షణ, అంతరిక్ష రంగంలో కొత్త ఆవిష్కరణలు జరిగాయి. ఉత్తరప్రదేశ్, తమిళనాడులో రక్షణ కారిడార్లు ఏర్పాటయ్యాయి. రక్షణ రంగ ఉత్పత్తులు దేశంలో తయారవడం గర్వకారణం. రక్షణ రంగం కోసం రూ.1 లక్ష కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నాం" అని అన్నారు.

రైతులకు పెట్టుబడి భారం తగ్గించి, లాభాలను అందించడమే తమ లక్ష్యమని, కిసాన్ సమ్మాన్ తో 10 కోట్ల మంది రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఉజ్వల కనెక్షన్లు పది కోట్లు దాటాయన్నారు. ఆవాస్ యోజన పథకం కింద సామాన్యులకు నీడ కల్పిస్తున్నామని, 4.10కోట్ల మందికి పక్కా ఇళ్లు నిర్మించామని అన్నారు. పదేళ్లలో వేల ఆదివాసీ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. రూ. 7 లక్షల ఆదాయం వరకు పన్ను లేకుండా చేశామని, సామాన్యులకు భారం పడకుండా పన్ను సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, 2 కోట్ల మంది మహిళలు స్వయం సమృద్ధి సాధించారని తెలిపారు. ట్రాన్స్ జెండర్లకు సమాజంలో గౌరవస్థానం కల్పించామని పేర్కొన్నారు. గ్రీన్ మొబిలిటీని ప్రోత్సహిస్తున్నామని, సౌర విద్యుదుత్పత్తిలో మన దేశం ప్రపంచంలోనే ఐదో స్థానంలో నిలిచిందనగనారు. దేశంలో లక్షకు పైగా స్టార్టప్ లు ఏర్పాటు చేశామన్నారు.

జమ్ముకాశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేయడం చరిత్రే అన్నారు. ఎన్నో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక పనులను గత పదేళ్లలో జాతీయ ప్రయోజనాల కోసం పూర్తి చేశామన్నారు. జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించి, ప్రపంచ దేశాల్లో ఇండియా గుర్తింపును బలోపేతం చేశామన్నారు. శతాబ్దాలుగా కలలు కంటున్న రామమందిర నిర్మాణం సాకారమైందని, ఎన్నో ఆటంకాలను అధిగమించి ఆలయాన్ని ప్రారంభించామని అన్నారు. కొత్తగా నిర్మించిన పార్లమెంట్ భవనంలో ప్రభుత్వ పథకాలపై అర్థవంతమైన చర్చ జరుగుతుందని ఆశిస్తున్నట్లు రాష్ట్రపతి ముర్ము తెలిపారు.

నేడు మధ్యంతర బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్ (ఓటు ఆన్ అకౌంట్)ను గురువారం ప్రవేశపెట్టనున్నారు. ఉదయం 11 గంటలకు ఆమె లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. దీంతో ఆమె వరుసగా ఆరోసారి బడ్జెట్ ను ప్రవేపెట్టనుంది. అనంతరం రాజ్యసభలో బడ్జెట్‌ను టేబుల్ చేస్తారు.

రాష్ట్రపతి ప్రసంగం అబద్ధాల పుట్ట

- దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రధాన సమస్యల గురించి ప్రస్తావన లేదు
- సిపిఎం పార్లమెంటరీ పార్టీ నేత ఎలమరం కరీం విమర్శలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



బుధవారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తూ రాష్ట్రపతి ద్రౌపది చేసిన ప్రసంగం దేశంలోని సామాజిక వాస్తవికతతో సంబంధం లేదని సిపిఎం పార్లమెంటరీ పార్టీ నేత ఎలమరం కరీం విమర్శించారు. బుధవారం పార్లమెంట్ ఆవరణంలో మీడియాతో ఎలమరం కరీం మాట్లాడుతూ అంకెలతో నిండిన ప్రసంగం తప్ప మరొకటి కాదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విధాన ప్రకటనలో మన దేశం ప్రస్తుతం ఎక్కడ ఉంది. ప్రభుత్వం భవిష్యత్తు కోసం విధానాలను ఎలా రూపొందించాలో వివరిస్తుంది. కానీ రాష్ట్రపతి ప్రసంగం అలాంటిదేమీ చేయలేదని అన్నారు. అయోధ్యలోని రామమందిరాన్ని ప్రభుత్వ శ్రేష్ఠతకు ఉదాహరణగా పేర్కొన్న ఈ ప్రసంగం... ప్రజాస్వామ్య, లౌకిక దేశానికి సంబంధించిన విధాన ప్రకటన కాదా? అనే సందేహాన్ని రేకెత్తిస్తోందన్నారు. ప్రభుత్వ విజయాలను ప్రస్తావించిన రాష్ట్రపతి, అయోధ్యలోని రామమందిర ప్రజల శతాబ్దాల కోరిక నేడు నెరవేరిందని పేర్కొనడం దారుణంగా ఉందన్నారు. ఈ వ్యాఖ్య బిజెపి పాలనలో దేశం ఏ విధంగా ముందుకు సాగుతోందో స్పష్టంగా తెలియజేస్తోందని అన్నారు. పౌరసత్వ సవరణ చట్టం, రాజ్యాంగంలోని 370వ అధికరణం తొలగింపు, పార్లమెంట్ కార్యక్రమాలను తుంగలో తొక్కడంతోపాటు మోడీ ప్రభుత్వం సాధించిన విజయాలను జాబితా చేసిన రాష్ట్రపతి, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడమే ఈ ప్రభుత్వ ప్రధాన లక్షణమని గట్టిగా ప్రకటించినట్లుందని అన్నారు. దేశంలోని మైనారిటీ, వెనుకబడిన వర్గాలకు చెందిన పేదలు, ప్రజలు అనుభవించే ఇబ్బందులు, కష్టాలు విధాన ప్రకటనలో లేవని అన్నారు. పేదలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వ విధాన రూపకల్పనపై ప్రభావం చూపడం లేదని రాష్ట్రపతి ప్రసంగాన్ని బట్టి స్పష్టమవుతోందన్నారు. ముప్పై రెండు పేజీల విధాన ప్రకటన ప్రసంగంలో కార్మికుడు అనే ఒక్క మాట కూడా లేదని విమర్శించారు.

మౌలిక సదుపాయాల కల్పన, పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత రంగాల్లో ప్రభుత్వ జోక్యాలను కొనియాడుతూ ప్రసంగంలో ప్రస్తావించిన అనేక పథకాలు, సామాన్యులకు ఏ విధంగానూ ఉపయోగపడని ప్రకటనలు మాత్రమే, అబద్ధాలను చాటి చెప్పేందుకే ఈ విధాన ప్రకటన అని అన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను, దేశ సంపదను అమ్మేసే విధానాన్ని అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశాన్ని ఎలా ప్రగతిపథంలో నడిపిస్తుంది? అని ప్రశ్నించారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రధాన సమస్యల గురించి ప్రస్తావించని రాష్ట్రపతి విధాన ప్రకటన ప్రసంగం చాలా నిరాశపరిచిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సామన్య ప్రజలను దోచుకుని కార్పొరేట్ల జేబులు నింపే ప్రయత్నం చేస్తోందని, దీనికి తోడు ప్రభుత్వం అమలు చేస్తున్న తీవ్ర విభజన విధానం దేశాన్ని చీకటి యుగానికి నడిపిస్తోందని, ఇలాంటి పరిస్థితిలో కూడా మోడీ ప్రభుత్వాన్ని మెచ్చుకుంటూ రాష్ట్రపతి ప్రసంగం చేయాల్సి రావడం అతిపెద్ద విడ్డూరమని ఎలమరం కరీం విమర్శించారు.

పసిడికి తగ్గిన గిరాకీ

ముంబయి : ప్రపంచ వ్యాప్తంగా బంగారం గిరాకీ 2023లో ఐదు శాతం తగ్గి 4,448.4 టన్నులకు చేరిందని 'ప్రపంచ స్వర్ణ మండలి' నివేదిక తెలిపింది. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల పెట్టుబడుల నుంచి ఉపసంహరణల వల్లే గిరాకీ తగ్గిందని వివరించింది. 2022లో 4,699 టన్నుల బంగారానికి గిరాకీ నమోదైనట్లు గుర్తు చేసింది. అత్యధికంగా ఐరోపాలో పసిడి గిరాకీ 180 టన్నుల మేర తగ్గింది. 2013 తర్వాత ఈ ప్రాంతంలో ఈ స్థాయి క్షీణత ఇదే తొలిసారి. ఈక్విటీ మార్కెట్లు రాణించడం, వడ్డీరేట్ల కోత అంచనాల్లో అనిశ్చితి వల్లే పసిడి ఇటిఎఫ్‌ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ పెద్దయెత్తున నమోదైందని డబ్ల్యూజిసి నివేదిక వివరించింది. కేంద్ర బ్యాంకుల పసిడి కొనుగోళ్లు వార్షిక ప్రాతిపదికన 45 టన్నులు తగ్గి 1,037 టన్నులకు చేరింది. అత్యధికంగా పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా 225 టన్నులు, బ్యాంక్ ఆఫ్ పోలెండ్ 130 టన్నుల బంగారాన్ని తమ నిల్వల్లో చేర్చుకున్నాయని వెల్లడించింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఉజ్బెకిస్తాన్, నేషనల్ బ్యాంక్ ఆఫ్ కజకిస్తాన్ అత్యధికంగా విక్రయించాయి. 2010 నుంచి కేంద్ర బ్యాంకులు నికర పసిడి కొనుగోలుదారులుగా నిలుస్తున్నాయి. అప్పటి నుంచి దాదాపు 7,800 టన్నుల బంగారాన్ని కొన్నాయి. . నాణేలు, బిస్కెట్లకు గిరాకీ మూడు శాతం తగ్గింది. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా ఆభరణాల మార్కెట్‌లో గిరాకీ 17 శాతం పుంజుకోవటం గమనార్హం. భారత్‌లో మాత్రం ఈ విభాగంలో తొమ్మిది శాతం క్షీణత నమోదైంది.

మూడు రాష్ట్రాల్లో ఇడి సోదాలు

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లలో బుధవారం ఏకకాలంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోదాలు జరిపింది. భారత్ పేపర్స్ లిమిటెడ్ (బిపిఎల్) ముడిపడి ఉన్న రూ.200 కోట్ల బ్యాంక్ రుణాల మోసం కేసులో బుధవారం సోదాలు జరిగినట్లు సమాచారం. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) నిబంధనల ప్రకారం.. ఈ రాష్ట్రాల్లోని తొమ్మిది ప్రాంతాల్లో సోదాలు జరిపింది. జమ్ము, లుధియానాలో ఉన్న పేపర్ బోర్డ్ ప్యాకేజింగ్ కంపెనీ భారత్ బాక్స్ ఫ్యాక్టరీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (బిబిఎఫ్ఐఎల్)తో 2006 సెప్టెంబర్‌లో బిపిఎల్ చేరింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)తో పాటు బ్యాంకుల కన్సార్టియంతో ఆ సంస్థ డైరెక్టర్లు సుమారు రూ.200 కోట్ల బ్యాంక్ రుణాలను తీసుకుని మోసానికి పాల్పడినట్లు కేసు నమోదైంది.

'కుమారి' ఫుడ్‌స్టాల్‌కు ఇబ్బంది కల్గించవద్దు

- డిజిపికి తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ కేబుల్ బ్రిడ్జి వద్ద స్ట్రీట్ ఫుడ్ బిజినెస్ చేస్తూ జీవనం సాగిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్‌కు ఇబ్బంది కల్గించవద్దని డిజిపి రవిగుప్తాను ముఖ్యమంత్రి ఆదేశించారు. రోడ్డుపైన ట్రాఫిక్ జామ్ అవుతుందని ఆమెపై నమోదు చేసిన కేసును పరిశీలించి వెనక్కి తీసుకోవాలని, ప్రజా ప్రభుత్వంలో సామాన్యులపై ఇటువంటి విధానం సరైంది కాదని పోలీసులకు స్పష్టం చేశారు. త్వరలోనే కుమారి ఆంటీ ఫుడ్ స్టాల్‌ను సందర్శిస్తానని సిఎం అన్నారు. గుడివాడకు చెందిన కుమారి ఉపాధి కోసం కుటుంబంతో కలిసి హైదరాబాద్ వచ్చారు. ఇళ్లల్లో వంట పనిచేస్తూ రూ.30వేలతో కేబుల్ బ్రిడ్జి ప్రాంతంలో రోడ్డు పక్కన ఫుడ్ స్టాల్ పెట్టారు. కొద్దిరోజుల్లోనే విపరీతమైన గిరాకీ పెరడగంతో ఆ మార్గంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఫుడ్ స్టాల్‌ను మూయించి వేసి కేసు నమోదు చేశారు. దీనిపై రాజకీయంగా దుమారం రేగడంతో సిఎం రేవంత్ అలర్ట్ అయ్యారు. బుధవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో కుమారి ఆంటీ విషయాన్ని ప్రస్తావించారు.

రైతులకు కనీస మద్దతు ధరను ప్రకటించాలి

- ఓటాన్ అకౌంట్ సందర్భంగా ఎస్‌కెఎం డిమాండ్

న్యూఢిల్లీ : గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఓటాన్ అకౌంట్‌లో అన్ని పంటలకు సిటు ప్లస్ 50శాతంతో కనీస మద్దతు ధరను ప్రకటించి, దిగుబడులను సేకరించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బిజెపి అధికారంలోకి వస్తే రైతులకు పై మేరకు కనీస మద్దతు ధరను అమలు చేస్తామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసింది. పైగా పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో రైతులను మోసం చేస్తున్నారని, దీనికి తక్షణమే స్పష్టి చెప్పాలని కోరింది. క్వింటాల్‌కు రూ.2183 చొప్పున 2023-24 సంవత్సరానికి ప్రస్తుతమిస్తున్న కనీస మద్దతు ధర ఎటు ప్లస్ ఎఫ్ఎల్ ప్రాతిపదికన రూపొందించిందని తెలిపింది. కానీ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం చూసినట్లైతే క్వింటాల్‌కు రూ.2866 చెలించాల్సి వస్తుందని పేర్కొంది. బడా వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు, మధ్య దళారీలు కూడా రైతును తీవ్రంగా దోపిడీ చేస్తున్నారని విమర్శించింది. గురువారం నాటి ఓటాన్ అకౌంట్‌లో మోడీ ప్రభుత్వం పైన పేర్కొన్న మేరకు కనీస మద్దతు ధరను ప్రకటించని పక్షంలో రైతులెవరూ రాబోయే ఎన్నికల్లో బిజెపికి ఓటు వేయరని ఎస్‌కెఎం స్పష్టం చేసింది. రైతు లేకపోతే ఆహారం లేదనే చారిత్రక రైతాంగ పోరాటం నినాదాన్ని మోడీ గుర్తు చేసుకోవాలని కోరింది. ఈ ప్రభుత్వ హయాంలో 736మంది రైతులు అమరులయ్యారని తెలిపింది. 2021 డిసెంబరు 9న ఎస్‌కెఎంకి ఇచ్చిన రాతపూర్వక హామీని గౌరవిస్తూ మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందో లేదో చూడాల్సి వుందని పేర్కొంది.

బెంగాల్‌లో రాహుల్ కారుపై రాళ్ల దాడి

- ఇది తృణమూల్ పనే : మండిపడిన కాంగ్రెస్

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్న కారుపై బుధవారం రాళ్ల దాడి జరిగింది. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా మల్దా జిల్లాలోని హరిశ్చంద్రపూర్ ప్రాంతంలో రాహుల్ పర్యటిస్తుండగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆయన కారుపై రాళ్లు రువ్వారు. ఈ దాడిలో కారు వెనుక అద్దం పగిలిపోయిందని, అయితే రాహుల్‌కు ఎలాంటి గాయాలు కాలేదని రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌదరి తెలిపారు. దాడి జరిగిన కొద్ది సేపటి తర్వాత రాహుల్ కారు నుండి కిందికి దిగి జరిగిన నష్టాన్ని పరిశీలించారు. ఇలాంటి దాడులు ఆమోదయోగ్యం కావని అధీర్ అన్నారు. ఈ విధమైన చర్యలకు రాహుల్ భయపడబోరని చెప్పారు. రాళ్ల దాడికి తృణమూల్ కాంగ్రెస్సే కారణమని ఆరోపించారు. 'కారు వెనుక నుండి రాళ్లు రువ్వి ఉండవచ్చు. ఇంత జరుగుతున్నా భద్రతా సిబ్బంది పట్టించుకోలేదు. ఇది స్వల్ప సంఘటనే. అయినప్పటికీ రాహుల్‌కు ఏమైనా జరిగితే పరిస్థితి ఏమిటి? ఆయనకు తగినంత భద్రత కల్పించలేదు. ఈ దాడి ఎవరు చేయించారో మీకు అర్థమైందా? కాంగ్రెస్ ఎవరినీ అణగదొక్కదు. ఆయన్ని అడుగడుగునా ఇబ్బంది పెడుతున్నారు' అని అధీర్ విమర్శించారు. అయితే రాహుల్ వాహనంపై దాడి జరిగింది బెంగాల్‌లో కాదని, బీహార్‌లోని కతిహార్‌లో అని రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ వివరణ ఇచ్చారు. బీహార్‌లో యాత్ర ముగించుకున్న రాహుల్ బెంగాల్‌లో తిరిగి ప్రవేశించారు. అంతకుముందు ఆయన బీహార్‌లోని కతిహార్ జిల్లాలో రోడ్‌షో నిర్వహించారు.

మాల్దీవుల ప్రాసిక్యూటర్ జనరల్‌పై దాడి

మాలె : గత ప్రభుత్వం నియమించిన మాల్దీవుల ప్రాసిక్యూటర్ జనరల్ హుస్సేన్ షమీమ్ దాడి జరిగింది. బుధవారం ఉదయం షమీమ్ వ్యాయామం చేస్తుండగా గుర్తుతెలియని దుండగులు కత్తితో పొడిచినట్లు స్థానిక మీడియా తెలిపింది. ప్రస్తుతం ఆయన ఎడికె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ప్రకటించింది. స్థానిక మీడియా నివేదికల ప్రకారం.. షమీమ్‌పై తెల్లవారుజామున దాడి జరిగింది. నగర వీధుల్లో పదునైన వస్తువుతో దాడి చేశారు. ఎడికె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని మాల్దీవుల పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. 2019లో మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ (ఎండిపి) అధికారంలో ఉన్న సమయంలో అప్పటి అధ్యక్షుడు ఇబ్రహీం సోలిహ్ .. హుస్సేన్ షమీమ్‌ను ప్రాసిక్యూటర్ జనరల్‌గా నియమించారు. ఆయన పదవీకాలం నవంబర్ వరకు ఉంది. ఎండిపి ప్రస్తుత మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుపై అభిశంసన ప్రక్రియను ప్రారంభించిన సంగతి తెలిసిందే.

సామాజిక భద్రతా నిధుల్లో కోతలు, వేతన వివాదాలపై

ఫిన్లాండ్‌లో మూడు రోజుల సమ్మె ప్రారంభం

హెల్సింకి : ఫిన్లాండ్‌లోని కార్మిక సంఘాలు బుధవారం సమ్మెకు దిగాయి. మూడు రోజుల పాటు సాగే ఈ సమ్మెలో దాదాపు మూడు లక్షలమంది కార్మికులు పాల్గొంటున్నారు. ఫిన్నిష్ కార్మిక సంఘాల కేంద్ర సమాఖ్య, ఫిన్నిష్ వృత్తినిపుణుల సమాఖ్యలు ఈ సమ్మెకు పిలుపిచ్చాయి. ప్రధాని పెట్టెరి ఓర్పో నేతృత్వంలోని మధ్యే మితవాద ప్రభుత్వం ప్రతిపాదించిన సామాజిక భద్రతా నిధుల్లో కోతలు, లేబర్ మార్కెట్‌కు చేస్తున్న ఉపాధి సవరణలతో సమాజంలో తీవ్ర అసమానతలు పెరుగుతాయని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి. దీనివల్ల సమ్మె చేసేందుకు ఉద్యోగులకు గల హక్కులు నియంత్రించబడతాయి. వేతనాల పెంపులు చేయకుండా నేషనల్ లేబర్ మీడియేటర్‌ను నివారిస్తుంది. దీన్ని కార్మికులు తీవ్రంగా నిరసిస్తున్నారు. వేతనాలను ఎలా నిర్ధారించాలన్న విషయంలో ఇప్పటివరకు నేషనల్ లేబర్ మీడియేటర్ పాత్ర వుండేది. తాజాగా ఓర్పో ప్రభుత్వం తీసుకునే చర్యలతో సమాజంలో అసమానతలు పెరుగుతాయని, కార్మికుల స్థితిగతులు బలహీనపడతాయని, దిగువ ఆదాయ గ్రూపులకు, నిరుద్యోగులకు ముప్పు వాటిల్లుతుందని ఆయా యూనియన్లు విమర్శిస్తున్నాయి.

ఈ సమ్మెతో దేశవ్యాప్తంగా కిండర్‌గార్టెన్, ప్రీ స్కూళ్ళు మూతపడతాయి. వైమానిక రవాణా, పోస్టల్ సేవలకు అంతరాయం కలుగుతుంది. ప్రజా రవాణా మూత పడుతుంది. దేశవ్యాప్తంగా ఫ్యాక్టరీలు, దుకాణాలు, హోటళ్ళు అన్నీ మూతపడతాయి. ఈ సమ్మె కారణంగా దాదాపు 550 విమానాలను రద్దు చేసినట్లు జాతీయ వైమానిక సంస్థ ఫిన్ ఎయిర్ ప్రకటించింది. ప్రధానంగా హెల్సింకి విమానాశ్రయంలో ట్రాఫిక్‌ను బాగా తగ్గించినట్లు తెలిపింది.

ప్రభుత్వం ప్రతిపాదించిన కోతలను, మార్పులను తక్షణమే విరమించాలని సెంట్రల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఫిన్నిష్ ట్రేడ్ యూనియన్స్ (ఎస్ఎకె), ఫిన్నిష్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ప్రొఫెషనల్స్ (ఎస్‌టిటికె)లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.

బలూచిస్తాన్‌లో

తీవ్రవాదుల దాడుల్లో 15మంది మృతి

కరాచి : పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో భారీగా సాయుధులైన తీవ్రవాదులు మూడు చోట్ల దాడులు జరిపారు. ఈ దాడుల్లో 9మంది తీవ్రవాదులతో సహ 15మంది మరణించారు. వీరిలో నలుగురు లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, ఇద్దరు సామాన్య పౌరులు వున్నారు. ప్రావిన్స్ రాజధాని క్వెట్టాకు 70కిలోమీటర్ల దూరంలోని మాచ్ పట్టణంలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి. జనవరి 29 అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ దాడులు చోటు చేసుకున్నాయని, పలువురు తీవ్రవాదులు, ఆత్మాహుతి బాంబర్లు ఈ దాడుల్లో పాల్గొన్నారని ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పిఆర్) ఒక ప్రకటనలో తెలిపింది. సత్వరమే స్పందించిన లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వారిలో 9మందిని హతమార్చారని, మిగిలినవారిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నారని ఆ ప్రకటన పేర్కొంది. ఈ క్రమంలో నలుగురు భద్రతా సిబ్బందితో పాటూ ఇద్దరు పౌరులు కూడా మృతి చెందినట్లు తెలిపింది. సెంట్రల్ మాచ్ జైల్లోకి చొరబడేందుకు తీవ్రవాదులు ప్రయత్నించిన సమయంలో వారిని అడ్డుకుని మట్టుబెట్టినట్లు ఆ ప్రకటన పేర్కొంది. ఈ దాడులకు తమదే బాధ్యత అని నిషేధిత తీవ్రవాద గ్రూపు బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) మజీద్ గ్రూపు ప్రకటించింది. దాడుల తర్వాత ఇరు పక్షాల మధ్య భీకరమైన పోరు సాగింది. పర్వతాల్లోకి పారిపోవడానికి తీవ్రవాదులు ప్రయత్నించడంతో దాన్ని అడ్డుకుంటూ అనేక గంటల పాటు పోరాటం సాగింది.

మరో అవినీతి కేసులో

ఇమ్రాన్ ఖాన్ దంపతులకు 14ఏళ్ల శిక్ష

కరాచి : అవినీతి కేసులో పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్యకు 14ఏళ్ల జైలు శిక్ష పడిందని ఆయన తరపు న్యాయవాది, జైలు అధికారులు తెలిపారు. ప్రభుత్వ రహస్యాలను లీక్ చేసిన కేసులో ప్రత్యేక కోర్టు ఇమ్రాన్‌కు పదేళ్ల జైలు శిక్ష విధించిన మరుసటి రోజే ఈ తాజా తీర్పు వెలువడింది. గతేడాది అధికారం నుండి వైదొలగిన తర్వాత ఖాన్ ఇప్పటివరకు మూడు కేసుల్లో దోషిగా నిర్ధారించబడి, శిక్షలు ఎదుర్కొంటున్నారు. ప్రధానిగా అధికారంలో వున్న సమయంలో వచ్చిన ప్రభుత్వ బహుమతులను అప్పగించకుండా తన వద్దనే వుంచుకుని, వాటిని విక్రయించిన అవినీతి కేసులో ఖాన్ దంపతులకు ఈ శిక్ష పడింది. అలాగే ప్రభుత్వ పదవులు నిర్వహించకుండా ఖాన్‌ను అనర్హుడిగా కూడా కోర్టు ప్రకటించింది. ఈ కేసులో ఖాన్ మౌలిక మానవ, ప్రాథమిక హక్కులు ఉల్లంఘించబడ్డాయని ఆయన తరపు న్యాయవాది బాబర్ అవాన్ వ్యాఖ్యానించారు. ఖాన్ లీగల్ బృందం వచ్చేవరకు కూడా వేచి వుండకుండా న్యాయమూర్తి చాలా హడావిడిగా శిక్ష విధించారని అన్నారు. పై కోర్టులో ఈ తీర్పును సవాలు చేయనున్నట్లు తెలిపారు.

డిమాండ్ల సాధన కోసం

ఫ్రాన్స్ రోడ్లపైకి వేలాదిమంది రైతులు

- అరెస్టులతో అడ్డుకుంటున్న మాక్రాన్ ప్రభుత్వం

పారిస్ : అధిక ఆదాయాల కోసం ఫ్రాన్స్‌వ్యాప్తంగా రైతాంగం పోరు సాగిస్తోంది. ఇందులో భాగంగా ట్రాక్టర్ల కాన్వాయ్‌లు బుధవారం పారిస్, లియాన్, ఇతర వ్యూహాత్మక నగరాలకు, ప్రాంతాలకు చేరుకుంటున్న సమయంలో ఫ్రెంచి పోలీసులు కొంతమంది రైతులను అరెస్టు చేశారు. దాదాపు 10వేల మంది రైతులు బుధవారం ఫ్రాన్స్ రోడ్లపైకి వచ్చారు. విదేశీ పోటీ నుండి రక్షణ కల్పించాలని, అధికార యంత్రాంగం ఆంక్షలను తగ్గించాలని వారు కోరుతున్నారు. పారిస్ నగరంతో పాటూ మూడో అతిపెద్ద నగరమైన లియాన్‌ను కూడా చుట్టుముట్టాలని చూస్తున్నారు. స్థానిక టోకు ఆహార మార్కెట్లను దిగ్బంధించాలని ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారిని అక్కడకు రానివ్వకుండా అడ్డుకుంటున్నారు.

అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల తీవ్ర అసంతృప్తిగా వున్న రైతులు ప్రధానంగా ఆహార మార్కెట్లను దిగ్బంధించే లక్ష్యంతో వున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన నగరాలు, వ్యూహాత్మక పాయింట్ల వద్దకు ఆందోళనకారులు రాకుండా ప్రభుత్వం అనేక ఆంక్షలను విధించింది. వాటిని అతిక్రమించిన పక్షంలో అరెస్టులు తప్పవని కూడా హెచ్చరించింది. కానీ ప్రభుత్వ హెచ్చరికలను ఏ మాత్రమూ పట్టించుకోని రైతులు, రంగిస్ నగరం దిశగా ట్రాక్టర్ల కాన్వాయ్‌ను ప్రారంభించారు. దీంతో రంగిస్ సమీపంలో పోలీసులు 15మందిని అరెస్టు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారన్న కారణంతో వారిపై కేసులు నమోదు చేశారు. నగరంలోని ప్రధాన ఫుడ్ మార్కెట్ వద్దకు రైతులు రాకుండా అడ్డగించారు.

జార్ఖండ్ సిఎం అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

రాంచీలోని కంకె రోడ్డు వద్ద సీఎం నివాసం వద్ద హేమంత్ సొరెన్‌కు చెందిన జేఎంఎం పార్టీ ఎమ్మెల్యేలు గుమిగూడి బల ప్రదర్శనను నిర్వహించారు. కేంద్రం ఆదేశాల మేరకు మా సీఎంను ఈడీ ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నదని హేమంత్ మద్దతుదారులు ఆరోపించారు.

జేఎంఎం నిరసనలు

అలాగే, సంకీర్ణ కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు సైతం సీఎంకు సంఘీభావం తెలిపారు. హేమంత్‌ను ఈడీ విచారిస్తున్న సందర్భంలో జేఎంఎం కార్యకర్తలు, మద్దతుదారులు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసనలు, ఆందోళలకు దిగారు. ఈడీకి, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈడీ విచారణ సందర్భంగా హేమంత్‌ను అధికారులు ఏ క్షణాన్నైనా అరెస్టు చేయొచ్చనే వార్తల నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం వరకు జార్ఖండ్‌లో హైడ్రామా చోటు చేసుకున్నది. దాదాపు 30 గంటల నిరీక్షణకు తెరదించుతూ హేమంత్ రాంచీలోని తన అధికారిక నివాసంలో సమావేశమయ్యారు. సంకీర్ణ ప్రభుత్వంలోని క్యాబినెట్ మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశమైన విషయం విదితమే. ఈ తరుణంలోనే హేమంత్ తన భార్యకు సీఎం పగ్గాలు అప్పగించనున్నారన్న వార్తలు గుప్పుమన్నాయి.

'ఇంక్విలాబ్ జిందాబాద్' అన్నందుకు మరోసారి ప్రమాణ స్వీకారం

- రాజ్యసభలో ఆప్ ఎంపి స్వాతి మలివాల్‌కు ఎదురైన ఘటన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ఇంక్విలాబ్ జిందాబాద్' అన్నందుకు ఒక రాజ్యసభ సభ్యురాలిని రెండోసారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత, డిసిడబ్ల్యు మాజీ చీఫ్ స్వాతి మలివాల్‌కు ఇలాంటి పరిస్థితి ఎదురయింది. రాజ్యసభ సభ్యురాలిగా ఇటీవల ఎంపికైన స్వాతి మలివాల్ చేత బుధవారం రాజ్యసభలో చైర్మన్ జగదీప్ ధన్ ఖర్ ప్రమాణ స్వీకారం చేయించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలిరోజు సందర్భంగా ఆమె ప్రమాణస్వీకారం చేసినప్పటికీ, ఒకసారి కాకుండా రెండు సార్లు ప్రమాణం చేయాల్సి వచ్చింది. ఇందుకుకారణంగా తొలుత ప్రమాణ స్వీకారం అనంతరం చివరిలో ఆమె 'ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ ముగించడమే. దీనిపై బిజెపి ఎంపి పీయూష్ గోయల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఆమె చేసిన ప్రమాణస్వీకారాన్ని చైర్మన్ రద్దు చేశారు. అనంతరం స్వాతి మలివాల్ రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన ఢిల్లీ రాజ్యసభ ఎన్నికల్లో ఆప్ అభ్యర్థిగా స్వాతి మలివాల్‌ను ఆ పార్టీ నిలబెట్టగా, ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఐదోసారి.. కేజ్రీకి సమన్లు

- రేపు హాజరు కావాలని ఈడీ సూచన

న్యూఢిల్లీ : ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి, అమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) బుధవారం మరోసారి సమన్లు జారీ చేసింది. శుక్రవారం విచారణకు హాజరు కావాలని తెలిపిందిది. కేజ్రీవాల్‌కు ఇడి అధికారులు గత సంవత్సరం నవంబర్ 2, డిసెంబర్ 22, ఈ ఏడాది జనవరి 3, 18 తేదీల్లో సమన్లు జారీ చేసింది. అయితే ఆయన ఏ సందర్భంలోనూ విచారణకు హాజరు కాలేదు. కాగా కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తారని రాజధానిలో వదంతులు వ్యాపిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు తనను అరెస్ట్ చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని కేజ్రీవాల్ తరచూ ఆరోపిస్తున్నారు.

తాజా సమన్లను పరిశీలిస్తున్నామని ఆప్ న్యాయ నిపుణుల బృందం తెలిపింది. వీటిపై చట్ట ప్రకారం నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. 'ఐదో సమన్ల గురించి సమాచారం అందింది. దానిని మా న్యాయ నిపుణుల బృందం పరిశీలిస్తోంది. చట్ట ప్రకారం ఏం చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటుంది. గతంలో జారీ చేసిన సమన్లు చట్టవిరుద్ధమైనవి. వాటిపై ఈడీ నుండి సమాధానాలు కోరాము' అని ఆప్ ప్రధాన జాతీయ ప్రతినిధి ప్రియాంక కక్కర్ తెలిపారు.

కళ్ళకు గంతలు కట్టి, కాళ్ళు చేతులు కట్టేసి....

- గాజా స్కూల్లో వెలుగు చూసిన సామూహిక సమాధి

గాజా : ఉత్తర గాజాలో సామూహిక సమాధిని కనుగొన్నారు. కళ్ళకు గంతలు కట్టి, చేతులు వెనక్కి కట్టేసి మరీ 30మంది పౌరులను ఇజ్రాయిల్ బలగాలు ఉరి తీసినట్లు పాలస్తీనా అధికారులు తెలిపారు. ఉత్తర గాజాల్లో ఒక స్కూల్ వెనుక భాగంలోఈ మృత దేహాలను పడేసి వుండగా చూసి గుర్తించిన వారితో మీడియా మాట్లాడింది. ఈ ప్రాంతాన్ని శుభ్రం చేస్తుండగా, స్కూల్లో పెద్ద ఎత్తున రాళ్ళకుప్ప కనిపించిందని, వెంటనే అక్కడకు వెళ్ళిచూడగా దాని అడుగున డజన్ల సంఖ్యలో మృత దేహాలు పడి వున్నాయని వారు తెలిపారు. మృతదేహాలను చుట్టి వుంచిన నల్ల ప్లాస్టిక్ బ్యాగ్‌లను తెరవగానే అవన్నీ కుళ్లిపోయి దుర్వాసన వస్తోందన్నారు. పైగా కాళ్ళు, చేతులకు ప్లాస్టిక్ సంకెళ్ళు వేసి, కళ్లకు, తలకి బట్టతో గట్టిగా కట్టేసి వున్నాయని వారు చెప్పారు.

బెయిట్ లాహియాలో జరిగిన ఈ ఘటనను హమస్ తీవ్రంగా ఖండించింది. ఈ దారుణమైన నేరాన్ని వెంటనే డాక్యుమెంట్‌గా భద్రపరచాల్సిందిగా మానవ హక్కుల సంస్థలను హమస్ మీడియా కార్యాలయం కోరింది. అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన రూలింగ్‌ను ఏమాత్రమూ పట్టించుకోకుండా పాలస్తీనియన్లను నిర్మూలించాలనే అంతిమ లక్ష్యంతో ఇజ్రాయిల్ ఈ దాడులకు తెగబడుతోందని విమర్శిస్తూ టెలిగ్రామ్‌లో పోస్టు చేసింది.

అల్ అమల్ ఆస్పత్రి వెనుక భాగంలో 45రోజుల శిశువు, 75ఏళ్ళ వృద్ధురాలు మృతదేహాలను ఖననం చేస్తున్న వీడియోను పాలస్తీనా రెడ్ క్రీసెంట్ సొసైటీ విడుదల చేసింది. ఆస్పత్రిలో రోజుల తరబడి ఆక్సిజన్ లేకపోవడంతో వారు మరణించారని తెలిపింది. అల్ అమల్ ఆస్పత్రిపై ఇప్పటికి 10 రోజుల నుండి దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో గాజాలో ఆరోగ్య కేంద్రాలను, మొత్తంగా ఆరోగ్య వ్యవస్థను ధ్వంసం చేయడానికే ఇజ్రాయిల్ కంకణం కట్టుకున్నట్లు కనిపిస్తోంది. అల్ షిఫా ఆస్పత్రితో మొదలుపెట్టి ఇండోనేషియా ఆస్పత్రి, నాజర్ ఆస్పత్రి, తాజాగా ఖాన్ యూనిస్‌లోని అల్ అమల్ ఆస్పత్రి వరకు అన్నీ నేలమట్టమవుతున్నాయి. ఇజ్రాయిల్ ట్యాంకులు ఇప్పటికే చుట్టుముట్టి వున్నాయి. పైగా అటాక్ డ్రోన్‌లతో, భారీ మెషిన్ గన్‌లతో కూడా కాల్పులు సాగుతున్నాయి. ఆస్పత్రి కాంపౌండ్‌లో కదులుతున్న ప్రతి వాహనం, వ్యక్తినీ కాల్చేస్తున్నారు. ఇప్పటికే ఆస్పత్రిలో సేవలు స్తంభించాయి.

గాజాలోని ప్రజలకు సాయమందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను కాపాడుకోవాల్సి వుందని, సాయమందేలా చూడాల్సి వుందని యురోపియన్ యూనియన్ విదేశాంగ విధాన చీఫ్ పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి శరణార్థుల సంస్థ చర్యలపై ఇజ్రాయిల్ బలగాలు ఆరోపణలు చేసినప్పటికీ మనం వాటిని పట్టించుకోరాదని, వాటివల్ల ఈ మానవతా చర్యలు ఆగరాదని కోరారు.

చిన్నారి



మార్పు

అనాగాపురం అనే గ్రామంలో సింధు, అక్షయ అనే ఇద్దరు స్నేహితులు ఉన్నారు. వారిద్దరికీ చదువుకోవడం చాలా ఇష్టం. గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్య పూర్తి చేసి, పై చదువులకు పొరుగు గ్రామం రామాయంపేటకు వెళ్లారు. అలా వారు వెళుతున్న సమయంలో దారిలో ఒక ప్రాంతంలో పక్షులు, జంతువులు చనిపోయి కనిపించాయి. వారి కళ్లముందే ఒక పక్షి గిలగిలా కొట్టుకొని చనిపోయింది.

ఆ దృశ్యం చూసి ఇద్దరూ చాలా బాధపడ్డారు. అవన్నీ అలా 'ఎందుకు చనిపోతున్నాయా!' అని ఆలోచించారు. అక్కడ చాలా దూరం వరకు చెట్లు లేవు. నీటి ఆనవాళ్లు కూడా కనిపించలేదు. సమస్య ఏంటో స్నేహితులు ఇద్దరికీ అర్థమైంది. ఎలాగైనా పరిష్కారం తేవాలని గ్రామస్తులను కలిశారు. ఆ ప్రాంతంలో మొక్కలు నాటమని చెప్పారు. నీటి గుంట తవ్వమని అన్నారు. ఎవరూ పట్టించుకోలేదు. ఇక చేసేదేమీ లేక సింధు, అక్షయలే ప్రతిరోజూ ఆ దారిలో ఒక మొక్క నాటుతూ వెళ్లారు. పాఠశాలలో మిగిలిన ఆహారాన్ని తీసుకెళ్లి పక్షులకు వేసేవారు. మొక్కలకు నీళ్లు పోశారు.

సింధు, అక్షయ చేస్తున్న మంచి పని వల్ల గ్రామస్తుల్లో కూడా మార్పు వచ్చింది. గ్రామ సర్పంచ్ చంద్రయ్య వందల కొద్ది మొక్కలు నాటించారు. పక్షులకు ఆహారం సిద్ధం చేసి, నీటి గుంతలు తవ్వించారు. క్రమంగా చెట్లు పెరిగి కాయలు, పండ్లు పుష్కలంగా కాశాయి. వందల పక్షులు వాటిపై నివాసాలు ఏర్పరచుకున్నాయి. క్రమంగా ఆ దారంతా పక్షుల కిలకిలరావాలతో, చెట్ల నీడతో ఆహ్లాదంగా తయారైంది. బాగా చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడ్డ సింధు, అక్షయ గ్రామం వచ్చినప్పుడల్లా ఆ చెట్లను చూసి తెగ సంబరపడేవారు. అప్పుడప్పుడు వారు కూడా మొక్కలు నాటుతూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు.

- ఎస్. రేణుక,
8వ తరగతి, జెడ్‌పిహెచ్‌ఎస్, మెదక్ జిల్లా.



నీడను కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని వాహనాలు, వాటి నీడలు ఉన్నాయి. సరైన నీడను జత చేయండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

ఘంటసాల యోగ నందిని,
4వ తరగతి,
ఎంపిపిఎస్,
చటాకాయ,
ఏలూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

డిఎస్‌సి పేరుతో నాటకం

- టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికలకు రెండు నెలల ముందు డిఎస్‌సి నోటిఫికేషన్ అంటూ ముఖ్యమంత్రి సరికొత్త నాటకానికి తెరలేపారని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. నాలుగేళ్ల 10 నెలలుగా ఉపాధ్యాయుల భర్తీని పట్టించుకోకుండా ఇప్పుడు రాజకీయ ఎత్తుగడలో భాగంగా ఎన్నికల ముందు హడావుడి చేస్తున్నారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు 23 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని, మెగా డిఎస్‌సి ఇస్తామన్నారని గుర్తుచేశారు. తర్వాత ప్రతియేటా డిఎస్‌సి, గిరిజన యువతకు ప్రత్యేక డిఎస్‌సి అన్నారని తెలిపారు. ఇప్పుడు చివరకు ప్రజాగ్రహానికి గురై ఇంటికెళ్లే ముందు 6 వేల పోస్టులు భర్తీ చేస్తానంటున్నారని పేర్కొన్నారు. 2020-21 నాటికి రాష్ట్రంలో 50 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఏకోపాధ్యాయు పాఠశాలలు 12,386 నడుస్తున్నాయని కేంద్రం పార్లమెంటు సాక్షిగా చెప్పిందని తెలిపారు. రాష్ట్రంలో 18 వేల ఖాళీలు ఉన్నాయని, 8,366 పోస్టులు భర్తీ చేస్తామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అసెంబ్లీలో ప్రకటించారని గుర్తుచేశారు. ఎన్నికల సమయానికి ఈ ప్రక్రియ పూర్తి చేయడం సాధ్యమవుతుందా? అని ప్రశ్నించారు.

పంజాగుట్ట పోలీస్ సిబ్బంది మొత్తం బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగర చరిత్రలో ఎన్నడులేని విధంగా పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ సిబ్బందిపై వేటు వేశారు. పిఎస్‌లో పనిచేస్తున్న ఎస్ఐల నుంచి హోంగార్డుల వరకు మొత్తం 85 మందిని బదిలీ చేస్తూ బుధవారం సిపి ఉత్తర్వులు జారీచేశారు. వారందరినీ ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న 82 మంది సిబ్బందిని పంజాగుట్ట పిఎస్‌కు బదిలీచేశారు. కాగా, స్థిరాస్తి వ్యాపారి హత్య కేసులో సరిగా విచారణ జరపలేదన్న కారణంగా గోపాలపురం సిఐ మురళీధర్, ఎస్ఐ దీక్షిత్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ సిపి ఆదేశాలు జారీ చేశారు.

ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

విఓఎల కాలపరిమితి ఉత్తర్వులు రద్దు చేయాల్సిందే

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పొదుపు ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తున్న విఓఎల జీవితాలతో చెలగాటమాడేలా ప్రభుత్వం తీసుకొచ్చిన మూడేళ్ల కాలపరిమితి ఉత్తర్వులను తక్షణం రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కాలపరిమితి ఉత్తర్వులను రద్దు చేసే వరకు రాష్ట్ర వ్యాప్తంగా విఓఎలు చేసే అన్ని పోరాటాలకు సిపిఎం అండగా వుంటుందని తెలిపారు. మూడేళ్ల కాలపరిమితి ఉత్తర్వులను రద్దు చేయాలని, రాజకీయ వేధింపులను నిలువరించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్‌ను కల్పించాలని, వడ్డీ లేకుండా రూ.5 లక్షల వరకు రుణాలివ్వాలనే డిమాండ్‌తో ఎపి వెలుగు విఓఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు విజయవాడలో జరిగిన 36 గంటల దీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి వేలాది మంది విఓఎలు తరలివచ్చారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో చేపట్టిన ఈ మహాధర్నా రెండోరోజు అయిన బుధవారం కూడా కొనసాగింది. విఓఎల ధర్నాకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సంఘీభావం తెలుపుతూ మాట్లాడారు. మహిళా సాధికారత గురించి గొప్పలు చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం మహిళల పొదుపు ఉద్యమంలో పనిచేస్తున్న వారి ఉద్యోగ భద్రతకు ముప్పు కలిగేలా ఉత్తర్వులివ్వడం తగదని అన్నారు. మహిళా అభ్యున్నతికి కృషి చేస్తున్న విఓఎలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. విఓఎ లకు సంబంధం లేని పను లు చెప్పడం తగదని విమర్శించారు. మహిళలతో వస్తువులను కొనుగోలు చేయించాలని టార్గెట్లు పెట్టడం తగదని అన్నారు. విఓఎల సమస్యలను పరిష్కరించాలని సిపిఎంగా ముఖ్యమంత్రికి లేఖ రాశామని తెలిపారు. వేలాది మంది విఓఎలు 36గంటలపాటు నిరవధికంగా దీక్షలు చేస్తున్నారని, ప్రభుత్వం తక్షణం విఓఎలు, ఆర్‌పిల సంఘాల నాయకులతో చర్చించి మూడేళ్ల కాల పరి మితి ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. విఓఎల న్యాయమైన డిమాండ్లను శాసనమండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఉద్యోగ, కార్మికుల వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు విమర్శించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా వీధుల్లోకి నెట్టడం సరైందికాదని, తక్షణం విఓఎల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అమరావతి జెఎసి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విఓఎల ఉద్యోగ భద్రతకు ముప్పు కలిగేలా వున్న ఉత్తర్వులను రద్దు చేయాలన్నారు. న్యాయమైన విఓఎల పోరాటానికి అమరావతి జెఎసి అండగా వుంటుందన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దడాల సుబ్బారావు, ఎపి వెలుగు విఓఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి మాట్లాడారు. గ్రామీణ పేద మహిళలను సంఘటిత పరిచే విఓఎల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరిం చాలని కోరారు. కార్యక్రమంలో ఎపి వెలుగు విఓఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రూపాదేవి, కోశాధికారి తిరుపతయ్య, రాష్ట్ర నాయకులు సోమన్న, నిర్మల, లక్ష్మి, కమల, నాగేశ్వరరావు, మహాలక్ష్మి, రజని పాల్గొన్నారు.

విఓఎల సమస్యల పరిష్కారానికి చొరవ

విఓఎ ఉద్యోగుల సంఘం నేతలతో సెర్ప్ సిఇఓ ఇంతియాజ్

రాష్ట్రంలో పొదుపు సంఘాల్లో పనిచేస్తున్న విఓఎల సమస్యలను పరిష్కరించాలని ఎపి వెలుగు విఓఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది విఓఎలు విజయవాడలో చేపట్టిన 36 గంటల మహాధర్నాకు ప్రభుత్వం దిగివచ్చింది. బుధవారం సెర్ప్ సిఇఓ ఇంతియాజ్, సెర్ప్ అడిషనల్ ఐబి డైరెక్టర్స్ కుమారి, సత్యభామ వెలుగు విఓఎ ఉద్యోగుల సంఘం నాయకులను చర్చలకు ఆహ్వానించారు. దాదాపు రెండు గంటలపాటు జరిగిన ఈ చర్చల్లో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రూపాదేవి, కె ధనలక్ష్మి, కోశాధికారి తిరుపతయ్య, నాయకులు రాణి, రెడ్డప్ప, కృష్ణమ్మ, ఉమాదేవి, నిర్మలాదేవి, సుభాషిని, రాజ్‌కుమార్, లక్ష్మి, కృష్ణకుమారి, రజిని, సోమన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఓఎలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరించారు. ప్రభుత్వం కాలపరిమితి సర్క్యులర్ రద్దు, హెచ్‌ఆర్ పాలసీ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని ఇంతియాజ్ హామీ ఇచ్చారు. సిసి పోస్టులను భర్తీ చేసేటప్పుడు విఓఎలకు పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విఓఎలకు గ్రూప్ ఇన్సూరెన్స్‌ను రూ.7 లక్షలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. విఓఎల పాత బకాయిలు రూ.2.24 కోట్లను వారంలోపు చెల్లిస్తామన్నారు. విఓఎల వేతనాలకు సంబంధించి నిబంధనలకు వ్యతిరేకంగా వేధించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామైఖ్య సంఘం నుండి రూ.2 వేలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 14 సంఘాలు లోపు వున్న సంఘాల విఓఎలకు వేతనాలను చెల్లిస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి సంబంధించి జాయింట్ మీటింగ్‌ను ఏర్పాటుచేసి వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. అప్పుల రికవరీ కాకపోతే వేతనాలు నిలుపుదల, రికవరీ చేయడం వంటి చర్యలను నిలిపేస్తామని హామీ ఇచ్చారు.

భూమి కేటాయింపు రద్దుపై నిర్ణయానికి గడువు కావాలి

- హైకోర్టును కోరిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నం, యందాడ గ్రామంలోని హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్‌కు 12.41 ఎకరాల భూమి కేటాయింపు రద్దు అంశంపై నిర్ణయం తీసుకునేందుకు మరింత సమయం కావాలని హైకోర్టును రాష్ట్ర ప్రభుత్వం కోరింది. నాలుగు వారాల గడువు కావాలని రెవెన్యూశాఖ పిటిషన్ వేసినట్లు ప్రభుత్వ ప్లీడర్ పి సుభాష్‌రెడ్డి చెప్పారు. ఇందుకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం అంగీకరించింది. యందాడలోని సర్వే నెంబర్ 92/3లోని 12.41 ఎకరాల భూమిలో వృద్ధ, అనాధాశ్రమాలను నిర్మించాల్సి వుంది. అయితే, అక్కడ హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్‌కు కేటాయింపు చేయడాన్ని సవాలు చేస్తూ జనసేన కార్పొరేటర్ పిఎల్‌విఎన్ మూర్తి యాదవ్, టిడిపి నేత పల్లా శ్రీనివాసరావు పిల్స్ దాఖలు చేశారు. రద్దు విషయంపై నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వానికి గడువు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసి విచారణను వాయిదా వేసింది.

ప్రవాసాంధ్రుల సంక్షేమం, భద్రతే లక్ష్యం

- ఎపిఎన్‌ఆర్‌టిఎస్ అధ్యక్షులు వెంకట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రపంచ వ్యాప్తంగా ఉంటున్న ప్రవాసాంధ్రుల సంక్షేమం, భద్రత, అభివృద్ధే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఎపిఎన్‌ఆర్‌టిఎస్) అధ్యక్షులు వెంకట్ ఎస్ మేడపాటి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఎపిఎన్‌ఆర్‌టిఎస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రవాసాంధ్ర భరోసా, బీమా, ఉచిత అంబులెన్సు సర్వీస్, ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా, అడ్వాన్స్ ఐటి కోర్సుల్లో శిక్షణ, అంతర్జాతీయ నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు వంటి అనేక సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఎపిఎన్‌ఆర్‌టిఎస్‌లో రిజిస్టర్ చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున అందిస్తున్న తమ సేవలను ప్రవాసాంధ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఇఓ పి హేమలత రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టీస్‌లోనే నిమగ్నం

- స్పిన్‌పై టీమిండియా, రివర్స్ స్వీప్‌పై ఇంగ్లండ్ సాధన
- రేపటినుంచే విశాఖలో రెండో టెస్ట్

నెట్ ప్రాక్టీస్ చేస్తున్న ఇంగ్లండ్ ఆటగాళ్లను పరిశీలిస్తున్న టీమిండియా ఆటగాళ్లు

విశాఖపట్నం: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య విసిఎ-విడిసిఎ అంతర్జాతీయ మైదానంలో 2నుంచి రెండోటెస్ట్ ప్రారంభం కానుంది. చాలాకాలం తర్వాత ఈ మైదానంలో ఓ టెస్ట్ జరుగుతుండడంతో గెలుపే ధ్యేయంగా టీమిండియా ప్రాక్టీస్‌లో నిమగ్నమైంది. మంగళవారం ప్రత్యేక విమానంలో విశాఖ ఎయిర్‌పోర్టులో దిగిన ఆటగాళ్లు బస్సుల్లో భారీ భద్రత నడుమ హోటళ్లకు చేరుకున్నారు. రెండ్రోజుల ముందే ఇరుజట్ల ఆటగాళ్లు ఇక్కడకు చేరుకోవడంతో బుధ, గురువారాల్లో ప్రాక్టీస్ నిమగ్నం కానున్నారు. ఈ టెస్ట్‌కు టీమిండియా ప్రధానంగా స్పిన్నర్లను నమ్ముకొని బరిలోకి దిగుతోంది. ముగ్గురు స్పిన్నర్ల బృందానికి సీనియర్ రవిచంద్రన్ అశ్విన్ సారథ్యం వహించనున్నాడు. ఇక ఉప్పల్‌లో జరిగిన తొలిటెస్ట్‌లో ఇంగ్లండ్ నిర్దేశించిన 231 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా తడబడింది. ఆ పరాజయం తర్వాత కెప్టెన్ రోహిత్ శర్మ మాట్లాడుతూ.. టాప్ ఆర్డర్ బ్యాటర్స్ వైఫల్యమే ఇందుకు ప్రధాన కారణంగా చెప్పుకొచ్చాడు. ఇంగ్లండ్ ఇచ్చిన లక్ష్యం ఛేదించగలిగిందే అయినా.. విజయానికి దగ్గరకొచ్చి ఓటమిపాలవ్వడం నిరాశను కలిగించిందన్నాడు. విశాఖ చేరుకున్న పర్యటక జట్టు మాజీ కెప్టెన్ జో రూట్ బుధవారం ప్రాక్టీస్‌లో భాగంగా ఎక్కువగా రివర్స్ స్వీప్ షాట్లపైనే దృష్టి పెట్టాడు. ఇక తొలిటెస్ట్ హీరో స్పిన్నర్ హార్ట్‌లీ ఈ మైదానంలోనూ చెలరేగేందుకు నెట్స్ ప్రాక్టీస్‌లో ఎక్కువ బంతులను ఆటగాళ్లకు సంధించాడు. మరోవైపు ఓలీ పోప్ కూడా బంతిని నిర్దేశించిన స్థానాల్లో పంపేలా ప్రాక్టీస్ చేశాడు.

మార్పులకు అవకాశం...

రెండో టెస్టుకు స్వల్ప మార్పులతో బరిలోకి దిగేందుకు భారత్ జట్టు సిద్ధమవుతున్నట్టు సమాచారం. తొలి టెస్టు ఆడిన జడేజా, కెఎల్ రాహుల్ రెండోటెస్ట్‌కు దూరం కావడంతో.. వారి స్థానంలో కుల్దీప్, సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం కల్పించే చాన్స్ దక్కే సూచనలున్నాయి. ఒకే పేసర్‌తో బరిలోకి దిగాలని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తే సిరాజ్‌పై వేటు పడే అవకాశముంది. ఇక బ్యాటింగ్ విభాగంలోనూ కొన్ని మార్పులు చేసే అవకాశం కనిపిస్తోంది. మిడిలార్డర్‌ను పటిష్టం చేసేందుకు రజత్ పటీదార్‌కు చోటు దక్కినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

భారత్‌పైనే ఒత్తిడి...

ఇంగ్లండ్ ఎప్పట మాదిరిగానే బజ్ బాల్ వ్యూహంతోనే రెండో టెస్టులో బరిలోకి దిగే చాన్స్ ఉంది. ఆది నుంచి దూకుడుగా ఆడి భారీ స్కోర్ చేసే లక్ష్యంతో ఇంగ్లాండ్ ఉంది. బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తేనే ఇంగ్లండ్‌ను కట్టడి చేసేందుకు అవకాశముంటుంది. ఏమాత్రం అదును దొరికినా ఇంగ్లండ్ బ్యాటర్లు విజృంభించే చాన్స్ ఉంది. ఓపెనర్లతోపాటు బెయిర్ స్టో, బెన్ స్టో ఫామ్‌లోకి వస్తే భారత్‌కు కష్టాలు తప్పవు. కాబట్టి, వీరిని త్వరితగతిన ఔట్ చేస్తేనే ఇంగ్లండ్‌పై ఒత్తిడి పెంచడానికి అవకాశం ఉంటుంది.

ప్రి క్వార్టర్స్‌కు శ్రీకాంత్, మంజునాథ్

థాయ్‌లాండ్ బ్యాడ్మింటన్ టోర్నీ

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో మిధున్ మంజునాథ్, కిదాంబి శ్రీకాంత్ ప్రత్యర్థులను చిత్తుచేసి రెండోరౌండ్‌కు చేరగా.. సమీర్ వర్మ, కిరణ్ జార్జి తొలిరౌండ్‌లోనే నిష్క్రమించారు. మిధున్ మంజునాథ్ 21-17, 21-8తో గుణవాన్(హాంకాంగ్), కిదాంబి శ్రీకాంత్ 22-20, 21-17తో జియాంగ్- జన్-హి (మలేషియా)ను వరుససెట్లలో ఓడించారు. ఇక కిరణ్ జార్జి 17-21తో తొలిసెట్ చేజార్చుకున్నాక.. గాయంతో మ్యాచ్‌నుంచి వైదొలిగాడు. దీంతో చైనా షట్లర్ లి-వాన్ రెండోరౌండ్‌కు చేరాడు. మరో పోటీలో సమీర్ వర్మ 14-21, 18-21తో 8వ సీడ్ లాంగ్ అంగస్(హాంకాంగ్) చేతిలో పోరాడి ఓడాడు.

విష్ణు శరవణన్‌కు ఒలింపిక్ బెర్త్

ఆడిలైడ్: 2023 ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించిన భారత సెయిలర్ విష్ణు శరవణన్ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. సెయిలింగ్ క్రీడాంశంలో భారత్ నుంచి అర్హత సాధించిన తొలి సెయిలర్ విష్ణునే కావడం గమనార్హం. ఆస్ట్రేలియాలోని అడిలైడ్ వేదికగా జరుగుతున్న ఐఎల్‌సిఎ-7 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రాణించిన విష్ణు శరవరణ్ పారిస్ బెర్తును దక్కించుకున్నాడు. ఈ ఈవెంట్‌లో ఆసియా ఖండం నుంచి ఏడు బెర్తులు ఉన్నాయి. మొత్తంగా 152 మంది పాల్గొంటున్న ఈ ఈవెంట్‌లో విష్ణు 26వ స్థానంలో, ఆసియా దేశాల తరఫున అగ్రస్థానంలో నిలిచాడు.

అశ్విన్‌కు టాప్ ర్యాంక్

ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్స్ (ఐసిసి) తాజాగా విడుదల చేసిన టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ 853 రేటింగ్ పాయింట్స్‌తో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. హైదరాబాద్ టెస్ట్‌లో 6 వికెట్లతో సత్తా చాటిన జస్‌ప్రీత్ బుమ్రా(825పాయింట్లు) ఒక స్థానం మెరుగు పరుచుకొని నాలుగో స్థానంలో నిలు వగా.. రవీంద్ర జడేజా(754పాయింట్లు) ఆరో స్థానానికి చేరాడు. సౌతాఫ్రికా స్టార్ పేసర్ కగిసో రబడా (851), ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్(828) రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. టెస్ట్ ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ తమ టాప్-2 ర్యాంకులను నిలబెట్టుకున్నారు. అక్షర్ పటేల్ ఒక స్థానం దిగజారి ఆరో స్థానంలో నిలిచాడు. టెస్ట్ బ్యాటర్స్ జాబితాలో విరాట్ కోహ్లీ ఒక్కడే టాప్-10లో నిలిచాడు. కోహ్లీ 767 రేటింగ్ పాయింట్స్‌తో ఆరో స్థానంలో ఉన్నాడు.

అభ్యంతరాల పరిష్కారానికి చర్యలు

ఎపిఇఆర్‌సి ఛైర్మన్ నాగార్జున రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో, విశాఖ బ్యూరో

విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన ఆదాయ, అవసరాల నివేదికల (ఎఆర్‌ఆర్)పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఛైర్మన్ జస్టిస్ సివి నాగార్జున రెడ్డి ఆదేశించారు. ఎఆర్‌ఆర్‌పై మూడు రోజులపాటు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. అభ్యంతరాలు వ్యక్తం చేసినవారిలో కొందరు కమిషన్ పరిధిలో లేని వాటిని కూడా ప్రస్తావించారని, వాటిని సంబంధిత అధికారులకు పంపిస్తామని తెలిపారు. కమిషన్ పరిధిలో ఉన్నవాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సబ్సిడీ విద్యుత్ నిధులు ప్రభుత్వం అందిస్తుంది : చక్రధర్ బాబు

విద్యుత్ చట్టం-2003కు లోబడి ఆయా రంగాల వినియోగదారులకు సబ్సిడీపై విద్యుత్‌ను అందించేందుకు నిధులను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉదని జెన్‌కో ఎమ్‌డి, ట్రాన్స్‌కో జెఎమ్‌డి కెవిఎన్ చక్రధర్ బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనను ఆయన చదివి వినిపించారు. ఉత్పాధకలో మెరుగుదల సాధించి, సాంకేతిక, వాణిజ్య నష్టాలు తగ్గించుకొని వినియోగదారులకు సేవలందించడమే లక్ష్యంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో వ్యక్తమైన అంశాలకు ఇపిడిసిఎల్ సిఎమ్‌డి ఐ పృథ్వీతేజ్, ఎస్‌పిడిసిఎల్, సిపిడిసిఎల్ సిఎమ్‌డి కె సంతోషరావు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు పివిరెడ్డి, ఠాకూర్ రామసింగ్, కార్యదర్శి డి రమణయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కొనుగోలు ధర నియంత్రించాలి : ప్రతాప్

ప్రతియేటా పెరుగుతున్న విద్యుత్ కొనుగోళ్లను నియంత్రించాలని ఎపిఎస్ఇబి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి ప్రతాప్ కోరారు. 2021-22లో సరాసరి విద్యుత్ కొనుగోలు ధర యూనిట్‌కు రూ.4.41 ఉంటే 2023-24లో రూ.5.13 పైసలు పెరిగిందన్నారు. 2024-25లో ఈ ధర పెరిగే అవకాశం ఉందన్నారు. మార్కెట్ ధర తగ్గించేందుకు జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో నిబంధనల ప్రకారం బొగ్గు నిల్వలు ఉంచాలని చెప్పారు. రాష్ట్రంలో ఏ విద్యుత్ ఎంత శాతం ఉండాలనే అధ్యయనం జరగలేదని, దీనిపై ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు వల్ల కేవలం 15-20 శాతం మాత్రమే గ్రాంటు వస్తుందని, మిగిలింది రుణం రూపంలో తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల డిస్కంలపై భారం పడుతుందన్నారు. రెవెన్యూ వసూలు తక్కువ ఉన్నచోటే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. వ్యవసాయ పంపుసెట్లకు కూడా స్మార్ట్‌మీటర్లు పెట్టడం వల్ల రెండు సార్లు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగులకు డిఎ బకాయిలు లేకుండా చెల్లించాలని కోరారు.

బహుళ వార్షిక కాలవ్యవధి 2024-29 నియంత్రణ కాలానికి సంబంధించిన ఎఆర్‌ఆర్‌పై విద్యుత్ రంగ నిపుణులు ఎం వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ.. మెటీరియల్ కొనుగోళ్లకు డిస్కంలు వేలకోట్లు ప్రతిపాదనలు ఇస్తున్నాయని తెలిపారు. అధిక ధరకు వీటిని కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. వీటిపై వివరాలను కోరుతున్నా వాస్తవాలు బయట పెట్టకుండా అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధిక ధరకు కొనుగోలు చేసి వినియోగదారులపై భారాలు మోపుతున్నారని తెలిపారు. మెటీరియల్ కొనుగోళ్లపై కమిషన్ దృష్టి సారించాలని కోరారు. ఎపి ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ తదితరులు పాల్గొని తమ అభ్యంతరాలు తెలియజేశారు.

16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయండి

- రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ఐక్యవేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ఫిబ్రవరి 16న చేపట్టనున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు అధ్యక్షతన విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో రైతు, కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, నాయకులు ప్రసాద్, పి జమలయ్య, కౌలు రైతు సంఘం నాయకులు హరిబాబు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె సుబ్బరావమ్మ తదితరులు మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుండి గట్టెక్కించేందుకు స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఒక పర్యాయం రైతులకు రుణమాఫీ చేయాలని, కేరళ తరహాలో రుణ ఉపశమనం చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతన చట్టం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని, ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో రూ.రెండు లక్షల కోట్లు కేటాయించి 200 రోజులు పని దినాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో పెద్దయెత్తున కార్మిక వర్గం, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనకాపల్లి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ ఎ బాలకృష్ణ అకాల మరణానికి ఈ సమావేశం నివాళులర్పించింది. కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో ఎఐకెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి వెంకటరెడ్డి, ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక కన్వీనర్ చుండూరు రంగారావు తదితరులు మాట్లాడారు. రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి బాలు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వరరావు, జాగృతి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరీదు ప్రసాద్, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు పోలారి, రవిచంద్ర, ఎఐకెఎంఎస్ రాష్ట్ర నాయకులు యు వీరబాబు, రిటైర్డు ఐఎఎస్ బండ్ల శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ, పివి ఆంజనేయులు, జొన్న శివశంకర్, కె అజయ్ కుమార్, కోటా కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

21 మంది ఎఎస్‌పిలు బదిలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 21 మంది అడిషనల్ ఎస్‌పిలు బదిలీ అయ్యారు. ఈ మేరకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి హరీష్ కుమార్ గుప్త బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం క్రైమ్ విభాగంలో పనిచేస్తున్న టిపి విఠలేశ్వర్‌ను ఎసిబి అడిషనల్ ఎస్‌పిగా వేశారు. అలాగే శ్రీకాకుళం అడ్మిన్‌గా వున్న జె తిప్పేస్వామిని అప్పా అడిషనల్ ఎస్‌పిగా, విజయనగరం ఎస్ఇబిలో వున్న ఎస్ వెంకట్రావును విశాఖపట్నం ఎస్‌బి డిసిపిగా, కాకినాడ ఎస్ఇబిలో వున్న ప్రేమ్ కాజల్‌ను శ్రీకాకుళం జిల్లా అడ్మిన్‌గా, పాడేరులో వున్న పి అనిల్‌కుమార్‌ను రాజమండ్రి అడిషనల్ ఎస్‌పిగా, రాజమండ్రి అడిషనల్ ఎస్‌పి జి స్వరూపారాణిని ఏలూరు అడ్మిన్‌గా, ఏలూరులో అడ్మిన్‌గా వున్న ఎంవివి భాస్కర్‌రావును కాకినాడ అడ్మిన్‌గా, విజయవాడ అడిషనల్ డిసిపి జివి రమణమూర్తిని గుంటూరు అడ్మిన్‌గా, విజయవాడ అడిషనల్ డిసిపి సిహెచ్ లక్ష్మీపతిని పల్నాడు క్రైమ్‌కు, కృష్ణా అడ్మిన్‌లో వున్న ఆర్ శ్రీహాన్‌బాబును విజయవాడ డిసిపిగా, గుంటూరు అడ్మిన్‌గా వున్న కె సుప్రజను ఎసిబి అడిషనల్ ఎస్‌పిగా, చిత్తూరు ఎస్ఇబిలో వున్న కె శ్రీలక్ష్మిని కాకినాడ ఎస్ఇబికి, కడప ఎస్ఇబిలో వున్న కె ప్రవీణ్‌కుమార్‌ను నంద్యాల అడ్మిన్‌గా, నంద్యాల అడ్మిన్‌లో వున్న జి వెంకటరాముడును కడప ఎస్ఇబికి, ఏలూరు ఎస్‌సి, ఎస్‌టి సెల్‌లో వున్న బి ఉమామహేశ్వరరావును శ్రీకాకుళం క్రైమ్‌కు, విశాఖపట్నం అడిషనల్ డిసిపి ఇ నాగేంద్రుడును ఎసిబి అడిషనల్ ఎస్‌పిగా వేశారు. అలాగే వెయిటింగ్‌లో వున్న ముగ్గురు అడిషనల్ ఎస్‌పిలు ఎల్ సుధాకర్‌ను కడప అడ్మిన్‌గా, ఎవి సుబ్బరాజును చిత్తూరు ఎస్ఇబికి, టి కనకరాజును విజయవాడ డిసిపిగా వేశారు. అలాగే పల్నాడు క్రైమ్‌లో వున్న ఎస్‌కె చంద్రశేఖర్ జనవరి 31న రిటైర్డు అయినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68